
దర్శించండి - తరించండి
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం
కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.
సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...
శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి
శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్
A/c No. 30178925930, IFSC No. SBIN0010105
మరిన్ని వివరాలకు : 08573-281112, 281747



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

Circulated Telangana & Andhra Pradesh States



Y. Sreedevi
Proprietor
9397317951
Cell: 9515348320
GST : 36AHXPY3131E1ZX
NANDINI MEMENTOS
Corporate Gifting & Printing Services
Specialists in Medals*Gift Items*Shalls

E.mail- nandinimementos2@gmail.com
Chikkadpally, Hyderabad 500 020.



సంపుటి : 23 | సంచిక : 226 | ది. 13-11-2024 | విజయవాడ | బుధవారం | పేజీలు : 8 | వెల : రూ.1/-


# ఎమ్మెల్యేలంతా ప్రజలతో మమేకమవ్వాలి

● 2029లో మీ అందరినీ ఎమ్మెల్యేలుగా మళ్లీ గెలిపించుకోవాలనుకుంటున్నా ● ఎమ్మెల్యే చైర్మన్ గా ప్రతి నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు ● నియోజకవర్గాల్లో టూరిజం అభివృద్ధికి డాక్యుమెంట్ సిద్ధం చేయాలి ● గత ఐదేళ్లలో దెబ్బతిన్న వ్యవస్థలను గాడిన పెట్టాం...ఇక వేగం పెంచాల్సి ఉంది ● ఉచిత ఇసుక విధానం సక్రమంగా అమలు చేయాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలదే ● సమస్యలుంటే నా దృష్టికి తెస్తే కఠిన చర్యలు తీసుకుంటా ● ఎన్డీయే శాసన సభా పక్ష సమావేశంలో సీఎం చంద్రబాబు నాయుడు ● చంద్రబాబు ఆలోచనలను ముందుకు తీసుకెళ్తామన్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్





**అమరావతి, నవంబర్ 12 (వార్తాప్రభ) :** ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 150 రోజులైంది. ఈ 150 రోజుల్లో దెబ్బతిన్న వ్యవస్థలను పునర్నిర్మిస్తూ ముందుకెళ్తున్నాం. నేను నాలుగో సారి సీఎం అయ్యా...కానీ ఎప్పుడూ ఇంతటి వ్యవస్థల విధ్వంసం చూడలేదు. వ్యవస్థలన్నీ పతనావస్థకు చేరాయి. లోతుకు వెళ్లే కొద్దీ భయంకర విషయాలు బయటపడుతున్నాయి. వాటన్నింటినీ గాడిన పెట్టాం...ఇక వేగం పెంచాల్సిన అవసరం ఉంది. అధికారంలోకి రాగానే 7 శ్వేత పత్రాలు విడుదల చేశాం. ఐదేళ్ల విధ్వంసాలను వాస్తవ రూపంలో ప్రజలకు వివరించాలని శ్వేతపత్రాలు విడుదల చేశాం. ప్రజలు గెలవాలి..రాష్ట్రం నిలవాలని ఎన్నికల ముందు పిలుపునిచ్చాం. ప్రజలు మన పక్షాన నిలిచి గెలిపించారు...ఇప్పుడు వారి ఆకాంక్షలను నెరవేర్చాలి. సూపర్-6, ఇతర హామీలను ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చాం. కేంద్రం సహకరించకుండా ఉంటే చాలా ఇబ్బందులు పడేవాళ్లం. మనం కలిసి పోటీ చేయడం, ఢిల్లీలో ఎన్డీయే ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడంతో రాష్ట్రానికి చేయూత లభిస్తోంది. ఒక్కో అడుగు వేసుకుంటూ సమస్యలు పరిష్కరించుకుంటున్నాం మనం చేసిన పనులు ప్రజలకు వివరిస్తూ ఒక్కొక్కటి అధిగమించడం వల్ల ప్రజల్లో విశ్వాసం పెరుగుతుంది. 7 శ్వేతపత్రాల్లోని అంశాలు ఎంతమందికి తెలిస్తే అంత మంచిది. 150 రోజుల్లో అనేక హామీలు అమలు చేసి, పలు కార్యక్రమాలు చేపట్టాం. పెన్షన్ సామాజిక పెన్షన్లు రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు, కిడ్నీ పేషెంట్లకు రూ.10 వేలు, మంచానికే పరిమితమైన వారికి రూ.15 వేలకు పెన్షన్ పెంచాం.64 లక్షల మందికి ఏ రాష్ట్రంలో ఇవ్వని స్థాయిలో పెన్షన్లు అందిస్తున్నాం. అన్న క్యాంటీన్లతో పాటు దీపావళి నుండి దీపం 2 పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్ కూడా అందిస్తున్నాం. చెప్పిన సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడంతో పాటు అభివృద్ధిని కూడా జోడెద్దుల బండి మాదిరి ముందుకు తీసుకెళ్తాం. అభివృద్ధి చేస్తే సంపద పెరుగుతుంది..సంపద పెరిగితే సంక్షేమ కార్యక్రమాలు మరిన్ని అమలు చేయవచ్చు. స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్ 2047 డాక్యుమెంట్ ను రూపొందిస్తున్నాం. 2047 నాటికి 43 వేల డాలర్ల తలసరి ఆదాయం లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటికే శాండ్, యాంటీ ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్, లిక్కర్ పాలసీలు ప్రవేవపెట్టాం. దీనిపైనా అసెంబ్లీలో చర్చలు జరగాల్సి ఉంది. క్లీన్ ఎనర్జీ, డ్రోన్, ఎలక్ట్రానిక్ పాలసీ, ఫుడ్ ప్రాసెసింగ్, ఇన్ ఫ్రా స్ట్రక్చర్ పాలసీలు కూడా తెచ్చాం. రాబోయే ఐదేళ్లు మీరు టూరిజంపై శ్రద్ధ పెడితే ఉపాధి అవకాశాలు పెద్ద ఎత్తున పెరుగుతాయి. రాష్ట్రంలో టూరిస్టులు ఒక్కరోజు మాత్రమే ఉంటున్నారని టాటా సంస్థ ప్రతినిదులు కూడా చెప్పారు. మన రాష్ట్రంలో మంచి ప్రదేశాలు ఉన్నా హొటల్స్, ఇతర వసతులు లేవని అంటున్నారు. టూరిజానికి కావలసింది కనీసం రూములు, హాస్పిటల్స్, ఈవెంట్స్, ట్రావెల్ సదుపాయాలు. గండికోట టాప్ 10 స్థానాల్లో ఒకటి. రాష్ట్రంలో మంచి రిజర్వాయర్లు, హిల్స్, టైగర్ జోన్ వంటి ప్రాంతాలున్నా మార్కెటింగ్ చేయలేకపోయాం. టెంపుల్స్ లో తిరుమల, కాణిపాకం, లేపాక్షి, శ్రీశైలం, కనకదుర్గమ్మ దేవాలయం, అన్నవరం వంటివి ఉన్నాయి. వీటన్నింటినీ బేరీజు వేసుకుని టూరిజంను అభివృద్ధి చేయాలి. ఎస్సీ వర్గీకరణపైనా ఇప్పటికే ఎమ్మెల్యేలతో మాట్లాడాం. జిల్లా వారీగా ఏబీసీ కేటగిరీలు పెట్టి జిల్లా, జోన్, స్టేట్ వారీగా కమిటీలు వేసి అమలు చేస్తాం. 2028 లేదా 2027 నాటికే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసేలా లక్ష్యం పెట్టుకున్నాం. కేంద్రం కూడా రూ.12,500 కోట్లు నిధులు ఇచ్చింది. దీంతో ఫేజ్ 1 ప్రాజెక్టు పూర్తవుతుంది. ఫేజ్ 2 లో ఆర్ అండ్ ఆర్, భూ సేకరణ సమస్యలు పరిష్కారం అవుతాయి. మలివిడత నదుల అను సంధానికి కూడా ఆలోచన చేస్తున్నాం.

# సదర్ పై లాఠీ ఛార్జ్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

● అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర కార్యదర్శి ఎలగనమోని రవి కుమార్ యాదవ్



**మహబూబ్ నగర్,నవంబర్ 12 (వార్తాప్రభ) :** షాద్ నగర్ పట్టణం లో ఆదివారం నిర్వహించిన సదర్ కార్యక్రమం లో సదర్ నిర్వాహకులు, యాదవ కులాపెద్దల పై లాఠీ ఛార్జ్ చేసి గాయపరిచిన పోలీస్ ల పై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర కార్యదర్శి, సీనియర్ న్యాయవాది ఎలగనమోని రవికుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా సదర్ నిర్వహించేందుకు జీవో ఇచ్చిన, విషయం పోలీసులకు గుర్తులేదా అని ప్రశ్నించారు. స్టేజ్ పై ఇద్దరి యువకుల మధ్య జరిగిన గొడవను కుల పెద్దలు సర్దిచెప్తుండగా, పోలీసులు స్టేజ్ పై కి ఎక్కి లాఠీ ఛార్జ్ చేయడం దుర్మార్గమని అన్నారు. లా అండ్ ఆర్డర్ పరిరక్షణ చేయాలిసిన పోలీసులే లాఠీ ఛార్జ్ చేయడం దుర్మార్గమన్నారు..యాదవ సమాజాన్ని అవమాన పరిచిన పోలీసుల పై ఉన్నతధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# వెస్ట్ నియోజకవర్గ కు వేస్ట్ ఫెలో మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్

● ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్ ఎద్దేవా



**విజయవాడ పశ్చిమ,నవంబర్ 12 (వార్తాప్రభ) :** పశ్చిమ నియోజకవర్గానికి వెస్ట్ ఫెలో వెలంపల్లి శ్రీనివాస్ అని ఎన్టీఆర్ జిల్లా బిజెపి అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్ ఎద్దేవాచేశారు. రెండు పర్యాయాలు శాసన సభ్యునిగా పనిచేసిన వెలంపల్లి శ్రీనివాస్ పశ్చిమ నియోజకవర్గానికి ఏ విధంగా అభివృద్ధి చేశాడో చెప్పాలన్నారు. భవానిపురం లోని ఎన్డీఏ కార్యాలయంలో ఇటీవల ఎన్డీఏ కూటమిలో చేరిన కార్పోరేటర్లతో కలిసి అడ్డూరి శ్రీరామ్ మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసనసభ్యులు సుజనా చౌదరిని విమర్శించే అర్హత , స్థాయి శ్రీనివాస్ కు లేవన్నారు. శాసన సభ్యునిగా మంత్రిగా పనిచేసిన వెలంపల్లి ప్రతి పనికి ఒక రేటు కట్టి అవినీతి చక్రవర్తిగా మారి వందలకోట్ల సంపదను దోచుకున్నాడని ధ్వజమెత్తారు. ప్రజా సమస్యలను ఏమాత్రం పట్టించుకోకుండా ప్రజలని, ప్రభుత్వ అధికారులను, వ్యాపారస్తులను సైతం బెదిరిస్తూ నియోజకవర్గానికి గ్రహణం లా పట్టుకున్న వేస్ట్ ఫెలో అన్నారు .ఎన్నికల్లో వెలంపల్లి ని ఓడిస్తారని తెలిసే పక్క నియోజకవర్గానికి ట్రాన్ఫర్ చేశారన్నారు .అక్కడ కూడా తన్ని తరిమేశారని తన ఉనికిని కాపాడుకోవడానికి వెలంపల్లి ప్రయత్నం చేస్తున్నాడన్నారు. ఎమ్మెల్యే సుజనా చౌదరి పారదర్శక పాలన అందిస్తూ సుజనా ఫౌండేషన్ ద్వారా విద్య , వైద్యం, మౌలిక సదు-పాయాలను మెరుగుపరుస్తూ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నారని అలాంటి వ్యక్తి గురించి లేనిపోని అవాకులు, చవాకులు పేలితే తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు.

**వెలంపల్లి కాదు వసూళ్ళ పల్లి తెదేపా నాయకులు..** మైలవరపు దుర్గరావు మాట్లాడుతూ వెలంపల్లి వసూళ్ళ పల్లి అని కప్పం కట్టకపోతే అభివృద్ధి పనులను కూడా అడ్డుకుంటారని టిడిపి నాయకులు మైలవరపు దుర్గారావు ధ్వజమెత్తారు. సుజనా చౌదరి గురించి నియోజకవర్గ అభివృద్ధి గురించి మాట్లాడేటప్పుడు ఒళ్ళు దగ్గర పెట్టుకోవాలన్నారు. నీ దోపిడీలు, అరాచకాలు, దుర్మార్గాలను ఎండ కడతామన్నారు. వందల కోట్ల అవినీతి సొమ్ము ఏ విధంగా సంపాదించావో చెప్పాలన్నారు. మంత్రి పదవిని అడ్డం పెట్టుకొని అమ్మవారి సంపాదన కూడా దోచుకున్న ఘనుడు వెలంపల్లి అన్నారు. అమ్మవారి ఆలయంలో ప్రమాణం చేసి వెలంపల్లి నిజాయితీ నిరూపించుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వంలో, సుజనా చౌదరి నాయకత్వంలో పశ్చిమ లోని ప్రజలు, వ్యాపారస్తులు స్వేచ్ఛగా, సజావుగా తమ వ్యాపారాలను నిర్వహించుకుంటున్నారని తెలియజేశారు. లేబర్ కాలనీ ఇండోర్ స్టేడియం పూర్తి చేయలేని అసమర్థ మాజీ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ అని అన్నారు. స్టేడియం నిర్మాణ పనుల్లో మేయర్ భాగ్యలక్ష్మి తో కలిసి కాంట్రాక్టర్లను బెదిరించి దోచుకోవాలని చూశారని అందువల్లే లేబర్ కాలనీ ఇండోర్ స్టేడియం పూర్తి కాలేదని చెప్పారు. ఇటీవల పశ్చిమ నియోజకవర్గంలో వరదలు సంభవించినప్పుడు వెలంపల్లి ఎక్కడ దాక్కున్నాడని ప్రశ్నించారు. సుజనా చౌదరి నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధితులకు బాసటగా నిలబడ్డాడని పది రోజులు పాటు వరద బాధితులకు లక్ష మందికి పైగా నిరంతరం ఆహారాన్ని , వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారన్నారు. సుజనా చౌదరి గురించి మాట్లాడి అర్హత వెలంపల్లి కు లేదన్నారు, అధికారాన్ని అడ్డం పెట్టుకొని వెలంపల్లి అక్రమాలు, అన్యాయాలు, దౌర్జన్యాలను చేసాడన్నారు. సుజనా చౌదరి ప్రజా ప్రతినిధిగా అన్ని పార్టీల సహకారంతో సంక్షేమాన్ని అందించాలని వైసిపి కార్పొరేటర్ లను నియోజకవర్గ అభివృద్ధి గురించి ఆహ్వానించారని తెలిపారు. చేతనైతే అభివృద్ధికి సహకరించాలని లేకపోతే మూసుకొని ఉండాలన్నారు. డొల్లతనం కప్పిపుచ్చుకునేందుకు కూటమి ప్రభుత్వం మీద సుజనా చౌదరి మీద విమర్శలు చేస్తే తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. టిడిపి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు (చంటి) మాట్లాడుతూ తన సామాజిక వర్గానికి న్యాయం చేసుకుంటూ ఇతరులను ప్రజా ప్రతినిధులను అనేక ఇబ్బందులకు గురి చేస్తూ అభివృద్ధికి అడ్డంపడ్డ వెలంపల్లి ని నియోజకవర్గ ప్రజలు తన్ని తరిమేశారన్నారు. కులమతాలకతీతంగా సుజనా చౌదరి పరిపాలన చేస్తున్నాడని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గుడివాడ నరేంద్ర రాఘవ, మహాదేవ అప్పాజీ, అత్తులూరి పెదబాబు, మైలవరపు కృష్ణ, అర్షద్, తదితరులు పాల్గొన్నారు.

# పెట్టుబడుల సాధనలో ఏపీ జోరు మీద ఉంది

● ప్రభుత్వ నూతన పాలసీలు సత్ఫలితాలను ఇస్తున్నాయి ● భారీ ప్రాజెక్టులకు ఎస్కార్ట్ ఆఫీసర్లుగా ఐఎఎస్ అధికారులు ● స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కు ఏపీ కేంద్రంగా నిలుస్తుంది ● కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్రాజెక్టులపై రిలయన్స్ తో ఒప్పందం చారిత్రాత్మకం : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ● ఏపీలో రూ.65 వేల కోట్లతో కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రభుత్వంతో రిలయన్స్ ఇండస్ట్రీస్ ఒప్పందం ● ప్రాజెక్టు ద్వారా రాష్ట్రానికి రూ.57,650 కోట్ల ఆదాయంతో పాటు 2. 5 లక్షల మందికి ఉద్యోగ , ఉపాధి అవకాశాలు





**అమరావతి,నవంబర్ 12 (వార్తాప్రభ) :** పెట్టుబడుల సాధనలో ఏపీ జోరు మీద ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన పారిశ్రామిక పాలసీలు సత్ఫలితాలను ఇస్తున్నాయని సీఎం అభిప్రాయ పడ్డారు. ఏపీలో రూ.65 వేల కోట్లతో కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రభుత్వంతో రిలయన్స్ ఇండస్ట్రీస్ ఒప్పందం చేసుకుంది. సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఈ ఎంవోయూ జరిగింది. ఈ ఒప్పందం ద్వారా 500 కంప్రెస్ట్ బయోగ్యాస్ ప్లాంట్ల ద్వారా రాష్ట్రానికి రూ.57,650 కోట్ల ఆదాయంతో పాటు 2.5 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రానున్నాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ...నేటి ఒప్పందం గొప్ప ముందడుగు అన్నారు. పెట్టుబడులకు రాష్ట్రంలో అనుకూల పరిస్థితులు ఉన్నాయని..స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కు ఎపి కేంద్రంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. ఇలాంటి భారీ ప్రాజెక్టులకు ఎస్కార్ట్ ఆఫీసర్లుగా ఐఎఎస్ అధికారులను నియమించి....ఎటువంటి ఇబ్బందులు లేకుండా వేగంగా ప్రాజెక్టులు పూర్తి చేస్తామని సిఎం అన్నారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ నేడు ఇంధన శాఖతో చేసుకున్న ఈ ఒప్పందాన్ని ముందుకు తీసుకువెళ్లేందుకు ట్రాన్స్ కో జెయింట్ మేనేజింగ్ డైరెక్టర్ కీర్తిని ఎస్కార్ట్ ఆఫీసర్ గా నియమిస్తున్నామని సీఎం తెలిపారు. రిలయన్స్ తో ఒప్పందం సంతోషకరమని....500 సిబిజి ప్లాంట్స్ మూడేళ్లలో ఏర్పాటు అవుతాయని అన్నారు. ఒక్కో ప్లాంట్ రూ.130 కోట్లతో రూ.65 వేల కోట్ల పెట్టుబడులు....2.5 లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు వస్తాయని సీఎం తెలిపారు. దీని ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం రావడంతో పాటు...పర్యావరణానికి మేలు జరుగుతుందని సీఎం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరుపున సాలిడ్ వేస్ట్ ను ప్లాంట్స్ కు ఇస్తామని...వాటి ద్వారా కూడా గ్యాస్ ఉత్పత్తి చేయాలని సిఎం సూచించారు. మున్సిపల్ సాలిడ్ వేస్ట్ ద్వారా కూడా ఉత్పత్తి సాధ్యం అయ్యేలా ప్లాంట్ల నిర్మాణం చేపడతామని రిలయన్స్ ప్రతినిధులు తెలిపారు. క్లీన్ ఎనర్జీ పాలసీ 2024 తెచ్చాం. దీని ద్వారా రూ.10 లక్షల కోట్లు పెట్టుబడులు సాధించాలి అని లక్ష్యంగా పెట్టుకున్నామని, క్లీన్ ఎనర్జీపై యూనివర్సిటీ కూడా ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ఉన్నామని సీఎం అన్నారు. క్లీన్ ఎనర్జీ పాలసీ మంచి ఫలితాలు తెస్తుందని, సోలార్, విండ్ తో పాటు పంప్డ్ ఎనర్జీ కోసం వెళుతున్నాం అని సిఎం అన్నారు. ఒక కుటుంబం, ఒక పారిశ్రామిక వేత్త అనేది మా నినాదమని, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా కొత్త ఆవిష్కరణలు తీసుకువస్తామని తెలిపారు. రిలయన్స్ లాంటి సంస్థలు దీనికి సహకరించాలని కోరారు. 20 లక్షల ఉద్యోగాల కల్పనకు మంత్రి లోకేష్ సబ్ క్యాబినెట్ చైర్మన్ గా ఉన్నారని...ఆ బాధ్యతను నెరవేర్చే క్రమంలో నేటి ఒప్పందం కీలక ముందడుగు అన్నారు. మంత్రులు గొట్టిపాటి రవి కుమార్, టీజీ భరత్ లు వేగంగా నిర్ణయాలు తీసుకుని ప్రాజెక్టు ఒప్పందం జరగడానికి దోహద పడ్డారని ముఖ్యమంత్రి ప్రశంసించారు.

**20 లక్షల ఉద్యోగాల కల్పనలో కీలక అడుగు:- నారా లోకేష్**

రిలయన్స్ ఇండస్ట్రీస్ సంస్థతో జరిగిన నేటి ఒప్పందం 20 లక్షల ఉద్యోగాల కల్పనకు ఇది ముందడుగని మంత్రి నారా లోకేష్ అన్నారు. 20 లక్షల ఉద్యోగాల కల్పన పై ఏర్పాటైన మంత్రుల సబ్ కమిటీకి చైర్మన్ గా ఉన్న మంత్రి లోకేష్ మాట్లాడుతూ.....తమ లక్ష్య సాధనలో 2.5 లక్షల ఉద్యోగాలు ఈ ఒప్పందం ద్వారా వస్తాయని చెప్పారు.

# సీఎం చంద్రబాబుతో కలిసి పనిచేయడం నా అదృష్టం

● నాయకులను తీర్చిదిద్దే ఫ్యాక్టరీ సీఎం ● మీటనొక్కడమే పరిపాలన కాదు ● వర్క్ షాప్ లో చాలా విషయాలు నేర్చుకున్నాం ● రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సుభాష్



**అమరావతి,నవంబర్ 12 (వార్తాప్రభ) :** ఆంధ్ర రాష్ట్ర రథసారథి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలన మార్క్ ఈ బడ్జెట్లో సుస్పష్టంగా కని పించిందని,కూటమి సర్కార్ ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్ చూస్తే ప్రతి ఒక్కరికి ఈ విషయం అవగతం అవుతుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు.అసెంబ్లీ సమావేశాల రెండో రోజైన మంగళవారం స్పీకర్ అయ్యన్నపాత్రుడు, సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన వర్క్ షాప్ లో మంత్రి సుభాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ 2024-25 బడ్జెట్ పట్ల అన్ని వర్గాల ప్రజల్లో ఆనందం వెల్లి విరుస్తుందని,అభివృద్ధి, సంక్షేమం కలబోతగా బడ్జెట్ ఉందని అన్ని వర్గాల ప్రజలు,అన్ని రంగాలకు సమాన ప్రాధాన్యత ఇస్తూ పెద్ద పీట వేశారని సుభాష్ పేర్కొన్నారు.రాష్ట్ర బడ్జెట్లో సమతుల్యత పాటించడం ద్వారా అన్ని వర్గాల ప్రజలు కూటమి ప్రభుత్వానికి' జై' కొడుతున్నారని,ఇది మంచి శుభ పరిణామం అన్నారు.రాష్ట్ర భవిష్యత్తును స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యంగా ఈ బడ్జెట్ రూపకల్పన చేశారని మేధావులు విశ్లేషిస్తున్నారని, సామాన్య,మధ్యతరగతి ప్రజల నుంచి, విద్యావంతుల వరకు బడ్జెట్ కేటాయింపులపై సీఎం చంద్రబాబు నాయుడు సుదీర్ఘ అనుభవం స్పష్టంగా కనిపిస్తుందని మంత్రి సుభాష్ తెలిపారు. "నాడు ఒక్కో కుటుంబంలో ఒక ఉద్యోగి ఉండాలనే నినాదం నుంచి ఇప్పుడు ఒక్కో కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్త" ను తయారు చేయాలనే నినాదం,దృఢ సంకల్పంతో ప్రభుత్వం వడివడిగా ముందుకు అడుగులు వేస్తుందని అన్నారు.రాష్ట్రంలో ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు,అవకాశాల కల్పన,సంపద సృష్టి, మౌలిక సదుపాయాలు, సహజ వనరులు, మానవ వనరులు పుష్కలంగా ఉన్నాయని,ఈ వనరులను, రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులను, అవకాశాలను సక్రమంగా వినియోగించుకుంటే భావితరాలు కు ఒక స్వర్ణ యుగమే అని మంత్రి ఆనందం వ్యక్తం చేశారు.గత ప్రభుత్వ చీకటి పాలనను అధిగమించి ప్రగతి పునః ప్రారంభనికి ఇది తొలిమెట్టుగా చెప్పుకోవచ్చు అన్నారు. గత జగన్ ప్రభుత్వం బటన్ నొక్కుడు కార్యక్రమం తప్ప అభివృద్ధి వైపు కన్నెత్తి చూడలేదని విమర్శించారు.లోప భూయిష్ట ఎక్సైజ్,ఇసుక విధానాలు,సహజ వనరుల దోపిడీ, అరాచక కార్యక్రమాలుతో రాష్ట్ర ఆదాయానికి భారీగా గండి కొట్టారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల నిధులు దారి మళ్లించి రాష్ట్ర భవిష్యత్తు ఆదాయాన్ని గణనీయంగా తగ్గించారని ఆందోళన వ్యక్తం చేశారు.స్థానిక సంస్థల నిధులు సైతం దారి మళ్ళించి, ముఖ్యమైన ప్రాజెక్టులు సైతం గాలికి వదిలేసారు అన్నారు.ఎస్సీ, బీసీ కార్పొరేషన్ల నిధులు దారి మళ్ళించి వారి పురోభివృద్ధికి ఆటంకం తొలగించారన్నారు. ఉమ్మడి రాష్ట్ర సీఎంగా చంద్రబాబు నాయుడు హైదరాబాదును తీర్చి దిద్దిన తీరు వర్ణనాతీతంగా మంత్రి అభివర్ణించారు. అంతకుమించి ప్రస్తుతం ఊహకు అందని రీతిలో ఐదు కోట్ల ఆంధ్రుల కలల సౌధం,రాజధాని అమరావతిని తీర్చిదిద్దుతారని ఆశాభావం వ్యక్తం చేశారు.ముఖ్యంగా బడ్జెట్లో అన్నదాతకు అగ్ర తాంబూలం వేసి వ్యవసాయ రంగానికి ఊపిరి పోసారన్నారు. విద్యా,వైద్య రంగాలకు భారీ కేటాయింపులు చేశారన్నారు.అలాగే పరిశ్రమలు,వాణిజ్య రంగానికి రూ.3,127 కోట్లు కేటాయించడం పట్ల మంత్రి సుభాష్ సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు చెప్పారు. 2024 -25 బడ్జెట్లో యు-వతకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని అన్నారు. ఎన్నికల హామీలైన సూపర్ సిక్స్ అమలుకు భారీగా నిధులు కేటాయించడం పట్ల కూటమి ప్రభుత్వంపై ప్రజలకు అపారమైన నమ్మకం కలిగిందన్నారు. గ్రేట్ విజనరీ,అభివృద్ధి ప్రదాత సీఎం చంద్రబాబు మంత్రి వర్గంలో తాను పనిచేయడం ఎంతో ఆత్మసంతృప్తి కలిగిస్తుందన్నారు. రాష్ట్రాన్ని నాలెడ్జి హబ్ గా తీర్చిదిద్ది పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు సిఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్,మంత్రి లోకేష్ లు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారన్నారు. బీసీల అభివృద్ధి, సంక్షేమానికి రూ.39 వేల కోట్లు కేటాయించి బీసీల పట్ల సీఎం కున్న ప్రేమను చాటి చెప్పారన్నారు. త్వరలోనే బీసీల రక్షణ చట్టం కూడా రూపుదిద్దుకుంటుందన్నారు. రాష్ట్రంలోని బిసి స్టడీ సర్కిల్స్ ఆధ్వర్యంలో డీఎస్సీకు సన్నద్ధమయ్యే నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ అందించి వారికి ఉద్యోగ అవకాశాలు పొందేందుకు అవకాశం కల్పించారన్నారు.

# శ్రీసిటీ శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ముగిసిన భాగవత సప్తాహ మహోత్సవం



**తిరుపతి,నవంబర్ 12 (వార్తాప్రభ) :** శ్రీసిటీ శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో చేపట్టిన భాగవత సప్తాహ మహోత్సవం మంగళవారం దిగ్విజయంగా ముగిసింది. శ్రీసిటీ శ్రీవాణి సౌజన్యంతో భాగవత భక్త సమాజ సభ్యులు ఈ నెల 6న ఆలయ ఆవరణలో భాగవత సప్తాహ మహోత్సవం ప్రారంభించారు. బయపు రెడ్డి, ఎస్.రామస-ుబ్బారెడ్డి నేతృత్వంలో 12 మంది బృంద సభ్యులు వారం రోజుల పాటు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6:30 గంటల వరకు అత్యంత భక్తి శ్రద్ధలతో 12 స్కంధాలతో కూడిన 335 అధ్యాయాలు, 18 వేల భాగవత శ్లోకాలను పఠనం గావించి, మంగళవారం మధ్యాహ్నం ప్రత్యేక పూజలతో కార్యక్రమం పూర్తిచేశారు. ఆధ్యాత్మిక జ్ఞాన సముపార్జన చేసే క్రమంలో భాగవత వైశిష్ట్యాన్ని వివరిస్తూ రాష్ట్రమంతటా ప్రతినెలా భక్తులు కోరిన చోట ఈ భాగవత భక్త సమాజ బృందం వారు భాగవత సప్తాహ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు 391 సప్తాహాలు పూర్తిచేయగా, శ్రీసిటీలో 392 వ కార్యక్రమం నిర్వహించినట్లు బృంద సభ్యులు తెలిపారు. పచ్చదనం నిండిన చల్లని ఆహ్లాదకర వాతావరణంలో శ్రీసిటీ ఆలయంలో వారం రోజుల భాగవత సప్తాహం తమకు ఎంతో హాయిని, సరికొత్త అనుభూతిని ఇచ్చిందని వారు పేర్కొన్నారు. అన్ని వసతులు సమకూర్చి తమకు ఈ అవకాశం కల్పించిన శ్రీసిటీ యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. చివరిరోజు కార్యక్రమంలో పాల్గొని, భాగవత భక్త సమాజ బృందానికి కృతజ్ఞతలు తెలిపిన డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, శ్రీసిటీలో శ్రీమద్భాగవత సప్తాహం చేయడం మన సమాజానికి అత్యంత ప్రయోజనకరమైన యజ్ఞం వంటిదని, మొత్తం బృందం యొక్క దైవిక ప్రయత్నాన్ని ఆయన అభినందించారు. భాగవత భక్త సమాజ సభ్యులను శాలువాలతో సత్కరించి, స్వామి వారి తీర్థ, అన్న ప్రసాదాలను అందచేశారు. చిన్మయ విద్యాలయ విద్యార్థులు, పరిసర గ్రామాల ప్రజలు చివరిరోజు భాగవత సప్తాహంలో భగవద్గీత పఠనం చేయడంతో పాటు శ్రీవేంకటేశ్వర స్వామి వారి ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. శ్రీసిటీ ప్రతినిధులు మధు రెడ్డి, పి.బి.ఎస్.శాస్త్రి, పల్లేటి బాలాజీ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# పెడన క్రీడాకారులకు పవర్ లిఫ్టింగ్ పోటీల్లో19 రాష్ట్రస్థాయి పతకాలు




**పెడన,నవంబర్ 12 (వార్తాప్రభ) :** పెడన కు చెందిన క్రీడాకారులు ఎనిమిది మంది రాష్ట్రస్థాయిలో 19 పతకాలు సాధించారు. జగ్గయ్యపేటలో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో క్రీడాకారులు ఈ ఘనత సాధించారు. ఈ పథకాలలో 10 బంగారం 7 వెండి 2 కంచు వున్నాయి. 61 ఏళ్ల వయస్సు 3 బంగారు పతకాలు సాధించి వరద భీమేశ్వరరావు రికార్డు సాధించారు. 23 జిల్లాలలో కృష్ణాజిల్లా టీంకు ఛాంపియన్షిప్ అవార్డు లభించింది. ట్రైనర్ పీవీకే సుబ్రమణ్యం ఆధ్వర్యంలో పతకాలు మోత మోగించిన క్రీడాకారులును పలువురు అభినందించారు. అలాగే కోచ్ పీవీకే సుబ్రహ్మణ్యానికి కూడా ప్రముఖుల నుండి  అభినందనలు లభించాయి.

# ట్రిపుల్ ఐటీ నూజివీడు నందు జాతీయ మెటలర్జికల్ దినోత్సవం సందర్భంగా జాతీయ సదస్సు




**నూజివీడు,నవంబర్ 12 (వార్తాప్రభ) :** లోహ పదార్థాలు మరియు వాటి ప్రాసెసింగ్ లపై పరిశోధన చేసి, దేశానికి వెన్నుదన్నుగా నిలిచే శాస్త్రవేత్తల సేవలను గుర్తిస్తూ, నవంబర్ 14 న  జాతీయ మెటలర్జీ దినోత్సవం జరుపుకుంటారు. ట్రిపుల్ ఐటీ నూజివీడు నందు గల మెటలర్జీ & మెటీరియల్స్ ఇంజనీరింగ్ విభాగం ప్రతీ సంవత్సరం జాతీయ మెటలర్జీ దినోత్సవం నిర్వహిస్తారు. మెటలర్జి విభాగంలో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన శాస్త్రవేత్తలు, ఇండస్ట్రీస్ లో డైరెక్టర్ స్థాయి వ్యక్తులను ఆహ్వానిస్తూ, "నేషనల్ సింపోజియం ఆన్ మెటలర్జి, మెటీరియల్స్, & మ్యానుఫ్యాక్చరింగ్" పేరుతో జాతీయ స్థాయి సదస్సును నిర్వహిస్తున్నారు. ఈ జాతీయ సదస్సుకు NIT వరంగల్ మెటలర్జి విభాగాధిపతి ప్రొఫెసర్ డా. N. కిశోర్ బాబు, JNTU విజయనగరం మెటలర్జి విభాగాధిపతి ప్రొఫెసర్ డా. జి. స్వామి నాయుడు, కుశలవ ఇంటర్నేషనల్ పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ వై. గోపాల్ రావు, శారదా మెటల్స్ & ఎల్లాయ్స్ మేనేజింగ్ డైరెక్టర్ నీరజ్ శారదా లాంటి ప్రముఖులు విచ్చేస్తున్నారు. ఈ కార్యక్రమ పోస్టర్ ను ట్రిపుల్ ఐటీ నూజివీడు డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్. అమరేంద్ర కుమార్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లక్ష్మణరావు, డీన్ ఎన్. రత్నాకర్, మెటలర్జి విభాగాధిపతి డా. బి. వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు వీరశ్రీను, శివ, శివకుమార్, మధుసుధన్ తదితరులు ఆవిష్కరించారు.  డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్. అమరేంద్ర కుమార్ మాట్లాడుతూ, జాతీయ స్థాయిలో ప్రఖ్యాత మెటలర్జి శాస్త్రవేత్తలను, పారిశ్రామిక రంగంలోని ప్రముఖులను ఒక వేదిక మీదకు చేర్చడం ద్వారా మెటలర్జీ రంగంలో నూతన ఆవిష్కరణలను, పురోగతులను విద్యార్థులకు పరిచయం చేసి, వారిని ఉత్తమంగా తీర్చిదిద్దడమే ధ్యేయం అన్నారు. డీన్ రత్నాకర్ మాట్లాడుతూ, మెటలర్జీ రంగంలో ఉన్న అవకాశాలు, అలాగే వాటికి సంబందించిన జ్ఞానాన్ని, నేటి విద్యార్థులకు తెలియజేస్తూ, వారికి ఉత్తమ ఉద్యోగ అవకాశాలను ఇలాంటి జాతీయ సదస్సులు ద్వారా కల్పించేందుకు కృషి చేస్తున్నాము అన్నారు. మెటలర్జీ విభాగాధిపతి డా. బి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, దేశంలో పారిశ్రామిక రంగంలో మెటలర్జీస్టుల కొరత ఉందనీ, ట్రిపుల్ ఐటీ మెటలర్జీ విద్యార్థులు అందరూ ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకుంటున్నారని తెలియజేసారు. మెటలర్జీ ఇంజనీరింగ్ విభాగంలోని ప్రఖ్యాత ఆవిష్కరణలు, అలాగే అవగాహన కల్పించేందుకు ప్రొటోటైప్ నమూనాలు, సైంటిఫిక్ పోస్టర్ లు, లాంటివి విద్యార్థులు తయారుచేసి ప్రదర్శిస్తారని తెలియజేసారు.

# కలెక్టరు షాన్ మోహన్ ను కలిసిన తుమ్మల బాబు



**కాకినాడ,నవంబర్ 12 (వార్తాప్రభ) :** కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ(కౌడా) చైర్మన్ గా నియమితులైన జనసేన నాయకులు తుమ్మల రామస్వామి(బాబు) జిల్లా కలెక్టరు షాన్ మోహన్ ను మర్యాదపూర్వకంగా కలిశారు.కలెక్టరు కార్యాలయం చేరుకున్న ఆయన ప్రభుత్వ నియామకం అంశం తెలియపరచారు. కలెక్టరు బాబుకు అభినందనలు తెలియజేశారు. ఈసందర్భంగా బాబు కలెక్టరుకు దేవుని చిత్ర పటం బహుకరించారు.

# అర్ధరాత్రి విద్యుత్ ప్రమాదం ఒకరి సజీవ దహనం




**తిరువూరు,నవంబర్ 12 (వార్తాప్రభ) :** తిరువూరు మండలం లక్ష్మీపురం గ్రామంలో విషాదం చోటుచేసుకుంది.అర్ధరాత్రి జరిగిన విద్యుత్ ప్రమాదంలో ఇంటి పూరిపాక కాలిపోవడంతో బాలమర్తి ఇస్మాయిల్ (52)సజీవ దహనం చెందాడు.  పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# అగ్ని ప్రమాద బాధితులకు అట్లూరి చారిటబుల్ ట్రస్ట్ సహాయం



**ఆగిరిపల్లి,నవంబర్ 12 (వార్తాప్రభ) :** అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలిన బాధిత కుటుంబ సభ్యులకు అట్లూరి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అట్లూరు రవీంద్ర ఆపన్న హస్తం అందించారు. స్థానిక హరిజనవాడలో ఈనెల 6న జరిగిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ప్రమాదంలో కుటుంబ సభ్యులు కట్టుబట్టలతో మిగిలారు. దీంతో అట్లు రవీంద్ర స్థానిక దేశం పార్టీ నేతలతో మనతో వంట పాత్రలు, దుస్తులు, బియ్యం, నిత్యవసర సరుకులు అందించారు. ఈ కార్యక్రమంలో సగ్గుర్తి రమేష్ బాబు, చౌటపల్లి విక్టర్ బాబు, కెపి రాజబాబు తదితరులు ఉన్నారు.

# డాక్టర్.మానికిరెడ్డి కి ప్రెస్టీజియస్ అవార్డు




**కాకినాడ,నవంబర్ 12 (వార్తాప్రభ) :** కాకినాడ స్మార్ట్ సిటీ సిద్దార్థ నగర్ కు చెందిన సామాజిక వేత్త,మానికి రెడ్డి హెల్త్ కేర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డా.మానికి రెడ్డి సత్యనారాయణ ప్రెస్టీజియస్ అవార్డు అందుకున్నారు.వరల్డ్ కైండ్ నెస్ డే పురస్కరించుకొని కీర్తి వెల్నెస్ ఫౌండేషన్ ట్రస్టు ఫౌండర్ అండ్ డైరెక్టర్ శ్రావ్య నుండి ఆన్లైన్ ద్వారా ఈ అవార్డును డా.మానికిరెడ్డి అందుకున్నారు.అలాగే జవహర్లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా జవహర్లాల్ నెహ్రూ స్మృతి సన్మాన్ పేరట మన అవార్డును ఇది ఫెయిర్ విజన్ ఫౌండేషన్ ఫౌండర్ రవివర్మ ద్వారా మరో పురస్కారం అందుకోనున్నారు.డా.మానికి రెడ్డి చేస్తున్న సామాజిక సేవలు గుర్తించి ఈ అవార్డులకు ఎంపిక చేశారు.ఈ సందర్భంగా మానికి రెడ్డి మాట్లాడుతూ గతంలో అనేక పురస్కారాలు పొందినప్పటికీ ఇతర రాష్ట్రాల్లో కూడా తన సేవలు గుర్తించి అవార్డులు ఇవ్వడం అదృష్టంగా భావిస్తున్నానని,భవిష్యత్తులో మరిన్ని సేవాకార్యక్రమాలు చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా మానికి రెడ్డి తెలిపారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం చొరవ చూపించాలి

● శిధిల వ్యవస్థలో ఉన్న భవనాలను మరమ్మత్తులు చేయాలి.




**తిరువూరు,నవంబర్ 12 (వార్తాప్రభ) :** ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం చొరవ చూపించాలి. శిధిల వ్యవస్థలో ఉన్న భవనాలను మరమ్మత్తులు చేయాలి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఎలక్షన్ మేనిఫెస్టోలో పెట్టిన హామీలను అమలుపరచాలి . పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి యం సాయికుమార్ . అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ తిరువూరు సమితి ఆధ్వర్యంలో ఈరోజు పాత్రికేయులు సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.  ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి యం సాయికుమార్ మాట్లాడుతూ ఏఐఎస్ఎఫ్ ఎన్టీఆర్ జిల్లా ప్రదం మహాసభ ఈనెల 15వ తారీఖున విజయవాడ నగరంలో జరగబోతున్న సందర్భంగా తిరువూరు నియోజవర్గంలో  ఉన్నటువంటి ప్రభుత్వ పాఠశాలలు మరియు కళాశాల  విద్యార్థులతో మాట్లాడి ఒక సమస్యలను తెలుసుకోవడం జరిగింది . తిరువూరు నియోజవర్గంలో విద్యార్థులు ఎదుర్కొన్న సమస్యలు పరిష్కరించకుండా స్థానిక ఎమ్మెల్యే నేను ఉచితంగా డీఎస్సీ కోచింగ్ ఇస్తాను అని గొప్పలు చెప్పుకుంటున్నారు సోషల్ మీడియా మాధ్యమాల్లో ప్రచారాలు చేసుకుంటున్నారు. ఇది ఎంతవరకు కరెక్ట్ అని విద్యార్థులు పక్షాన ఏఐఎస్ఎఫ్ సూటి ప్రశ్న. ఎందుకంటే క్షేత్రస్థాయిలో విద్యార్థులకు విద్య అందకుండా కళాశాలకు వెళితే కూర్చోవడానికి సరైన బల్లలు మరియు గదులు లేకుండా ఇబ్బంది పడుతున్నారు వాటిని పరిష్కరించాలి కానీ గొప్పలు చెప్పుకునే దాంట్లో ఉన్న శ్రద్ధ పరిష్కారంలో చూపించాలని ఈ సందర్భంగా అన్నారు. తిరువూరు నగరంలో ఉన్నటువంటిది ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆర్ట్స్ బ్లాక్ పడిపోయి కాలం గడుసున్న ఇప్పటివరకు నూతన భవనాన్ని ఏర్పాటు చేయకపోవంగా అదే కళాశాలలో ఉన్నటువంటి బాలికల వసతి గృహాన్ని ఆర్ట్స్ బ్లాక్ గా ఉపయోగిస్తున్నారు. అందులో ఉన్నటువంటి  బాలికల వసతి గృహాన్ని బయట ప్రాంతంలో ఒక ప్రవేట్ బిల్డింగ్ లో నడుపుతున్నారు. బాలికలలో ప్రతిరోజు వెళ్లి రావడానికి ఇబ్బంది పడుతూ వారికి సరైన రక్షణ కూడా లేకుండా ఇబ్బంది పడుతున్నారు కావున వెంటనే అధికార పార్టీ స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని తిరువూరు ఎమ్మెల్యే ని డిమాండ్ చేశారు లేని యెడలను విద్యార్థులను చైతన్యం చేసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమానికి శ్రీకారం చుడతారని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు షేక్  సుభాని , ఏఐఎస్ఎఫ్ ఎన్టీఆర్ జిల్లా కన్వీనర్ కే కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నా క్యాంటీన్ కి విరాళం



**కంకిపాడు,నవంబర్ 12 (వార్తాప్రభ) :** మండలంలోని మంతెన గ్రామానికి చెందిన పెండ్యాల దొరబాబు పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్ కు 10000 రూపాయలు చెక్కును విరాళంగా పోరంకి శాసనసభ్యులు కార్యాలయంలో బోడె ప్రసాద్ కి అందజేశారు. ఈ సందర్భంగా బోడే ప్రసాద్ దాతం అభినందించి అన్నం దొరకని పేదలకు పట్టెడన్నం పెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆసియా సాధనకు దాతృత్వం కలిగిన దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

# ఎమ్మెల్సీ అభ్యర్థిగా గోపిమూర్తి నామపత్రాలు దాఖలు



**కాకినాడ, నవంబర్ 12 (వార్తాప్రభ) :** తూర్పు-పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి రెండవ రోజు పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన బొర్రా గోపిమూర్తి ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావుతో కలిసి మంగళవారం కాకినాడ కలెక్టరేట్లో తూర్పు-పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలికి నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో సహా రిటర్నింగ్ అధికారి, కాకినాడ జిల్లా రెవెన్యూ అధికారి జె వెంకటరావు, ఇతర ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు. అంతకుముందు గోపి మూర్తి నామినేషన్ దాఖలు చేసేందుకు బాలాజీ చెరువు సెంటర్ నుండి జిల్లా కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీతో వచ్చారు.

# అనాధ బాలికలకు ఆర్థిక సహాయం చేసిన ఐడియా సేవా సంస్థ






**తిరువూరు,నవంబర్ 12 (వార్తాప్రభ) :** తిరువూరు లో బస్టాండ్ దగ్గర గల రాజుపేట లో గల ఐడియా సేవా సంస్థ ఆధ్వర్యంలో , గంపలగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 60 మంది బాలికలకు గంపలగూడెం హౌస్ ఆఫీసర్ ఎస్సై గుండమ్ శ్రీను మరియు గంపలగూడెం తాసిల్దార్ శ్రీమతి వడ్డేశ్వరపు రాజకుమారి చేతుల మీదగా ఆర్థిక సహాయం అందించినారు. ఎస్సై గుండం శ్రీను మాట్లాడుతూ డిగ్రీ దాకా ఇద్దరు అనాధ బాలికలను తన సొంత ఖర్చులతో చదివిస్తానని మాట ఇచ్చారు . అలాగే తాహశీల్దార్ రాజకుమార్  చదివే సంపదని, పేదరికం మన మెదడులోనే ఉంటుందని బయట ఎక్కడ లేదని అన్నారు . ఐడియాస్ సేవా సంస్థ డైరెక్టర్ చేస్తున్న సుదీర్ఘమైన 28 సంవత్సరాల అనాధ సేవలను ప్రశంసించినారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు బొల్లిపోగు కిరణ్ కుమార్, ఉపాధ్యాయులు గోదా వెంకటరామయ్య, చెమట సురేష్ బాబు, బంక రాంబాబు ,కొరకప్పు సురేష్ ,మరియు ఆర్ఐ బద్రి , కొత్తపల్లి తిరుపతిరావు , కానిస్టేబుల్, ఐడియాస్ కోఆర్డినేటర్ బుడుపుల పండు వరప్రసాద్  ఇవిద్యాలోకా కోఆర్డినేటర్ కొంగల రవిబాబు, శ్రీకాకులపు వేణు తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ మొర్రి. పిచ్చయ్య కు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ప్రధానం




**గిద్దలూరు,నవంబర్ 12 (వార్తాప్రభ) :** మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పొదిలికొండ పల్లెలో స్కూల్ అసిస్టెంట్( హిందీ) ఉపాధ్యాయులుగా పనిచేయుచున్న డాక్టర్ మొర్రి. పిచ్చయ్య కు రాష్ట్రం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, విద్యాశాఖామంత్రి నారా లోకేష్ ల చేతుల మీదుగా సోమవారం విజయవాడలోని ఏ1 కన్వెన్షన్ హాల్లో జాతీయ విద్యా దినోత్సవ సందర్భంగా ప్రధానం చేయడం జరిగింది. ఈ అవార్డులో భాగంగా సీల్డ్, ప్రశంసా పత్రం, మెడల్, ప్రైజ్ అమౌంట్ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత డాక్టర్ మొర్రి. పిచ్చయ్య ను పలువురు  విద్యాశాఖ ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు, బంధు-మిత్రులు, శ్రేయోభిలాషులు, యూనియన్ నాయకులు, గ్రామస్తులు తదితరులు అభినందించారు. వీరి శిష్యఘనం ఈయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. పిచ్చయ్య మాట్లాడుతూ  ఈ అవార్డు తన తల్లిదండ్రులకు, సోదరులకు, గురువులకు అంకితం అన్నాడు. తనకు రాష్ట్రస్థాయి అవార్డు రావడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని తెలిపారు. ఈ అవార్డు రావడానికి సలహాలు, సూచనలు, సహకారాన్ని ఇచ్చి ముందుకు నడిపిన మిత్రులకు, కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

# మహిళల ఉపాధి కల్పనకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ దోహదపడుతుంది - ఎంపిడివో పి.అనురాధ






**మైలవరం,నవంబర్ 12 (వార్తాప్రభ) :** మహిళలు,యువత ఉపాధి కల్పనకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగ తులు ఎంతగానో దోహదపడతాయని ఎంపిడివో పి.అనురాధ అన్నారు. మైలవరం పట్టణంలోని మోస్ట్ చారిటబు ల్ ట్రస్ట్, మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తాధ్వర్యంలో నూజివీడు రోడ్డు లోని మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో ఉచిత కంప్యూటర్, టైలరింగ్, బ్యూటిషియన్ శిక్షణా తరగ తులను ఎంపిడివో అనురాధ, ఎంఈవొ -2 ఎల్.బాలు ట్రస్ట్ సభ్యులతో కలిసి ప్రారంభించారు.అనంతరం మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు కోయ సుధ అధ్యక్షతన జరిగిన సభలో  ఎంపిడివో మాట్లాడుతూ పేద, మధ్య తరగతి మహిళల ఆర్థిక అభివృద్ధి కి ఈ శిక్షణలు ఎంతో ఉపయోగ పడతాయ న్నారు.గ్రామీణ ప్రాంతాలలో మహిళల కు నైపుణ్యం, ఉపాదికల్పనకు ఎలాంటి ఖర్చు లేకుండా శిక్షణ ఇచ్చేందుకు ఈ ప్రాంతంలో ఉచిత ట్రైనింగ్ సెంటర్లు  ఉండటం శుభ పరిణామం అన్నారు. మహిళలు,యువత ట్రస్ట్ లు అందిస్తు న్న సేవలు సద్వినియోగించుకోవాలన్నా రు.స్వచ్ఛందంగా సమాజానికి సేవలందించే ట్రస్ట్ నిర్వాహకులకు మా నుంచి పూర్తి సహాయ సహకారాలు ఉంటాయ న్నారు.ఎం ఈ వొ బాలు మట్లాడుతూ ట్రస్ట్ ద్వారా సమాజానికి సేవలందిస్తున్న కోయ సుధ మన ప్రాంతంలో ఉండటం గర్వంగా ఉందన్నారు.మోస్ట్ ట్రస్ట్ వారు పేద విద్యార్దులకు స్కాలర్షిప్స్ అందించి వారి చదువుకు,భవిష్యత్తుకు బాటలు వేస్తుందన్నారు.ఈ కార్యక్రమం లో  మోస్ట్ మరియు మదర్ థెరిస్సా ట్రస్ట్ కోశాధికారులు డి.విజయలక్ష్మి, షేక్. అమీర్ హంజా,కార్యదర్శి జూలకంటి ప్రసాద్,ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షు లు చలవాది మధుసూదన రావు, సభ్యులు దునకా ప్రసాద్, వీరాచారి, సీతారావమ్మ, విజయ్ కుమార్, కోటేశ్వ రరావు ,ధనలక్ష్మీ,అధికసంఖ్యలో మహిళలు,యవతీ,యువకులు,ట్రైనర్స్ పాల్గొన్నారు.

# తిమ్మాపురం పంచాయతీ లో రోడ్ల నిర్మాణంలో అవకతవకలు

● క్వాలిటీ తక్కువతో కాంక్రీట్ సిమెంట్ రోడ్లు ● జనసంచారం లేని చోట్ల రోడ్ల నిర్మాణానికి అనుమతులు ● బిజెపి నాయకులు కాళ్ల ధనరాజ్



**కాకినాడ రూరల్,నవంబర్ 12 (వార్తాప్రభ) :** కాకినాడ రూరల్ మండలంలోని తిమ్మాపురం గ్రామ పంచాయితీ పరిధిలోని ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన జాతీయ ఉపాది హామీ పథకం ద్వారా పల్లెపండుగ కార్యక్రమము ద్వారా కేటాయించిన నిధులతో గ్రామ అభివృద్ధికి శ్రీకారం చుట్టవలసిన అధికారులు ఆ నిధులను నిరుపయోగకరంగా చేయడం పట్ల ఆవేదనతో ఫిర్యాదు చేయుచున్నాము. తిమ్మాపురం గ్రామ పంచాయితీ పరిధిలోని మూడు సి.సి. రోడ్డు నిర్మాణాలు చేపట్టారు. 1) సిసి రోడ్లు నిర్మాణాలు చేశారు. ఎన్.ఐ.సి. వర్కు ఐ.డి నెం. 0204023001/ఆర్.ఎస్/ 9999005213219 గల రూ.21.50 లక్షలతో 0.034 మీటర్లు రోడ్డు నిర్మాణం. 2) ఎన్.ఐ.సి. వర్కు ఐ.డి నెం. 0204023001/ ఆర్.ఎస్/9999005213220 గల రూ.22.50 వ్యయంతో 0.359 కిలోమీటర్లు రోడ్డు నిర్మాణం. 3) ఎన్.ఐ.సి. వర్కు ఐ.డి నెం. 0204023001/ ఆర్.ఎస్/9999005213221 గల రూ.33.50 లక్షలతో 0.551 కిలోమీటర్లు పొడవు గల రోడ్లు నిర్మాణాలు చేపట్టి యున్నారు. మూడు రోడ్లు నిర్మాణాలు కూడా మూడు వర్కు కోడ్లతో సుమారు 1.5 కిలో మీటర్ల రోడ్డును ఎటువంటి జన ఆవాసాలు లేనిచోట వేయడం జరిగింది. అలాగే జాతీయ ఉపాది హామీ పథకం ద్వారా వేసిన రోడ్లు ఎటువంటి కూలీలు సహాయం లేకుండా ప్లాట్ కాంక్రీట్ ద్వారా రోడ్లు వేశారు. ప్లాట్ కాంక్రీట్ అంటే తయారు చేసిన మెటీరియల్ బయట నుండి తెచ్చి రెండు రోజులలోనే రోడ్డును పూర్తి చేసారు. ఈ రోడ్డులో కంకర, ఇసుక, సిమెంట్ సమపాళ్ళలో లేవని దానిపై విచారణ చేపట్టి సమగ్ర నివేదికను అందించాలని కోరుతున్నాము. దీనిపై ఉన్నత అధికారులు విచారణ చేపట్టాలని క్లాలిటీ నియంత్రణ మండలి పరీక్షించిన తర్వాతనే నాణ్యత ప్రమాణాలు ఉన్నట్లు అధికారుల అలసత్వానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము.అయితే బల్లులు చెల్లించాలి. లేనియెడల కావున దానిపై విచారణ చేపట్టి దానికి సహకరించి అధికారులను శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ, ఈ రోడ్లు కాలిటీని నియంత్రణ మండలి ద్వారా పరీక్షించి బిల్లులను చెల్లించుకుండా నిలుపుదల చేయాలని కోరుతున్నాము.

# యాదవుల ఐక్యతకు చిహ్నం సదర్ మహోత్సవం..




**హైదరాబాద్,నవంబర్ 12 (వార్తాప్రభ) :** రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం నియోజకవర్గం లో అఖిలభారత యాదవ్ సంగం మరియు పోతర్ల అంబయ్య యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా సదర్ మహోత్సవం జరిగింది. ఈ కార్యక్రమం మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, షాద్ నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్య యాదవ్, పరిగి కంటెస్టెడ్ ఎమ్మెల్యే భేరి రామచందర్ యాదవ్( బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు) పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సదర్ పండుగ ఐక్యమత్యానికి చిహ్నం అని అన్నారు. కులమే బలమని అన్నారు. యాదవులకు ప్రభుత్వాలు దామాషా పద్ధతిగా రిజర్వేషన్లు కల్పించి విద్యా ఉద్యోగ రాజకీయ రంగాల్లో అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. అందరూ ఐక్యమత్యంతో అభివృద్ధి దిశగా ప్రయాణించాలని అన్నారు. ఈ సందర్భంగా అందరికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బిజెపి నాయకులు కటారి జంగయ్య యాదవ్, యాదవ్ సంఘం అధ్యక్షులు బొజ్జం చంద్రయ్య యాదవ్, కర్రోళ్ల చంద్రయ్య ముదిరాజ్, కాకి కుమార్ యాదవ్, దుద్దు కృష్ణ యాదవ్, జిల్లా నాగేష్ యాదవ్, మేకల శ్రీనివాస్ యాదవ్, మేకల సందీప్ యాదవ్, చేతారం పర్వతాలు యాదవ్, తెజ్జీరి శ్రీశైలం యాదవ్ తెజ్జీరి లక్ష్మయ్య యాదవ్, జోగోరి మల్లేష్ యాదవ్, గోవర్ధన్ యాదవ్, శ్రీశైలం యాదవ్, పర్వతాలు యాదవ్, మిద్దేటి యాదయ్య యాదవ్, ఆశన్న గారి మల్లేష్ యాదవ్, బాలయ్య యాదవ్, పోల్కం బాలయ్య యాదవ్, పాండు యాదవ్, మల్లేష్ యాదవ్, జోగోరి పర్వతాలు యాదవ్, మరియు యాదవ్ సంగం పెద్దలు యోజన నాయకులు, సంఘం సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని  కార్యక్రమాన్ని విజయవంతం చేసినారు.

## క్రీడా రంగానికి కేరాఫ్ గా కుత్బుల్లాపూర్ ను అభివృద్ధి చేయాలి - ఎమ్మెల్యే కెపి.వివేకానంద్



**కుత్బుల్లాపూర్ నవంబర్ 12 (వార్తాప్రభ) :** కుత్బుల్లాపూర్ గాజులరామారం స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో జరుగుతున్న క్రీడా మైదాన అభివృద్ధి పనులను మంగళవారం ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ క్రీడాకారులకు అన్ని మౌలిక వసతులు కల్పించి క్రీడలు అంటే కుత్బుల్లాపూర్, కుత్బుల్లాపూర్ అంటే క్రీడలు అనే విధంగా కుత్బుల్లాపూర్ ను అభివృద్ధి పరచాలని అన్నారు. కార్యక్రమంలో ఈఈ క్రిష్టప్ప, డిఈ రూపా దేవి, ఏఈ కళ్యాణ్, కార్పొరేటర్ రావుల శేషగిరి, పాక్స్ డైరెక్టర్ పరిశే శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు అడ్వకేట్ కమలాకర్, డివిజన్ ఉపాధ్యక్షులు ఇబ్రహీం ఖాన్, మూసా ఖాన్, బోయినీ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## కంపెనీలు పర్యావరణం పరిరక్షించాలి !!

**సింగరేణి పరిసర ప్రాంతాల్లో పచ్చటి వనాలు నిర్మించాలి**
**ప్రభావిత గ్రామాల్లో నిష్పక్షపాతంగా మౌలిక సదుపాయాలు కల్పించాలి**
**కేంద్ర ఎన్విరాన్మెంట్, ఫారెస్ట్, క్లైమేట్ చేంజ్ భారత ప్రభుత్వం డైరెక్టర్ తరుణ్ కత్తుల**





**పెద్దపల్లి/ గోదావరిఖని: నవంబర్ 12 (వార్తాప్రభ ప్రతినిధి)** కంపెనీలు పర్యావరణం పరి రక్షించే విధంగా వివిధ చర్యలు తీసుకోవాలి అని సింగరేణి అధికారులకు సూచించారు భారత ప్రభుత్వం ఎన్విరాన్మెంట్, ఫారెస్ట్, క్లైమేట్ చేంజ్( పర్యావరణ అటవీ మరియు వాతావరణ మార్పు ) డైరెక్టర్ తరుణ్ కత్తుల. ఈ మేరకు మంగళవారం సింగరేణి రామగుండం రీజియన్ వన్ పరిధిలోని ఓపెన్ కాస్ట్ 5వ గని, అండర్ గ్రౌండ్ గనులు, సింగరేణి ప్రభావిత గ్రామాలు, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ సందర్శించి పరిశీలన చేపట్టారు సంబంధిత భారత ప్రభుత్వం డైరెక్టర్. ముందుగా డైరెక్టరుకు జనరల్ మేనేజర్ లలిత్ కుమార్, కార్పొరేట్ ఎన్విరాన్మెంట్ జీఎం సైదులు స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం డైరెక్టర్ సింగరేణి అధికారులకు పలుకు సూచనలు చేశారు. సింగరేణి పరిసర ప్రాంతాల్లో పచ్చటి వనాలు నిర్మించాలి అని తెలిపారు. ప్రభావిత గ్రామాల్లో నిష్పక్షపాతంగా మౌలిక సదుపాయాలు కల్పించాలి అని అన్నారు.

## కేఎల్ఎం ఫైనాన్స్ డబ్బులు వాడుకున్న మేనేజర్



**వలిగొండ నవంబర్ 12 (వార్తాప్రభ ప్రతినిధి)** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో కేఎల్ఎం బ్రాంచ్ ప్రారంభించి సంవత్సరం గడుస్తుంది ఈ లోపే బ్రాంచ్ మేనేజర్ బొడిగె నరేష్ బ్యాంకును మోసం చేసి 33 లక్షల రూపాయలు ఫ్రాడ్ చేసినట్లు కేఎల్ఎం బ్రాంచ్ పై అధికారులు మంగళవారం తెలిపారు స్థానిక బ్రాంచ్ మేనేజర్ పై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు ఈ సందర్భంగా బ్రాంచ్ పై అధికారులు మాట్లాడుతూ బ్రాంచ్ కస్టమర్స్ ఎలాంటి ఆందోళన చెందవద్దని వారు నేరుగా బ్రాంచ్ని సంప్రదించి వారి యొక్క బంగారం విడిపించుకోవచ్చని అంతేకాకుండా మీయొక్క బంగారం కుదువ పెట్టేముందు అన్ని పత్రాలు సరిగ్గా చూసుకొని సంతకం చేయాలని మీ యొక్క రుణం ఇంట్రెస్ట్ నేరుగా బ్రాంచ్ లో చెల్లి రసీదు తీసుకోవాలని తెలిపారు

## షిరిడి సాయిబాబా మందిరం నూతన అడ్వైజరీ కమిటీ చైర్మన్ గా వనం యాదయ్య

**హైదరాబాద్ /ఎల్బీనగర్,నవంబర్ 12 (వార్తాప్రభ ప్రతినిధి):** శ్రీ షిరిడి సాయిబాబా మందిరం నూతన అడ్వైజరీ కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా అడ్వైజరీ కమిటీ చైర్మన్ వనం యాదయ్య,కమిటీ సభ్యులుగా లక్ష్మయ్య,వనం రంగయ్య,మల్లయ్య,నరసింహారావు,లింగయ్య,గంగాధర్ లు ప్రమాణ స్వీకారం చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా హాజరై నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.వేద పండితుల మంత్రోత్సరణతో ఎమ్మెల్సీ, కమిటీ సభ్యులను సన్మానించారు



# సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో వ్యవసాయ రంగానికి మహర్దశ!!

● రైతు పండించిన ప్రతి గింజకు లెక్క కట్టిస్తాం ● సన్న వడ్లకు 500 రూపాయల బోనస్ అందిస్తాం ● రైతులు ఎవరు కూడా దళారులను నమ్మి మోసపోవద్దు ● రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్






**పెద్దపల్లి/ గోదావరిఖని: నవంబర్ 12 (వార్తాప్రభ ప్రతినిధి)** సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో వ్యవసాయ రంగానికి మహర్దశ వచ్చినది అని సంతోషం వ్యక్తం చేశారు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్. ఈ మేరకు మంగళవారం నియోజకవర్గం పరిధిలోని అంతర్గాం మండలంలో గల వీసంపేట్, పొట్యాల, సోమన్ పల్లి గ్రామాలలో వడ్ల కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.....సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం వ్యవసాయ రంగంతో పాటు అన్ని రంగాల్లో దూసుకుపోతుందన్నారు. గ్రేడ్ వన్ వడ్లకు 2320, రూ. సాధారణ వడ్లకు రూ. 2300, సన్న వడ్లకు రూ. 500 బోనస్ గా చెల్లించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. రైతులు ఎవరు కూడా దళారులను నమ్మి మోసపోవద్దు అని సూచించారు. వడ్ల కొనుగోలు కేంద్రాలలో ఏవైనా ఇబ్బందులు ఎదురైనట్లయితే తనను నేరుగా సంప్రదించాలని రైతులకు తెలిపారు. కాంగ్రెస్ సర్కార్ రైతు సర్కార్ అని భరోసా ఇచ్చారు.

# బ్రతుకులు చీకటిమయం చేసిన ఎన్టీపీసీ!!

● భూ నిర్వాసితులకు ఉద్యోగ కల్పన శూన్యం ● దేశం కోసం భూములను అందించిన వారికి అండగా నిలుస్తాం ● తక్షణమే వీధి దుకాణాలు ప్రారంభించాలి ● రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్






**పెద్దపల్లి/ గోదావరిఖని: నవంబర్ 12 (వార్తాప్రభ ప్రతినిధి)** బ్రతుకులు చీకటిమయం చేసిన ఎన్టీపీసీ యాజమాన్యం బేషరతుగా ప్రాజెక్టు భూనిర్వాసితులకు క్షమాపణలు చెప్పి అందించాల్సిన బెనిఫిట్స్ తక్షణమే విడుదల చేసి ఉద్యోగ అవకాశాలు కల్పించాలి అని డిమాండ్ చేశారు రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్. ఈ మేరకు మంగళవారం ఎన్టిపిసిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. భూ నిర్వాసితులకు ఉద్యోగ కల్పన శూన్యం అని అన్నారు. దేశం కోసం భూములను అందించిన వారికి అండగా నిలుస్తాం అని అన్నారు. అలాగే మీడియా సమావేశం అనంతరం ఎన్టిపిసి వీధి వర్తక దుకాణ సముదాయాలను సందర్శించి తక్షణమే వీధి దుకాణాలు ప్రారంభించాలి అని డిమాండ్ చేశారు. లేనియెడల పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకొని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

# కృత్రిమ మేధస్సుతో విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు

### ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ భాగంగా



**కుత్బుల్లాపూర్ నవంబర్ 12 (వార్తాప్రభ) :** కుత్బుల్లాపూర్ రంగారెడ్డి నగర్, గాంధీ నగర్ లోని ఠాగూర్ హై స్కూల్ నందు నూతనంగా ఏర్పాటుచేసిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బేస్డ్ కంప్యూటర్ ల్యాబ్ ను మంగళవారం కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ కృత్రిమ మేదస్సుతో విద్యార్థులలో దాగివున్న ప్రతిభను వెలికి తీయవచ్చని రానున్న రోజుల్లో ప్రతి రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ తప్పనిసరి కానుందన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే పుస్తకాలతో పాటు కంప్యూటర్, శాస్త్ర సాంకేతిక రంగాలను పునికి పుచ్చుకొని అభివృద్ధి చెందాలని అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ సహాయంతో విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు నాంది పలికిన ఠాగూర్ స్కూల్ యాజమాన్యానికి నా అభినందనలు. కార్యక్రమంలో జేఎన్టీయూ ప్రొఫెసర్ డాక్టర్ ఇందిరా రాణి, ఐటిఐ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఐటిఐ గెజిటెడ్ ఆఫీసర్స్ అధ్యక్షులు శ్రీనివాస్, ఆగర్ సైబర్ ఎక్స్ సంస్థ ఐటీ డైరెక్టర్ సుమన్, బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు ఎర్వ శంకరయ్య, సీనియర్ నాయకులు అబ్దుల్ ఖాదర్, జల్దా లక్ష్మీనాథ్, రహీం, కార్తీక్ గౌడ్, ఎర్వ సాయి, సతీష్ గట్టోజి, బాలు నేత, రమ్మీ గౌడ్, అల్లావుద్దీన్, ఠాగూర్ హై స్కూల్ కరస్పాండెంట్ బండారు సాయికుమార్, వెలుగు ఎడ్యుకేషన్ ట్రస్ట్ నారాయణరావు, నేహా బండారి తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ పోలియో దినోత్సవ అవగాహన.

● టీకా ద్వారా నివారించగల వ్యాధికి వ్యతిరేకంగా సమిష్టిగా పోరాడాల్సి వుంది ● డాక్టర్ శ్రీకాంత్, కన్సల్టెంట్ పీడియాట్రిషియన్, కిడ్స్ కేర్ క్లినిక్, హైదరాబాద్



**హైదరాబాద్, నవంబర్ 12 (వార్తాప్రభ ప్రతినిధి)** భారతదేశంలోని మేఘాలయలో ఇటీవల బయట పడిన పోలియో కేసు నేపథ్యంలో, పోలియోమైలిటిస్ వల్ల కలిగే నిరంతర ముప్పును గుర్తించడం చాలా అవసరం. పోలియో, ఒక తీవ్రమైన వైరల్ అంటువ్యాధి. ప్రధానంగా ఐదేళ్లలోపు పిల్లలను ప్రభావితం చేస్తుంది. ఇది కోలుకోలేని పక్షవాతం మరియు కొన్ని సందర్భాల్లో మరణానికి దారితీస్తుంది. దశాబ్దాలుగా పురోగతి ఉన్నప్పటికీ, ఈ వ్యాధి ప్రపంచ ఆరోగ్యానికి ముప్పుగా మాత్రం మిగిలిపోయింది, ముఖ్యంగా పోలియో రహిత భారతదేశం వంటి దేశాలలో ఇది మరలా రాకుండా నివారించడానికి అప్రమత్తంగా ఉండాలి. హైదరాబాద్‌లోని కిడ్స్ కేర్ క్లినిక్‌లోని కన్సల్టెంట్ పీడియాట్రిషియన్ డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ "పోలియో అనేది సుదూర జ్ఞాపకంగా అనిపించవచ్చు, కానీ అనుసంధానిత ప్రపంచంలో ముప్పు మిగిలే ఉంది. ఇన్‌యాక్టివేటెడ్ పోలియో వ్యాక్సిన్ (ఐపివి) ఇప్పటికీ మన అత్యంత శక్తివంతమైన రక్షణగా ఉంది, పిల్లల భవిష్యత్తును నాశనం చేసే వైరస్‌కు వ్యతిరేకంగా క్లిష్టమైన రక్షణను అందిస్తుంది అని డా.శ్రీకాంత్ అన్నారు. "పోలియోకు వ్యతిరేకంగా టీకా ప్రయత్నాలు విశేషమైనవి, అయినప్పటికీ మనం శ్రద్ధగా ఉండాలి. రోగనిరోధక శక్తిని కాపాడుకోవడానికి మరియు ఈ ప్రమాదకరమైన వైరస్ నుండి పిల్లలను రక్షించడానికి ఆరు వారాల నుండి ప్రారంభమయ్యే సాధారణ రోగనిరోధకత అవసరం అన్నారు. ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ అడ్వైజరీ కమిటీ ఆన్ వ్యాక్సిన్స్ అండ్ ఇమ్యునైజేషన్ ప్రాక్టీసెస్ సిఫార్సు చేయబడిన టీకా షెడ్యూల్‌ను ఖచ్చితంగా అనుసరించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పిందనీ వారు పేర్కొన్నారు. ఇందులో నోటి ద్వారా పోలియో వ్యాక్సిన్ (ఓ. పి.వి.), 6, 10 మరియు 14 వారాలలో నిష్క్రియాత్మక పోలియో వ్యాక్సిన్ (ఐ.పి. వి.), 16–18 నెలలలో మరియు మళ్లీ 4–6 సంవత్సరాలలో బూస్టర్‌లు వేయించాలన్నారు. డాక్టర్ శ్రీకాంత్ జతచేస్తూ, "పోలియో నిర్మూలనలో భారతదేశం యొక్క అద్భుతమైన పురోగతి ప్రపంచానికి ఉదాహరణగా నిలిచిందనీ, అయితే మనం అప్రమత్తంగా ఉండాలి. టీకా ప్రయత్నాలలో లోపం తీవ్రమైన పరిణామాలతో వ్యాధి తిరిగి రావడానికి అనుమతించగలదని ఇతర దేశాలలో ఇటీవలి వ్యాప్తి చూపిస్తుంది" అని అన్నారు.

## కరాటే పోటీలలో శ్రీ చైతన్య చిల్డ్రన్స్ అకాడమీ విద్యార్థుల విజయకేతనం

**చంద్రగిరి నవంబర్ 12 (వార్తాప్రభ ప్రతినిధి):** తిరుపతిలోని ఎస్ వి ఆర్ట్స్ కళాశాల శ్రీనివాస క్రీడా ప్రాంగణంలో సౌత్ ఇండియా కరాటే ఛాంపియన్షిప్ పోటీలు నవంబర్ 9, 10 తేదీల్లో నిర్వహించారు. ఈ పోటీలలో కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీలలో చంద్రగిరి శ్రీ చైతన్య చిల్డ్రన్స్ అకాడమీ కటా కుమితె విభాగాలలో 25 మంది విద్యార్థులు పాల్గొనగా 3 బంగారు పథకాలు, 6 వెండి పథకాలు, 16 రజిత పథకాలు సాధించారు. వీరి విజయానికి కృషి చేసిన మాస్టర్ శివకృష్ణ ఆనందం వ్యక్తం చేశారు. శ్రీ చైతన్య చిల్డ్రన్స్ అకాడమీ ప్రిన్సిపాల్ సురేష్, కరస్పాండెంట్ బి.వి కృష్ణారెడ్డి విద్యార్థిని విద్యార్థులను అభినందించారు..

వార్తా ప్రభ
హైదరాబాద్

## ఎంఎల్ఏ గారు ఇంటిపట్టాల హామీ ఏమైంది!!??

● డీడీలు కట్టిన వారు నష్టపోవాల్సిందేనా!!??
● బిఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్



**భద్రాద్రి కొత్తగూడెం నవంబర్ 12 (వార్తాప్రభ ప్రతినిధి)** కొత్తగూడెం: జీ.ఓ.నెం 76 ద్వారా ఇంటి పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఒక్కరికీ ఎన్నికల సమయంలో ఇంటి పట్టాలు ఇస్తానని ఎంఎల్ఏ గారు ఇచ్చిన హామీ ఏమైందని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడ్వకేట్ యెర్రా కామేష్ ప్రశ్నించారు??.మంగళవారం పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్తగూడెం పట్టణంలో ఎన్నో ఏళ్ళుగా నివాసముంటున్న వారికి యాజమాన్య హక్కులు కల్పించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం జీ.ఓ.76 ప్రవేశ పెట్టగా సుమారు 2 వేల మందికి పైగా దరఖాస్తులు చేసుకున్నారని దరఖాస్తుతో పాటు డబ్బులు కూడా కట్టారని ఎన్నికల కోడ్ అమలులోకి రాగానే పట్టాల పంపిణీ ప్రక్రియను నిలిపివేశారని ఎన్నికలు జరిగి 11 నెలలు దాటినా నేటికీ పట్టాల పంపిణీ ప్రక్రియ ప్రారంభికపోవడంతో ఇల్లులు కొనుగోలు,అమ్మకాలు జరగక ప్రజలు ఆర్థికంగా నానా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం వెంటనే స్పందించి ఇంటి పట్టాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.ఈకార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంధం మల్లికార్జున రావు,బహుజన కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు సాయి,వంగా రవిశంకర్,పోలే కనకరాజు,ఇసం మురళి తదితరులు పాల్గొన్నారు

## సీఎం సహాయనిధి... పేదల ఆరోగ్య పెన్నిధి : ఎమ్మెల్యే కెపి.వివేకానంద్



**కుత్బుల్లాపూర్ నవంబర్ 12 (వార్తాప్రభ) :** కుత్బుల్లాపూర్ నియోజక వర్గానికి చెందిన ముగ్గురు నివాసులు అనారోగ్యంతో బాధపడుతూ వైద్య చికిత్స నిమిత్తం ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ ని ఆశ్రయించగా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి 4.50 లక్షల రూపాయల విలువ గల మూడు ఎల్ఓసి చెక్కులను ఈరోజు పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి పేదరికంతో బాధపడుతూ వైద్యం చేయించుకోలేని నిరుపేదలకు ఆరోగ్య భద్రత, భరోసానిస్తుందన్నారు.

**ఎల్ఓసి చెక్కులు మంజూరైన లబ్ధిదారుల వివరాలు : –**(1) 131 – కుత్బుల్లాపూర్ డివిజన్ పద్మా నగర్ ఫేజ్ –2 కి చెందిన శ్యామల భర్త నర్సింగ్ రావు – 1.00 లక్ష రూపాయలు,(2) 128 – చింతల్ డివిజన్ చంద్ర నగర్ కు చెందిన సిహెచ్. చంద్రిక తల్లి సిహెచ్. లక్ష్మి – 1.50 లక్షలు,(3) సూరారం కి చెందిన డి.తేజస్విని తండ్రి డి. పెంటయ్య – 2.00 లక్షలు

## "టాస్క్" చేతిలో పేకాట రాయుళ్లు!!

***9 మంది అరెస్ట్... పరారీలో ఇద్దరు***
***71690రూ నగదు, 9 సెల్ ఫోన్లు, నాలుగు బైకులు స్వాధీనం***
***పెద్దపల్లి టాస్క్ ఫోర్స్ ఇన్ స్పెక్టర్ రమేష్ బాబు***



**పెద్దపల్లి/ రామగుండం: నవంబర్ 12 (వార్తాప్రభ ప్రతినిధి)** రామగుండం "టాస్క్ ఫోర్స్" చేతికి మంగళవారం పేకాట రాయుళ్లు చేతికి చిక్కారు. గోదావరిఖని టూ టౌన్ పరిధికి చెందిన సింగిరెడ్డిపల్లి గ్రామం శివారులో పేకాట ఆడుతున్న స్థావరంపై పెద్దపల్లి టాస్క్ ఫోర్స్ ఇన్ స్పెక్టర్ రమేష్ బాబు, ఎస్సై రాజేష్, టూ టౌన్ పోలీసులు దాడి చేసి 9 మందిని పట్టుకున్నారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు వివరాలను ప్రకటనలో వెల్లడించారు ఇన్ స్పెక్టర్ రమేష్ బాబు. గాండ్ల సంపత్, గుర్రాల తిరుపతి, మహమ్మద్ జహంగీర్, బీరుక సమ్మయ్య, బీరుక రమేష్, మహమ్మద్ రఫీ, కాశిరెడ్డి నరసింహులు, తోడేటి రమేష్, తోడేటి శ్రావణ్ చిక్కినట్లు, ఉదర తిరుపతి, కోనాటి సత్యనారాయణ పరారీలో ఉన్నట్లు తెలిపారు. సంఘటన స్థలంలో 71690రూ నగదు, 9 సెల్ ఫోన్లు, నాలుగు బైకులు స్వాధీనం చేసుకున్నట్లు వివరాలను వెల్లడించారు. అనంతరం తదుపరి విచారణ నిమిత్తం గోదావరిఖని టూ టౌన్ పోలీసుకి అప్పగించినట్లు తెలిపారు.

# ఎడిటోరియల్

## థాంక్స్ టూ బాబు అనాల్సిందేనా ?

చేతి నిండా పని వైసీపీ నేతలకు కూటమి పెద్దలు చెబుతున్నారు. ఎన్నికల్లో ఓటమి చెంది నిరాశ నీడలోకి వెళ్ళిపోయిన వారిలో కొత్త పౌరుషం రగిలిస్తున్నారు. ఇక్కడితో ఆట అయిపోలేదు బస్తీమే సవాల్ అని అంటున్నారు. నేచురల్ గా చూస్తే రాజకీయాల్లో ఎపుడూ వారూ వీరి మధ్యనే ఆట సాగుతుంది. అధికార ప్రతిపక్షల మధ్య సమరం అన్నది సాగుతూనే ఉంటుంది.ఈ రెండు వైపులా చూస్తే పరస్పర ప్రేరితం గానే వ్యవహారం ఉంటుంది. ఏపీలో వైసీపీ కునారిల్లి దశ దిశ లేని పరిస్థితుల్లో ఉంది. ఇంకా చెప్పాలంటే వచ్చిన పదకొండు అసెంబ్లీ సీట్లతో ప్రతిపక్ష హోదా మిస్ అయి అయోమయంలో పడిపోయింది.కానీ వైసీపీ అధినేత అసెంబ్లీలో ప్రతిపక్ష నేత హోదా అడుగుతూంటే కూటమి పెద్దలు మాత్రం ఏకంగా ఏపీ వ్యాప్తంగా ఆ పార్టీకి అసలు సిసలు ప్రతిపక్ష హోదానే ఇస్తున్నారు. వారు వైసీపీని గత అయిదు నెలలలో టార్గెట్ చేసిన తీరు గతంలో వైసీపీని గుర్తుకు తెస్తోంది.వైసీపీ సైతం తనకు లభించిన 151 సీట్ల అద్భుతమైన మెజారిటీతో పాలన సవ్యంగా చేయకుండా టీడీపీని అణచడానికి చూసింది. జనసేనను నిర్బంధించడానికి ఎక్కువ ఆలోచించింది. చివరికి ఏమైంది, ఆ రెండు పార్టీలు బలంగా నిలిచి పోరాడాయి. ఎన్నికల వేళలో చేతులు కలిపాయి. భారీ ఆధిక్యంతో అధికారంలోకి వచ్చాయి.ఇదంతా కళ్ల ముందు ఉన్న చరిత్రే. ప్రత్యర్థిని ఎంత టార్గెట్ చేస్తే అంతగా ఎదుగుతారు అన్నది చరిత్ర చెప్పిన సత్యం. ఆనాడు టీడీపీని లేకుండా చేస్తామని వైసీపీ గట్టి పట్టుదలకు పోయినా ఫలితం నిల్. ఈనాడు వైసీపీ ఆనవాళ్లు లేకుండా చేయాలని కూటమి పెద్దలు ఆలోచించినా అదే జరుగుతుంది అని అంటున్నారు. ఇక్కడ అంతా మరచిపోతున్నది ఏంటి అంటే జనాలను.జనాలు ఎపుడూ ప్రతిపక్షం వైపు ఉంటారు. వారు అధికారం అప్పగించేంతవరకే మద్దతు ఇస్తారు. ఆ మరుక్షణం వారే సైలెంట్ స్పెక్టేటర్లుగా మారి అంతా గమనిస్తారు. వారికి ఎలాంటి వివక్ష ఉండదు, తీర్పు కఠినంగానే ఎపుడూ ఉంటుంది.అదే సమయంలో అధికారంలోకి వచ్చిన పార్టీ ఎపుడూ అన్నీ చేయలేదు, ఒకవేళ ఎంత చేసినా ఇంకా కావాలన్నదే జనం నైజం. సో ఆ విధంగా ప్రజలలో భావన బలపడుతూ ఉంటుంది. అరవై నెలల అధికారంలో ప్రతీ నెలకూ ఇంతా ఇంతా వంతున అసంతృప్తి పెరుగుతూనే ఉంటుంది. మరి ఆ అసంతృప్తికి ఒక కేంద్ర బిందువు కావాలి కదా. అది ప్రతిపక్షంలో బలమైన పార్టీ వైపుగా చూసుకుంటుంది.సో ఆ విధంగా చూస్తే రాజకీయాల్లో ఇది ఒక అందమైన ఆట. అందువల్ల బలమైన పక్షాలను ఎపుడూ ఎదుటి పక్షాలు తాత్కాలికంగా ఇబ్బందులు పెడతాయి తప్ప ఏమీ చేయలేవు అన్నది విశ్లేషణగా ఉంది. ఇక వైసీపీ తీరు చూస్తే 40 శాతం ఓటింగ్ షేర్ తెచ్చుకుని కూడా దిగాలుగా ఉంది. అటువంటి చోట తట్టి లేపుతోంది కూటమి సర్కార్.సోషల్ మీడియా యాక్టివిస్టుల మీద కేసులు పెద్ద ఎత్తున కట్టడం ఇందులో భాగమే అనుకోవాలని అంటున్నారు. గతంలో ఎపుడో ఏదో చేశారని పాత కేసులను తిరగదోడి వారిని సైతం యాక్టివ్ చేయడం ఎవరి కోసం అన్న చర్చ అయితే ఉంది. అలా కాకుండా నిజంగా అనుచిత అసభ్యకరమైన వ్యాఖ్యలను ఫుల్ స్టాప్ పెట్టాలీ అనుకుంటే ఒక చట్టం చేసి ఇక మీదట ఈ చట్టాన్ని ఎవరైనా ఉల్లంఘిస్తే వారి మీద కేసులు పెడతామని చెబితే అది అర్థవంతం గా ఉంటుంది.అపుడూ వారూ వీరూ కూడా దారికి వస్తారు. అలా కాకుండా తమ వైపు ఉన్న వారు అంతా సుద్ద పూసలని అవతల వైపున ఉన్న వారే అన్నీ చేశారని భావిస్తూ ఏకపక్షంగా కేసులు పెడితే అది చివరికి ఇబ్బంది అవుతుంది. అయినా కూడా ఇపుడు ఇవి అవసరమా అన్న చర్చ సైతం ఉంది.ఏపీలో అనేక సమస్యలు ఉన్నాయి. వాటిని పక్కన పెట్టి రాజకీయ కక్ష కావేశాలకు ఈ విధంగా విలువైన టైం వెచ్చిస్తే చివరికి అది ప్రభుత్వంలో ఉన్న వారికే ఇబ్బంది అవుతుందని అంటున్నారు. మరో వైపు చూస్తే నిద్రావస్థలో నిండా మునిగిన ప్రతిపక్ష పార్టీని తట్టి లేపి యాక్టివేట్ చేయడం కూడా జరుగుతుందని అంటున్నారు. మొత్తం మీద ఎవరి వ్యూహాలు ఎలా ఉన్నా జనాలు మాత్రం ఎపుడూ క్లారిటీగా ఉంటారు. కాబట్టి అటు అధికార పక్షం అయినా ఇటు ప్రతిపక్షం అయినా పాలన మీద ప్రజా సమస్యల మీద ఫోకస్ పెడితేనే మేలు అని అంటున్నారు

## ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి సౌజన్యంతో సిసి రోడ్లతో పామూరు పట్టణానికి మహర్దశ

### మండల టిడిపి అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు



**పామూరు నవంబర్ 12 వార్తా ప్రభ ప్రతినిధి** కనిగిరి నియోజకవర్గం పామూరు పట్టణంలో 5 కోట్ల రూపాయలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు శరవేగంతో జరుగుతున్నాయి. అందులో భాగంగా మంగళవారం పామూరు పట్టణంలోని సిఎస్ పురం రోడ్డులోని చెన్నకేశవ నగర్ లో నూతనంగా మంజూరైన సీసీ రోడ్లకు మండల టిడిపి అధ్యక్షులు పువ్వాడ వెంకటేశ్వర్లు టిడిపి బిజెపి, జనసేన నాయకులతో కలిసి సీసీ రోడ్లకు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా పువ్వాడి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి చొరవతో పట్టణంలో సీసీ రోడ్ల నిర్మాణం శరవేగంగా జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నియోజకవర్గ కన్వీనర్ కొండిశెట్టి వెంకటరమణయ్య, రహీముల్లా,ఫోర్ మెన్ కమిటీ సభ్యులు షేక్ గౌస్ బాషా, కోటిరెడ్డి, బొల్లా నరసింహారావు, అడుసుమల్లి ప్రభాకర్, దేవరపు మాల్యాద్రి,మొబీనా మౌలాలి, షేక్ హాజీ గౌస్, డాక్టర్ నాయబ్ రసూల్, ఫత్తు మస్తాన్, ఆర్ఆర్ రఫీ, మాచర్ల రహిమాన్, షేక్ మస్తాన్ తదితర టిడిపి శ్రేణులు పాల్గొన్నారు.

## నేటి నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులకు శిక్షణ తరగతులు

**ఇబ్రహీంపట్నం, నవంబర్ 12 (వార్తా ప్రభ ప్రతినిధి):–** పంచాయతీ రాజ్ వ్యవస్థలో ప్రణాళికలు తయారు చేసేందుకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 13, 14 తేదీల్లో అధికారులు, ప్రజాప్రతినిధులకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సునీత శర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లో జిల్లా పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, జీపీడీపీ 2024 – 25 సంవత్సరం నుంచి తయారు చేసేందుకు 13న ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్ లు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, 14న డిజిటల్ అసిస్టెంట్లు, వీవో ప్రెసిడెంట్లకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

# దివంగత కళ్ళే లలిత ఆశయాలకు కృషి చేస్తాం.



దివంగత కళ్ళే లలిత కుటుంభ సభ్యులు

**విజయవాడ పశ్చిమ నవంబర్12(వార్తా ప్రభ ప్రతినిధి)**దివంగత కళ్ళే లలిత ది ఏడాదికొకసారి జయంతి, లేదా వర్ధంతి జరుపుకునే ఆశయాలు కావని అందుకే నెల నెలా ఆమె ఆశయాలు అమలు దిశగా అడుగులు వేస్తున్నామని కళ్ళే నాగేశ్వరరావు అన్నారు.అజిత్ సింగ్ నగర్ స్వర్గీయ కళ్ళే లలిత వీధిలో పేదలకు అన్నసమారాధన కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో కళ్ళే లలిత ట్రస్ట్ డైరెక్టర్లు కళ్ళే సీతా మహాలక్ష్మి ,జయదుర్గ,మేఘవాణి పాల్గొని స్వర్గీయ కళ్ళే లలిత చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు కళ్ళే నాగేశ్వరరావు పాల్గొని పేదలకు అన్నసమారాధన నిర్వహించారు.ఈ సందర్భంగా కళ్ళే నాగేశ్వరరావు మాట్లాడుతూ దివంగత కళ్ళే లలిత భౌతికంగా దూరమైన నాటి నుండి ప్రతి నెల 12వ తేదిన క్రమం తప్పకుండా గత 33నెలలు నుండి పేదలకు సింగ్ నగర్ ప్రాంతంలోని కళ్ళే లలిత వీధి వద్ద అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు.ఐతే బుడమేరు వరద ముంపు అందరిని బాధితులను చేసిందని అన్నారు. తనకు కలిగిన ఆర్థిక స్థోమత బట్టి పేదలకు, వరద బాధితులకు ఆహారాన్ని అందజేయడం జరిగిందని అన్నారు.కళ్ళే లలిత బ్రతికి ఉన్న రోజులలో పేదలకు అన్నసమారాధన చేయాలని తెలపడం జరిగిందని అందుకే ప్రతి నెల పేదలకు బోజనాలను ఏర్పాటు చేయడం జరిగిందని కళ్ళే నాగేశ్వరరావు అన్నారు.రానున్న రోజులలో కళ్ళే లలిత ట్రస్ట్ సేవలు కొనసాగిస్తాని ట్రస్ట్ అధ్యక్షులు కళ్ళే నాగేశ్వరరావు అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్ కళ్ళే సీతా మహాలక్ష్మి,జయదుర్గా,మేఘవాణి ముప్పూరి హరీష్, ఎమ్.జశ్విన్,జి. ధ్రువన్ స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# అత్యంత వైభవంగా పాండురంగ మహోత్సవాలు

● ఈ నెల 11 నుండి 15 వరకు రంగరంగ వైభవంగా ఉత్సవాలు ● రేపు జరిగే రథోత్సవాన్ని విజయవంతం చేయాలి ● స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి కొల్లు రవీంద్ర



**మచిలీపట్నం నవంబర్ 12 (వార్తాప్రభ ప్రతినిధి)**మచిలీపట్నంలో వేంచేసి ఉన్న పాండురంగ విఠల్ స్వామి వారి బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ఈ మేరకు పాండురంగ మహోత్సవాల సందర్భంగా స్వామి వారికి సతీసమేతంగా పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. మచిలీపట్నంలో వేంచేసి ఉన్న స్వామి వారి ఉత్సవాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించాలని సంకల్పించామని, భక్తులంతా తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. మన ఆలయానికి దేశ విదేశాల నుండి భక్తులు తరలిరావడం సంతోషంగా ఉందన్నారు. 1929లో భక్త నరసింహం ఆలయాన్ని పూర్తి చేశారని, 2014 సమయంలో విగ్రహ ప్రతిష్ట చేసి నిత్య కైంకర్యాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి ఏడాది కార్తీక మాసం శుద్ధ ఏకాదశి నాడు సముద్ర స్నానాలు, రథోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ప్రస్తుతం స్వామివారి ఉత్సవాల కోసం అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. లైటింగ్, శానిటేషన్, తాగునీరు, మజ్జిగ ఇతర అన్ని రకాల సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు. అదే సమయంలో ఉత్సవాలకు వచ్చే భక్తుల్లో చిన్న పిల్లలకు ట్యాగ్స్ కూడా ఏర్పాటు చేసి పిల్లల రక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. పౌర్ణమి స్నానాలకు వచ్చే భక్తులు ఇబ్బంది పడకుండా బీచ్‌లో కూడా పకడ్బందీ ఏర్పాట్లు చేశామని తెలిపారు. ప్రతి ఒక్క పౌరుడికీ స్వేచ్ఛాయుత వాతావరణంలో దర్శనం కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.

# భవానిపురం పోలీసు స్టేషన్ సి ఐ కి సినీ నటుడు పోసాని కృష్ణ మురళి పై ఫిర్యాదు చేసిన బాడిత శంకర్

### ఎఫ్ ఐ ఆర్ నమోదు చేసిన పోలీసులు





**విజయవాడ పశ్చిమ నవంబర్ 12 (వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని భావానిపురం పోలీసు స్టేషన్ సి ఐ ఉమామహేశ్వరరావు కి జనసేన పార్టీ నాయకులు బాడిత శంకర్ సినీ నటుడు పోసాని కృష్ణ మురళి పై మంగళవారం పిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు యధాతదంగా......నేను రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ పై అడ్రస్ నందు నివసిస్తూన్నాను.నేను జనసేన పార్టీ నందు "సెంట్రల్ ఆంధ్రా జోన్ కన్వీనర్" గా పనిస్తూన్నాను.పోసాని కృష్ణ మురళి, యాక్టర్ –కమ్ –పార్టుటైమ్ పొలిటిషన్ లోగడ హైదరాబాద్ "ప్రెస్ క్లబ్"లో ల 28.సెప్టెంబర్2021 ఏర్పాటు చేసిన "ప్రెస్ మీట్" లో జనసేనపార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ పై అనుచిత వ్యాఖ్యలు చేసి పార్టీ ప్రతిష్టను, ఆంధ్రప్రదేశ్ గౌరవ మర్యాదలకు భంగము కలిగే విధముగా మాట్లాడిన వీడియో ను ఇటీవల తరుచుగా సోషల్ మీడియా లో సర్క్యులేట్/ వైరల్ చేస్తూ వారి పరువుప్రతిష్టలకు భంగం కలిగిస్తూ, రాష్ట్రంలో శాంతి భద్రలకు ఆటంకం కలిగించే విధముగాచేస్తున్నారు.పోసాని కృష్ణ మురళి ఆ ప్రెస్ మీట్ లో పవన్ కళ్యాణ్ ని బూతులుతిడుతూ "బాడుకోవ్ నీకు బుద్ధి లేదా, బ్రోకర్ గాడివి, లోఫర్ గాడివి, ఎంతమందిఅమ్మాయిలను అవమానం చేసావు ", "పంజాబ్ అమ్మాయిని మోసం చేయలేదా, కడుపుచేయలేదా "అంటూ పరుష పదజాలం వాడారు. అలాగే "పవన్ కళ్యాణ్ అనే సైకో వెదవ, నీచుడా, పుల్లకు చీర కడితే ఆడదానిగా చూస్తావు, నీ కుటుంబానికి సిగ్గులేదా " అని బండ బూతులు తిట్టారని శంకర్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే ఈ ఏడాది.22. ఏప్రిల్ 2024 న కూడా వైసీపీ పార్టీ వేదికగా పోసాని కృష్ణ మురళి పవన్‌కళ్యాణ్ కి నాల్గవ పెళ్ళాం ఉందని, పంజాబ్ అమ్మాయిని వాడుకున్నారని, కడుపుచేసారని, వదిలేశారని, ఐదవ పెళ్ళాం వెయిటింగ్ లో ఉందని కూడా దూషించడంజరిగింది . ఆ రెండు వీడియోలను ఇటీవల వైసీపీ పార్టీ వారు తరచూ సోషల్ మీడియాలో ఎక్కువగా సర్క్యులేట్ చేస్తూ జనసేన పార్టీని,పవన్ కళ్యాణ్ నిప్రజలలో అప్రతిష్ట చేస్తున్నారు.నేను గతంలో అనేక సార్లు ఈ విషయమై అప్పటి పోలీస్ వారికి ఫిర్యాదుచేసినప్పటికీ అప్పటి పోలీస్ అధికారులు చర్యలు తీసుకోలేదు .కావున దయఉంచి, రాష్ట్రంలో శాంతి భద్రలకు ఆటంకం కలిగించేవిధంగామరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పరువు ప్రతిష్టలను దెబ్బతీసేవిధంగా కుట్రపన్నివీడియోలను సర్క్యులేట్ చేస్తున్న పోసాని కృష్ణ మురళిపై వైసీపీ పార్టీకి చెందిననాయకులపై తగిన చర్యలు తీసుకోవలసిందిగా కోరుతున్నాను.ఆ వీడియోలను సోషల్‌మీడియాలో ఇకపై సర్క్యులేట్ అవకుండా చర్యలు తీసుకొని న్యాయం చేయవలసిందిగా కోరారు. ఈ పిర్యాదు తో పాటుగా ...పెన్ డ్రైవ్ పోసాని కృష్ణ మురళి మాట్లాడిన వీడియోలు కూడా సి ఐ కి అందించారు.

## వరద నష్ట పరిహారం అందలేదని ప్రజా వేదికలో ఫిర్యాదు

### కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన కౌన్సిలర్ ధరణికోట విజయలక్ష్మి



**ఇబ్రహీంపట్నం నవంబర్ 12(వార్తా ప్రభ ప్రతినిధి):–** కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఇబ్రహీంపట్నం ఫెర్రీరోడ్ లో ఉన్న వ్యాపారస్తులకు వరద వలన తీవ్ర నష్టం జరిగింది.వారికి ప్రభుత్వం అందించే నష్టపరిహారం కోసం నమోదు చేసిన కూడా ఇప్పటి వరకు పరిహారం అందలేదని కలెక్టర్ కు ప్రజా వేదికలో కొండపల్లి మున్సిపాలిటీ కౌన్సిలర్ ధరణికోట విజయలక్ష్మి వినతి పత్రం సమర్పించారు. ఈ విషయం పై ఎన్ని సార్లు ఎమ్మార్వో కు మరియు మున్సిపల్ కమిషనర్ కు చెప్పిన ఎలాంటి ఉపయోగం లేదని తెలిపారు. వెంటనే నష్టపోయిన వ్యాపారస్తులకు వరద నష్టపరిహారం అందజేయాలని లేనిపక్షంలో ముఖ్యమంత్రి దృష్టికి సమస్యలను తీసుకెళ్తామని అన్నారు.

## తెలుగు నాడు కాంట్రాక్ట్ కార్మిక సంఘం రీజనల్ కార్యనిర్వాహక కార్యదర్శిగా జానీ షరీఫ్



**ఇబ్రహీంపట్నం నవంబర్ 12(వార్తా ప్రభ ప్రతినిధి):–**తెలుగు నాడు కాంట్రాక్ట్ కార్మిక సంఘం రీజనల్ కార్యనిర్వాహక కార్యదర్శిగా షేక్ జానీ షరీఫ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. యూనియన్ కార్యాలయంలో డాక్టర్ ఎన్ టి టి పి ఎస్ తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం రీజనల్ అధ్యక్షులు ఆలపాటి శివ నాగేశ్వరావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో జాని షరీఫ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. అనంతరం యాసిన్ అనే కార్మికుడు తెలుగు నాడు కాంట్రాక్ట్ కార్మిక సంఘం లో చేరారు. ఈ సందర్భంగా తెలుగు సంఘం నాయకులు, కార్మికులు జానీ షరీఫ్ కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు నాడు కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షులు స్వతంత్ర కుమార్ దర్శనపు,ప్రధాన కార్యదర్శి మందడపు దుర్గారావు, కార్యనిర్వాహక అధ్యక్షులు ఆకునూరి రత్న శేఖర్, ప్రచార కార్యదర్శి జొన్నలగడ్డ రాజేష్,కార్యవర్గ సభ్యులు సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## నిజాయతీ చాటుకున్న కానిస్టేబుల్ వల్లభాపురపు చందు



**విజయవాడ పశ్చిమ నవంబర్ 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కానిస్టేబుల్ వల్లభాపురం చందు (పి సి నెంబర్ 346) అజిత్ సింగ్ నగర్ లో పనిచేస్తున్నారు.ఆయన కబేలా సెంటర్ కొండ ప్రాంతంలోని తన ఇంటినుంచి మంగళవారంమధ్యాహ్నం సితార సెంటర్ మీదుగా సింగ్ నగర్ పోలీసు స్టేషనుకి విధులకు వెళ్తున్న చందు కి సితార సెంటర్లో పర్సు దొరికింది. అందులో 16,500 నగదు, ఆధార్ కార్డు, పాన్ కార్డు, తో పాటు హెల్త్ డాక్యుమెంట్స్ వున్నాయి.కానిస్టేబుల్ చందు వెంటనే కంట్రోల్ రూం కి కాల్ చేసి ఇన్ఫర్మేషన్ ఇచ్చారు.సదరు బాధితుడికి ఫోన్ చేసి వివరాలు తెలిపారు. బాధితుడు కబేలా సెంటర్లో రైల్వే కట్ట వైపు నివాసముంటున్న పెండ్యాల సత్యనారాయణ రైల్వే విశ్రాంతి ఉద్యోగి తాను పోగొట్టుకున్న పర్స్ లోని వివరాలు పోలీసులకు వివరించారు. దాంతో కానిస్టేబుల్ చందూకి దొరికిన పర్సు విశ్రాంత రైల్వే ఉద్యోగి పెండ్యాల సత్యనారాయణ ది గా నిర్ధారించారు. మంగళవారం భవానిపురం పోలీస్ స్టేషన్ లో ఎస్ ఐ ప్రకాష్ సమక్షంలో పర్సు నీ పెండ్యాల సత్యనారాయణకి అందజేశారు.ఎస్ ఐ ప్రకాష్ తో పాటు భవానిపురం పోలీస్ స్టేషన్ సిబ్బంది కానిస్టేబుల్ చందూని అభినందించారు.

### మధుమేహ నిరోధక దినం సందర్భంగా.....

## 14న ఎస్. హెచ్. ఓలో మధుమేహంపై శాస్త్రీయ అవగాహన సభ

**విజయవాడ పశ్చిమ నవంబర్ 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)** నేటి సమాజంలో రోజురోజుకీ పెరిగిపోతున్న మధుమేహం నిరోధమే లక్ష్యంగా ఎస్ .హెచ్. ఓ . హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నవంబర్ 14వ తేదీన ప్రపంచ "మధుమేహనిరోధక దినం" సందర్భంగా గురువారం ఉదయం 9 గంటలకు "మధుమేహం –కారణాలు– లక్షణాలు– నిర్ధారణ పరీక్షలు– చికిత్స విధానాలు, రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు "అనే అంశంపై శాస్త్రీయ అవగాహన సభ నిర్వహిస్తున్నామని ఎస్. హెచ్. ఓ .అధ్యక్షులు డాక్టర్ టి. సేవకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరులోని 2/1 బ్రాడీపేట లో గల ఎస్. హెచ్. ఓ సమావేశ మందిరంలో నిర్వహించే ఈ సభలో అత్యధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని మధుమేహం వ్యాప్తి నిరోధములో భాగస్వాములు కావాలని డాక్టర్డాక్టర్ టీ సేవకుమార్ వ్యవస్థాపకులు ,ఎస్. హెచ్.ఓ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, వ్యవస్థాపకులు డాక్టర్ టి సేవా కుమార్ పిలుపునిచ్చారు.

## బెజవాడ కనకదుర్గమ్మ సన్నిధిలో సినీ హీరో వరుణ్ తేజ్





**విజయవాడ పశ్చిమ నవంబర్ 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ ఇంద్రకీలాద్రిపై వెలసిన శ్రీ కనక దుర్గమ్మ అమ్మవారిని మంగళవారం ప్రముఖ సినీ హీరో వరుణ్ తేజ్. దర్శించుకున్నారు.శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంకి ప్రముఖ చలనచిత్ర కథానాయకులు వరుణ్ తేజ్, బృందం అమ్మవారి ఆలయమునకు విచ్చేయగా ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించారు.అనంతరం వీరికి ఆలయ ఈవో కె.ఎస్ రామరావు వేదపండితులచే వేదాశీర్వచనం కల్పించి, అమ్మవారి ప్రసాదం, శేష వస్త్రం మరియు చిత్రపటం అందజేశారు.

## కూటమి ప్రభుత్వం బడ్జెట్ తో ప్రజలకు అభివృద్ధి



**రెడ్డిగూడెం నవంబర్ 12 (వార్తాప్రభ ప్రతినిధి)** :కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలకు ఆమోద యోగ్యమైనదిగా , అభివృద్ధి సంక్షేమం కలబోతగా ఉందని నాగేశ్వరరెడ్డి అన్నారు.ఈ బడ్జెట్ తో ఆరోగ్యం విద్య , వ్యవసాయ సామాజిక సంక్షేమ రంగాలకు ప్రాధాన్యతనిచ్చారనివిద్యారంగంలో తల్లికి వందనం గ్రామీణాభివృద్ధి రోడ్లు జల వనరుల అభివృద్ధి కోసం ఈ బడ్జెట్లో పెద్ద మొత్తంలో నిధులు కేటాయించారని రాజధాని పోలవరం నిర్మాణానికి ఊపు తెచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని జగన్ ప్రభుత్వంలో గాడి తప్పిన ఈ రాష్ట్రానికి కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్ర పునర్నిర్మాణానికి పునాది వంటిదని నాగేశ్వరరెడ్డి అన్నారు.ఈ కార్యక్రమం లో టీడీపీ నాయకులు పీ కిరణ్ కుమార్ రెడ్డి పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ గా పైడిమర్రి మాల్యాద్రి.



**కైకలూరు నవంబర్ 12 (వార్త ప్రభ)**కైకలూరు కు చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పైడిమర్రి మాల్యాద్రి రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ గా నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.ఈ సందర్భంగా కైకలూరు నియోజకవర్గానికి చెందిన పలువురు కూటమి నాయకులు తెలుగుదేశం, బిజెపి, జనసేన పలువురు నాయకులు పైడిమర్రి మాల్యాద్రి కు శుభాకాంక్షలు తెలియజేశారు.

# వికసిత్ భారత్ నిర్మాణంలో సహకార సంఘాల పాత్ర కీలకం..

**- జిల్లాలో సహకార వారోత్సవాలను విజయవంతం చేద్దాం.. - జిల్లా ఇన్‌ఛార్జ్ కలెక్టర్ డా. నిధిమీనా.**



**విజయవాడ, నవంబర్ 12 (వార్తాప్రభ ప్రతినిధి)**సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన, మెరుగైన ప్రపంచ నిర్మాణంలో సహకార సంస్థల పాత్ర కీలకమని, సహకార వారోత్సవాల విజయవంతం సంఘాల బలోపేతానికి దోహదపడుతుందని ఈనెల 14వ తేదీ నుండి నిర్వహించనున్న సహకార వారోత్సవాలను విజయవంతం చేసేందుకు కృషిచేయాలని ఇన్‌ఛార్జ్ కలెక్టర్ డా. నిధిమీనా తెలిపారు. ఈ నెల 14వ తేదీ నుండి 20వ తేదీ వరకు నిర్వహించనున్న 71వ అఖిల భారత సహకార వారోత్సవాలకు సంబంధించిన ప్రచార గోడ పత్రికను ఇన్‌చార్జ్ జిల్లా కలెక్టర్ డా. నిధిమీనా మంగళవారం నగరంలోని ఆమె ఛాంబర్‌లో ఆవిష్కరించారు. అనంతరం డా. నిధి మీనా మాట్లాడుతూ సుస్థర అభివృద్ధి లక్ష్యాల సాధనకు సహకార సంఘాలు ఎంతో దోహదపడతాయన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకార్ సే సమృద్ధి యోజన ద్వారా ఇప్పటికే పలు కార్యక్రమాలను అమలు చేయడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా ప్రధానమంత్రి జన ఔషధి ద్వారా జిల్లాలో ఐదు జనరిక్ మందుల కేంద్రాలను ప్రారంభించడం జరిగిందన్నారు. మూడు పెట్రోల్ బంకుల నిర్వహణను సహకార సంఘాలకు అప్పగించడంతో పాటు గిడ్డంగుల నిర్వహణ జరిగిందన్నారు. సహకార సంఘాల కార్యకలాపాలను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు జిల్లాలోని అన్ని సహకార సంఘాలకు సంబంధించిన డేటాను అన్‌లైన్‌లో పొందపరచడం అభినందనీయమన్నారు. వారోత్సవాలలో భాగంగా 14వ తేదీన సహకార శాఖ ద్వారా అమలు చేసే నూతన కార్యక్రమాల గురించి వివరించడం, 15వ తేదీన నూతన అవిష్కరణలు, సాంకేతికత సుపరిపాలన, 16వ తేదీన వ్యవస్థాపకత, ఉపాధి కల్పన, నైపుణాభివృద్ధిలో సహకార సంఘాల పాత్ర, 17వ తేదీన సహకార సంస్థల వ్యాపార ప్రాయోజిత సంస్థలుగా రూపాంతరం, 18వ తేదీన సహకార సంఘాల మధ్య సహకారాన్ని పెంపొందించడం, 19వ తేదీన మహిళలు, యువత, బలహీనవర్గాలకు సహకారంలో సహకార సంఘాల పాత్ర, 20వ తేదీన సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో సహకార సంఘాల పాత్ర వంటి అంశాలపై అవగాహన కల్పించి సహకార సంఘాల బలోపేతానికి కృషిచేయాలని నిధి మీనా తెలిపారు. గోడ పత్రికల విడుదల కార్యక్రమంలో జిల్లా కో ఆపరేటివ్ అధికారి డా. ఎస్ శ్రీనివాసరెడ్డి, జిల్లా కో-ఆపరేటివ్ ఆడిట్ ఆఫీసర్ సీహెచ్ శ్కెలజ, డివిజనల్ కో%-%ఆపరేటివ్ అధికారి పి. కిరణ్ కుమార్, డిప్యూటీ రిజిస్ట్రార్ ఎస్ కేశవ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## టీటీడీ పాలకమండలి సభ్యుడు భాను ప్రకాష్ రెడ్డికి సత్కారం



**ఇబ్రహీంపట్నం, నవంబర్ 12 (వార్తా ప్రభ ప్రతినిధి):-** తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యుడు భాను ప్రకాష్ రెడ్డికి బీజేపీ మైలవరం నియోజకవర్గ కన్వీనర్ నూతులపాటి బాలకోటేశ్వరరావు అభినందనలు తెలిపారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం ఓ కార్యక్రమానికి విచ్చేసిన భాను ప్రకాష్ రెడ్డిని నూతులపాటి మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

## పి.యస్.సి.యమ్.ఆర్ కళాశాలలో - యూనివర్సిటీ పరిధిలోని అన్ని కళాశాలలోని విద్యార్థిని విద్యార్థులకు చెస్ (మెన్ అండ్ ఉమెన్స్) పోటీలు



**విజయవాడ పశ్చిమనవంబర్ 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)**జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ కాకినాడ, యూనివర్సిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ ఆదేశాలమేరకు పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జున రావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ అటానమస్‌ఆతిథ్యంలో యూనివర్సిటీ పరిధిలోని అన్ని కళాశాలలోని విద్యార్థిని విద్యార్థులకు చెస్ (మెన్ అండ్ ఉమెన్స్)పోటీలు నిర్వహించనున్నారు. ఇది ఎంతో సంతోషకరమని తెలియజేస్తూ కళాశాల సెక్రటరీ సీఏ అమర సుధీర్ చేతులమీదుగా పోస్టర్ను రిలీజ్ చేశారు. యూనివర్సిటీ పరిధిలోని వివిధ ఇంజనీరింగ్ కళాశాలల నుండి దాదాపు 300మందికి పైగా విద్యార్థులు చెస్ పోటీలలో పాల్గొంటున్నారని అందుకు ఆతిథ్యం ఇవ్వడం ఎంతో సంతోషమని,కళశాల ఫ్యాకల్టీ మరియు స్టూడెంట్స్ స్పోర్ట్స్ కమిటీ సభ్యులు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారని తెలియజేశారు. చెస్ పోటీల పర్యవేక్షకుడిగా యూనివర్సిటీ నుండి డాక్టర్ జి.పి. రాజు సెక్రటరీ - జె.యన్.టి.యూ.కెఇంటర్ కాలజియెట్ టోర్నమెంట్స్ వ్యవహరిస్తారని తెలియజేశారు. ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన వారికిడిసెంబర్ 4 నుండి 7 వరకు వెల్ టెక్ యూనివర్సిటీ చెన్నైలో జరగబోయే టోర్నమెంట్లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ట్రెజరర్ కాజా రాఘవయ్య , కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సరవణ కుమార్ , అకాడమిక్స్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ పతంజలి శాస్త్రి , అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్‌కె సురేష్ బాబు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్ మణికంఠ , ఫిజికల్ డైరెక్టర్ విక్టర్ జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో మూడు సెంట్లు పట్టణాల్లో రెండు నివాసిత స్థలాలకు ఉద్యమాకి సిద్ధం కండి

## ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనపూడి శంకర్ పిలుపునిచ్చారు

**విజయవాడ పశ్చిమ నవంబర్ 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)**పేదల ఇళ్ల స్థలాలు ఇల్లు నిర్మాణం కోసం భారత్ కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నవంబర్ 18వ తేదీన సోమవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామ వార్డు సచివాలయాల వద్ద పేదలతో వ్యక్తిగత అర్జీలు అందించి ఆందోళన కార్యక్రమం చేపట్టడం జరుగుతుంది. తిరువూరు నియోజకవర్గం విస్తృత స్థాయి కమిటీ సమావేశం సిపిఐ తిరువూరు పట్టణ సహాయ కార్యదర్శి షేక్ సుభాని అధ్యక్షతన సోమవారం సుంకర వీరభద్ర భవనంలో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి విచ్చేసినటువంటి ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్,ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తూము కృష్ణయ్య,వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుకూరు వెంకటేశ్వరరావు, పట్టణ కార్యదర్శి మాలపాటి ఉదయ్,వేదిక అలంకరించగాఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనపూడి శంకర్ మాట్లాడుతూ.... పేదలకు గ్రామాలలో నిర్వాసితులకు మూడు సెంట్లు పట్టణాల్లో రెండు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి అని అన్నారు. ఇంటి నిర్మాణం కోసం ఐదు లక్షల చొప్పున మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గత వైసిపి ప్రభుత్వం మాయలో పేదలకు గ్రామాల్లో ఒకటిన్నర సెంట్లు పట్టణంలో ఒక సెంటు చొప్పున ఇళ్ల స్థలాలు పట్టణాలకు సుదూరంగా నివాస యోగం కానీ ప్రాంతాలలో కేటాయించడం జరిగింది. అందులో చాలా మంది పేదలకు ఇప్పటివరకు ఇళ్ల స్థలాలు చూపలేదు అని అన్నారు. ప్రభుత్వం ఇచ్చే ఒక సెంటు స్థలం పేదలకు నివాసానికి ఏమాత్రం సరిపోదని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం బి.కె.ఎం యు లు ఆనాడే వైసీపీ ప్రభుత్వానికి చెప్పినప్పటికీ ఖాతర చేయకుండా నాటి ప్రభుత్వం మొండిగా ముందుకెళ్ళింది అని అన్నారు. కాకి లెక్కలతో 32 లక్షల మంది ఇళ్ల పట్టాలు ఇచ్చినప్పటికీ పేదలు ఆ స్థలాల పట్ల సుముఖత చూపలేదు పైగా ఇంటి నిర్మాణానికి ఇచ్చే ఆర్థిక సహాయం కూడా కేవలం 1,80,000 మాత్రమే ప్రకటించారు. ఆర్థిక సహాయంతో పునాదులు కూడా పూర్తి చేయలేమని పేదలవ్వరు కూడా ఇంటి నిర్మాణం చేపట్టలేదు అని అన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు పేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు పట్టణాల్లో రెండు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నా తర్వాత కూడా ముఖ్యమంత్రి అదే విధంగా హామీ ఇస్తూ ఇంటి నిర్మాణానికి నాలుగు లక్షల చొప్పున ఇస్తామని చెప్పడం జరిగింది. ఇంటి కేటాయింపు స్థలం పట్ల చంద్రబాబు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సానుకూలమే. సిమెంటు, ఇసుక,ఇనుము,కంకర, తదితర సామాగ్రి ధరలు పెరిగిన రిత్యా 5 లక్షలకు పెంచి గృహ నిర్మాణానికి మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు తిరువూరు పట్టణ కార్యదర్శి ఎన్. వనమాలి,విసన్నపేట మండల కార్యదర్శి ఎం త్యాగరాజు,గంపలగూడెం మండల కార్యదర్శి ఉన్నాం సాంబశివరావు,ఏ కొండూరు కార్యదర్శి ముచ్చింతల వెంకటేశ్వరరావు, సిపిఐ పార్టీ పట్టణ కమిటీ సభ్యులు బాణాల అశోక్,ఎస్కే మస్తాన్, బత్తుల వెంకటేష్, పాలకుర్తి సునీల్, కమిటీ సభ్యులు యాకోబ్, నరసింహారావు, హసన్, ఉదయ్, శివ, మాదాసు ప్రసాద్, గురువులు, కార్తీక్, రాజేష్, పైడిపల్లి రవి, వెంకట్రావు, దానయ్య, తదితరులు పాల్గొన్నారు.



# బడ్జెట్ నిరుత్సాహపరిచింది

**-వైసీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు**



**విజయవాడ పశ్చిమ నవంబర్ 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)**రాష్ట్ర బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలను నిరుత్సాహపరిచిందని వైసీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. అరకొర నిధులు, అంకెల గారడీతో కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను మరోసారి మోసగించిందన్నారు. రూ. 2.94 లక్షల కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టినా.. ఏ రంగానికి పూర్తిస్థాయిలో నిధులు కేటాయించలేకపో యిందన్నారు. ముఖ్యంగా రైతులు, మహిళలు, యువతకు ఈ బడ్జెట్ తో ఒరిగేదేమీ లేదన్నారు. పేదరిక నిర్మూలన, మహిళా సాధికారత, రైతు సంక్షేమానికి సరిపడా ఎక్కడా కేటాయింపులు లేవని.. సూపర్ సిక్స్ పథకాల ఊసే కానరాలేదన్నారు. ఈ ప్రభుత్వానికి ఆడంబరాలపై ఉన్న శ్రద్ధ.. విద్యా, వైద్య, వ్యవసాయ రంగాలపై లేదని ఈ సందర్భంగా మరోసారి రుజువైందన్నారు. పైగా నవంబర్ లో బడ్జెట్ ప్రవేశపెట్టడం దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేదని.. ఖర్చులు, జమ అయిపోయిన తరుణంలో బడ్జెట్ ప్రవేశపెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. 2019లో మే 30న వైసీపీ ప్రభుత్వం ఏర్పడితే, కేవలం నెలన్నర రోజుల్లో జూలై 12న బడ్జెట్ ప్రవేశపెట్టామని ఈ సందర్భంగా గుర్తుచేశారు. కానీ ఈ ప్రభుత్వం పథకాలకు కేటాయింపులు లేకుండానే బడ్జెట్ ను రూ. 41 వేల కోట్లు పెంచేసిందని విమర్శించారు. అలాగే రాష్ట్ర బడ్జెట్ లో విజయవాడ నగరానికి మొండిచేయి చూపారని మల్లాది విష్ణు ఆరోపించారు. గుణదల ఫ్లైఓవర్, బుడమేరు ఆధునికీకరణ, వరద ప్రభావిత ప్రాంతాల్లో చేపట్టవలసిన రహదారులు, డ్రెయిన్లు, ఇతర మరమ్మతులకు బడ్జెట్లో నిధులు కేటాయించలేదని దుయ్యబట్టారు. మొత్తానికి కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలను మోసగించిందని.. మసిపూసి మారేడు కాయలాగా బడ్జెట్ ఉందని మల్లాది విష్ణు అభిప్రాయపడ్డారు.

## చల్లపల్లి పోలీస్ స్టేషన్ ,సిఐ కార్యాలయాన్ని సందర్శించిన ఎస్పీ గంగాధరరావు.




**చల్లపల్లి: అవనిగడ్డ: నవంబర్ 12(వార్తాప్రభ ప్రతినిధి)**పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తిచేసి చిన్నారుల మరియుమహిళల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కృష్ణాజిల్లా ఎస్పీ గంగాధరరావు అన్నారు. సాధారణ తనిఖీలలో భాగంగా మంగళవారం చల్లపల్లి పోలీస్ స్టేషన్, సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తిచేయాలని, చిన్నారుల, మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. పోలీసు స్టేషన్ నిర్వహణ, పరిసర ప్రాంతాలు, సిబ్బంది పనితీరు, విధులు, ముఖ్యమైన కేసుల దర్యాప్తు, స్టేషన్‌లో నిర్వహిస్తున్న కేసు డైరీ, విలేజ్ రోస్టర్, వివిధ క్రైమ్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. కొత్త చట్టాలను ప్రతి పోలీస్ స్టేషన్ నందు అమలు పరచాలని, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు సర్కిల్ పరిధిలో తీసుకున్న చర్యలను సమీక్షించారు. బ్లాక్‌స్పాట్స్ దగ్గర రోడ్డు ప్రమాదాలు జరుగకుండా6 ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తీసుకున్న చర్యలను సమీక్షించారు. రోడ్డు భద్రతా నియమాల ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలని, డ్రంకన్ డ్రైవ్, రోడ్డు భద్రతా నియమాలపై కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. హత్యలు, హత్యాయత్నాలు, క్రైమ్ ఎగైనెస్ట్ ఉమన్, గర్ల్ మిస్సింగ్, ప్రాపర్టీ కేసులు, రోడ్డు ప్రమాదాలు, తదితర కేసుల రికార్డ్సను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుల్లో పెండింగ్ కేసులు వాటి స్థితిగతులు, నిందితుల అరెస్టు, కేసుల దర్యాప్తు తీరుతెన్నులు వాటి పురోగతిపై కేసుల ఫైల్స్‌ను క్షుణ్ణంగా పరిశీలించి నిందితులు అరెస్ట్ కాని కేసులలో నిందితులను త్వరగా అరెస్ట్ చేయాలని ఆదేశించారు. సమన్లు, నాన్ బెయిలబుల్ వారెంట్లు పెండింగ్‌లో ఉంచకుండా సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ డిఎస్పీ మురళీధర్, చల్లపల్లి సిఐ ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు

# ఇళ్ల స్థలాల సాధనకు సిపిఐ పోరాటం

**● కూటమి ప్రభుత్వ ఎన్నికల హామీని నెరవేర్చాలి ● సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ డిమాండ్**



**విజయవాడ పశ్చిమ నవంబర్ 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఇళ్ల స్థలాల సాధన కోసం సీపీఐ చేపట్టిన పోరాట కార్యక్రమానికి లబ్ధిదారులు ముందుకు రావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపు ఇచ్చారు. సీపీఐ విజయవాడ నగర కార్యవర్గ సమావేశం మంగళవారం సాయంత్రం హనుమాన్ పేట దాసరి భవన్లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన కే రామకృష్ణ మాట్లాడుతూ ఇళ్ల స్థలాల లబ్ధిదారుల్లో 90శాతం దళితులు, గిరిజనులు, మైనార్టీలు, వెనుకబడిన తరగతుల వారే ఉన్నారని చెప్పారు. గతంలో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఒక్కో కుటుంబానికి ఒక్క సెంటు స్థలం కేటాయించి, ఇంటి నిర్మాణానికి లక్షా ఎనభ్కైవేలు మాత్రమే ఇచ్చిందన్నారు. చాలా చోట్ల ఇళ్ల స్థలాల లే అవుట్లు అసంపూర్తిగా ఉన్నాయని, కొన్ని ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణం మధ్యలోనే ఆగిపోయిందన్నారు. ఇళ్లు లేక పేదలు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇసుక, ఇటుక, ఇనుము, కంకర ధరలు పెరిగిన కారణంగా ప్రతి ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు పేదలకు పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు నివేశన స్థలాలు కేటాయించాలని కోరారు. పేదలకు ఇళ్ల స్థలాల సాధన కోసం సీపీఐ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ నెల 18వ తేదిన ఇళ్ల లబ్ధిదారులతో సచివాలయాల్లో అర్జీ సమర్పించేలా రాష్ట్ర వ్యాప్తంగా సీపీఐ శ్రేణులు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. ఇంటింటి సర్వే నిర్వహించి అర్హులైన పేదల జాబితా రూపొందించాలని సూచించారు. లబ్ధిదారులను భారీ ఎత్తున సమీకరించిన అన్ని సచివాలయాల్లో పెద్ద సంఖ్యలో అర్జీలు సమర్పించేలా సీపీఐ నాయకత్వం బాధ్యత తీసుకోవాలన్నారు. అర్జీలు రాయటం, వాటిని సచివాలయాల్లో సమర్పించేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందించే బాధ్యత పార్టీ పట్టణ, నగర నాయకత్వాలు తీసుకోవాలన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్ళకు సంబంధించి వైసీపీ ప్రభుత్వం కంట్రాక్టర్లకు డబ్బులు చెల్లించని కారణంగా ఇళ్లను లబ్దిదారులకు కేటాయించలేదన్నారు. బ్యాంకు రుణాలు తీసుకున్న కారణంగా ఇంటిలోకి వెళ్లకుండానే బ్యాంకు యాజమాన్యం నుంచి రుణాలు చెల్లించాలంటూ లబ్దిదారులకు డిమాండ్ నోటీసులు వస్తున్నాయని చెప్పారు. గ్రామాల్లో కంటే పట్టణాల్లో ఇళ్లలేని పేదలు అధిక సంఖ్యలో ఉన్నారని చెప్పారు. ఈ పరిస్థితుల్లో ఇళ్లు, ఇంటి స్థలాల లబ్బిదారులను సమీకరించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, నగర కార్యదర్శి జి కోటేశ్వరరావు పాల్గొనగా కార్యవర్గ సభ్యులు లింగా బత్తిన శివకుమార్ సమావేశానికి అధ్యక్షత వహించారు.

## యనమదల గ్రామంలో గ్రామసభ నిర్వహణ



**చేజర్ల నవంబరు 12 (వార్తాప్రభ)** మండలంలోని యనమదల గ్రామ సచివాలయం లో మంగళవారం రీసర్వేపై గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు ఆర్.మస్తానయ్య అధ్యక్షతన గ్రామసభ నిర్వహించి రీసర్వేకి సంబంధించిన భూ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ వెంకటేశ్వర్లు గ్రామ విఆర్ఓ కోటేశ్వరరావు గ్రామ సర్వేయర్ సురేష్ సంబంధిత రెవెన్యూ అధికారులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## అన్న క్యాంటీన్ లలో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసుకోండి

**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**



**విజయవాడ పశ్చిమ నవంబర్ 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలో ఉన్న అన్న క్యాంటీన్లలో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని అన్న క్యాంటీన్ నోడల్ ఆఫీసర్లతో మంగళవారం ఉదయం నిర్వహించిన టెలికాన్ఫ ఒన్స్ లో విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న 11 అన్న క్యాంటీన్ లకు గాను 11 నోడల్ ఆఫీసర్లను నియమించగా, ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు 11 వార్డ్ వెల్ఫేర్ / ఏమినిటీస్ సెక్రెటరీలను, మధ్యాహ్నం మూడు గంటల నుండి రాత్రి 9 గంటల వరకు మరో 11 వార్డ్ వెల్ఫేర్ / ఏమినిటీస్ సెక్రటరీలను అన్న క్యాంటీన్ల నిర్వహణ, పర్యవేక్షణకు గాను నియమించారు. వారితో టెలికాన్ఫరెన్స్ ద్వారా కమిషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర పరిధిలో ఉన్న 11 అన్న క్యాంటీన్లో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నోడల్ ఆఫీసర్లు చూసుకోవాలని, ప్రతిరోజు మూడు పూట్ల ఇచ్చే టోకెన్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని, కిచెన్ లో పరిశుభ్రత, భోజనంలో నాణ్యత, త్రాగునీటి సరఫరా, వాడుక నీరు సరఫరా, మరుగుదొడ్ల నిర్వహణ వంటి అంశాలు నిరంతరం పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు పరిశుభ్రపరుస్తూ ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## మాదిగ కార్పొరేషన్ చైర్ పర్సన్ డాక్టర్ ఉండవల్లి శ్రీదేవిని కలిసి అభినందనలు తెలియ చేసిన బీసీ సంఘాలు



**విజయవాడ పశ్చిమ నవంబర్ 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఆంధ్రప్రదేశ్ నూతన మాదిగ కార్పొరేషన్ చైర్పర్సన్ గా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తో నియమితురాలైన మాజీ శాసన సభ్యురాలు శ్రీమతి ఉండవల్లి శ్రీదేవి ని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి ఢిల్లీ వ్యవహారాల ఇంచార్జ్ కర్రి వేణుమాధవ్ బీసీ సంఘ నాయకులు తాటికొండ రంగబాబు ఆంధ్రప్రదేశ్ కార్పెంటర్స్ యూనియన్ అధ్యక్షుడు కే రాఘవేంద్ర ఆంధ్రప్రదేశ్ బిజెపి విశ్వకర్మ కౌన్సిల్ యోజన కన్వీనర్ బీసీ నాయకులు తోలేటి సురేష్ పిళ్ళా దినేష్ కృష్ణ మల్లికార్జున్ కోయదొర తో కలిసి నూతనంగా ఆంధ్రప్రదేశ్ మాదిగ కార్పొరేషన్ చైర్పర్సన్ గా శ్రీమతి ఉండవల్లి శ్రీదేవి కి వచ్చిన సందర్భంగా అభినందనలు తెలిపారు. బీసీ నాయకులు మరింత ధైర్యంగా చైతన్యవంతమైన మాదిగ యువత ఉపాధి ఉద్యోగ అవకాశాల్లో కేంద్ర స్థాయి పథకాలు కూడా రాష్ట్రంలో మాదిగ యువతకి తీసుకువచ్చి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నమ్మకాన్ని మాదిగ యువతి యువకుల భవిష్యత్తుని ముందుకు తీసుకువెళ్లాలని వేణుమాధవ్ ఆకాంక్షించారు ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వద్ద మరియు అమరావతి రైతుల వద్ద అధికార పార్టీని లెక్క చేయక రాజధాని భవిష్యత్తు రాష్ట్రంలో యువత భవిష్యత్తు అభివృద్ధి చెందాలంటే తప్పనిసరిగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వల్లే సాధ్యమని నమ్మి ఆ విధంగా తన రాజకీయ భవిష్యత్తుని ఫణంగా పెట్టి తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు వెంట నడిచి రాష్ట్రంలో అన్ని వర్గాల చేత శభాష్ అనిపించుకొని శ్రీమతి ఉండవల్లి శ్రీదేవి రాష్ట్రంలో మాదిగ కార్పొరేషన్ ద్వారా మరింత మంచి పేరు తెచ్చుకోవాలని బీసీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆక్రమణలకు గుర్తించేందుకు సర్వే. -సబ్ కలెక్టర్

**గిద్దలూరు, నవంబర్ 12 (వార్తాప్రభ ప్రతినిధి):-** గిద్దలూరు పట్టణంలోని కాశినాయన కుంటలో ఆక్రమణలను గుర్తించేందుకు సర్వే చేపట్టామని మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ అన్నారు. ఇప్పటికే ఓ కమిటీని ఏర్పాటు చేశామని 8 ఎకరాలకు పైగా కాశి నాయన కుంట విస్తరించి ఉన్న విషయం రిపోర్టర్ లో ఉందన్నారు. 9 సర్వే నంబర్లలో ఆక్రమణలకు గురి అయినట్లుగా తమకు ఫిర్యాదులు అన్యాయని కలెక్టర్ ఇచ్చిన ఆదేశాల మేరకు ఇప్పటికే సర్వే చేపట్టడం జరిగిందన్నారు. విచారణ అనంతరం పూర్తి వివరాలు కలెక్టర్ కు అందిస్తామని మార్కాపురం సబ్ కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ఆంజనేయ రెడ్డి నగర పంచాయతీ కమిషనర్ వెంకట దాసు తదితరులు పాల్గొన్నారు



# "స్టైలిష్ బాయ్"కి పవర్ ఫుల్ పోస్ట్!!

- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా నియామకం
- ఉత్తరువు పత్రం అందజేసిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్
- సన్నీకి పదవి దక్కడంపై గోదావరిఖనిలో హర్షాతిరేకాలు



**పెద్దపల్లి/ గోదావరిఖని: నవంబర్ 12 (వార్తాప్రభ ప్రతినిధి)**"స్టైలిష్ బాయ్"కి పవర్ ఫుల్ పోస్ట్ దక్కినది. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా నియామకం అయ్యారు. ఈ మేరకు మంగళవారం రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ నియామక ఉత్తరువు పత్రాలను 'సన్నీ బాయ్'కి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ..... కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి విశిష్ట కృషి చేస్తానని, నమ్మకంతో పదవికి ఎంపిక చేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. డ్రెస్సింగులో తనదైన స్టైల్ చూపించే సన్నీ భాయ్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా సైతం తన మార్కు చూపిస్తాడని రాజ్ భాయ్ విశ్వసాన్ని ఈ భాయ్ నిలబెట్టుకుంటాడని గోదావరిఖని అతని అభిమానులు ఫాలోవర్స్ హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తూ సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షల జల్లులు కురిపించడం కొస మెరుపు.

# ప్రకాష్ నగర్ కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తా

## -ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ



**శేరిలింగంపల్లి,నవంబర్ 12 (వార్తాప్రభ)**:హఫీజ్ పేట్ డివిజన్ పరిధిలోని ప్రకాష్ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కు నూతనంగా ఎన్నుకోబడిన కాలనీ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలవడం జరిగినది.ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను శాలవతో సన్మానించి, అభినదించిన పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ.ఈ సందర్భంగా పీఏసీ ఛైర్మన్ ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ ప్రకాష్ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కు నూతనంగా ఎన్నుకోబడిన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియచేయడం జరిగినది. అదేవిధంగా ప్రకాష్ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ వాసులు కాలనీ అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని, కాలనీ లో అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని,కాలనీ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయి అని,ఏ చిన్న సమస్య ఐన తన దృష్టికి గాని తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానని,నూతనంగా ఎన్నుకోబడిన కార్యవర్గ సభ్యులు కాలనీ వాసులందరికి ఎల్లవేళాలో అందుబాటులో ఉంటూ కాలనీ సమస్యల పై స్పందిస్తూ,ప్రతి ఒక్కరు సమిష్టిగా కలిసి కాలనీ అభివృద్ధి కి పాటుపడాలని ఒక ఆదర్శవంతమైన కాలనీ గా తీర్చిదిద్దే క్రమం లో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పీఏసీ చైర్మన్ గాంధీ తెలియచేసారు.ప్రకాష్ నగర్ కాలనీ లో అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని,అసంపూర్తిగా మిగిలిపోయిన పెండింగ్ పనులు త్వరలోనే పూర్తి చేస్తానని,మౌలిక వసతుల కల్పనకై పెద్ద పీట వేస్తానని, కాలనీ అసోసియేషన్ భాగస్వామ్యం తో అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే గాంధీ తెలియచేసారు.ఈ కార్యక్రమంలో ప్రకాష్ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు గౌరవ ప్రెసిడెంట్ బాలింగ్ గౌతమ్ గౌడ్, ప్రెసిడెంట్ పవన్ గౌడ్,కోఆర్డినేటర్ బెనర్జీ, జనరల్ సెక్రెటరీ శ్రీనివాస్ గౌడ్, ట్రెజరర్ పరమేశ్వర్ , అడ్వైజర్లు రమేష్ గౌడ్, నరేందర్ గౌడ్,తిరుపతి రెడ్డి, శ్రీనివాస్ గౌడ్,మధు యాదవ్ వైస్ ప్రెసిడెంట్లు రాజారామ్, ఆంజనేయులు యాదవ్, బాలరాజు గౌడ్, సాయి రెడ్డి, సింహాచలం,రమేష్ జాయింట్ సెక్రటరీలు వినోద్ కుమార్, దేవేందర్,వైకుంఠ రావు, భాస్కర్,శ్రీనివాస్ గౌడ్ ఆర్గనైజింగ్ సెక్రటరీలు మల్లేష్ గౌడ్,రవి, సతీష్ గౌడ్, రావు,శైలజ,లత,ఎక్జిక్యూటివ్ మెంబర్లు వీర స్వామి,రాము, శ్రీనివాసులు,రాజు,శ్రీనివాస రావు,జాలయ్య,శ్రీశైలం యాదవ్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# అభాగ్యులకు ఆపన్న హస్తం గా సీఎం సహాయనిధి-ఎం.ఎల్. ఏ .



**శేరిలింగంపల్లి,నవంబర్ 12 (వార్తాప్రభ)**: మాదాపూర్ డివిజన్ పరిధిలోని సాయి నగర్ కి చెందిన మోహన్ నాయక్ కి వైద్య చికిత్స నిమిత్తం ముఖ్య మంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకొనగా సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన 60,000/- అరవై వేల రూపాయల ఆర్థిక సహాయానికి సంబంధించిన సీఎంఆర్ఎఫ్ చెక్కును బాధిత కుటుంబానికి కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి అందచేసిన పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ.ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ గాంధీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరం అనిప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని పీఏసీ చైర్మన్ గాంధీ పునరుద్ఘాటించారు.అదేవిధంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటున్నదని,అనారోగ్యంకు గురై ఆర్థిక స్థోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు,అభాగ్యులకు అండగా..సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా నిస్తుందని.. పీఏసీ చైర్మన్ గాంధీ ఈ సందర్భంగా తెలియచేశారు.ఆని గతంలో ఉన్న బిల్లులకు అనుగుణంగానే ప్రస్తుతం ఆర్థిక సాయం అందిస్తుందని దానిని మరింత పెంచేలా కృషి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి త్వరలోనే కలిసి వినతి పత్రాన్ని అందజేస్తానని ఆని మరింత ఆర్థిక సహాయం పెంచితే పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుంది అని పీఏసీ చైర్మన్ గాంధీ అన్నారు.ఈ సందర్భంగా వైద్య చికిత్స కి సహకారం అందించిన పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేస్తున్నాము అని బాధిత కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు బాలింగ్ గౌతమ్ గౌడ్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# స్త్రీతోనే జగతి ప్రగతి



కుటుంబంలో పడతి
లేకపోతే వెలితి
భువిలో అసమానము
ఆమె సేవానిరతి
వనిత లేని సదనము
శిథిలమైన భవనము
చూడ అంధకారము
అగును కళావిహీనము
ఇంటి దీపము నాతి
తెచ్చిపెట్టును ఖ్యాతి
ఆమె లేని లోకము
అనుభవించు శోకము
స్త్రీలను గౌరవించు
దైవము సంతసించు
ఆమెతోనే జగతి
జరుగుతుందోయ్! ప్రగతి

**-గద్వాల సోమన్న**

9966414580

### జవహర్ నగర్ మున్సిపల్ పరిధిలోని 100 ఫీట్ల రోడ్డు పనులను పర్యవేక్షించిన

# మేయర్ శాంతి కోటేష్ గౌడ్, డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్,

**జవహర్ నగర్, నవంబర్, 12:( వార్తా ప్రభ)** జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వంద ఫీట్లు రోడ్డు పనులను పర్యవేక్షించిన మేయర్ శాంతి కోటేశ్ గౌడ్, డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్,అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి నష్టపోతున్న వారికి తక్షణమే సహాయం అందే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించడం జరిగింది.ఈ కార్యక్రమంలో హెచ్ ఆర్ డి సి ఎల్ డిపార్ట్మెంట్ డిఇఇ, ఇది, డిఇఇ, విట్టలయ్య , సైట్ ఇంచార్జ్ కీర్తి, టిపిఓ స్రవంతి డిఇఇ మాధవచారి, స్థానిక కార్పొరేటర్ ప్రేమల శ్రీనివాస్, బల్లి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీకాంత్ యాదవ్, నాయకులు, స్థానికులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.





# మాతా నర్సింగ్ హోం సంఘటననూ కోర్టు సుమోటోగా స్వీకరించాలి

### శస్త్ర చికిత్స వికటించిన మహిళ మృతి ఘటనపై అందని నివేదిక వ్యవస్థలను వైద్యుడు డి.రెడ్డి మేనేజ్ చేసినట్లు ప్రచారం




**ఇబ్రహీంపట్నం, నవంబర్ 11 (వార్తా ప్రభ ప్రతినిధి):–** కొండపల్లి మాతా నర్సింగ్ హోంలో శస్త్ర చికిత్స వికటించి మహిళ మృతికి కారణమైన వైద్యుడిపై జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారుల విచారణ పాదరసంగా జరగలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.చందర్లపాడు మండలం కాంద్రపాడుగ్రామానికి చెందిన దూలం మాధవి (25)కి శస్త్ర చికిత్స వికటించి మృతి చెందింది. మహిళ మృతికి గల కారణాలు, శస్త్ర చికిత్స చేసేందుకు వైద్యుడికి ఉన్న అర్హతలపై జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.సుహాసిని ఆదేశాల మేరకు డిప్యూటీ డీఎంహెచ్ వో ఇందుమతి దేవి రెండు రోజుల క్రితం మాతా నర్సింగ్ హోంలో విచారణ చేపట్టారు. అయితే విచారణ నివేదికను సోమవారం వరకు జిల్లా అధికారులకు అందించలేదు. దీనికి సంబంధించిన వివరాలను కూడా. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు మీడియాకు వెల్లడించకుండా గోప్యంగా ఉంచారు. నివేదిక అందిన తరువాత పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని జిల్లా అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే వ్యవస్థలను తాను మేనేజ్ చేసుకున్నానని సంబంధిత వైద్యుడు డి. రెడ్డి చెబుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.. వైద్యుడు చేస్తున్న ప్రచారం చూస్తుంటే వ్యవస్థలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. శస్త్ర చికిత్స వికటించి మహిళ నిండు ప్రాణం బలై నాలుగు రోజులు గడిచినా పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేయలేదు. అసలు డబ్బు కోసం పోలీసుల సమక్షంలో పంచాయితీ జరుగుతుంటే ఏం చేశారని? ప్రశ్నిస్తే సమాధానం దొరకదు. ఈ ఘటనకు సంబంధించి డబ్బు చెల్లించి బాధితులతో రాజీ చేసుకుంటే ఏ కేసూ ఉండదన్న భావనతో వైద్యుడు పంచాయితీ చేసుకున్నట్లు సమాచారం. కాగా దీనిలో పోలీసులకు కూడా భారీగా ముడుపులు అందినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముడుపుల మహత్యంతో చర్యల నుంచి తప్పించుకోవచ్చా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గతంలో జరిగిన సంఘటనలపై ఎలాంటి విచారణను ఎదుర్కోకుండా అధికారులను ముడుపుల మత్తులో ముంచిన వైద్యుడు డి. రెడ్డి ఈ ఘటనకు సంబంధించి తన పలుకుబడితో ముడుపులు ముట్టజెప్పి చర్యల నుంచి తప్పించుకునే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. ఎలాంటి అర్హత లేకుండా శస్త్ర చికిత్స చేసి మహిళ ప్రాణం బలిగొన్న వైద్యుడిపై చట్టప్రకారం చర్యలు తీసుకునేందుకు జిల్లా అధికారులు సిఫార్సు చేయవచ్చు. అయితే వ్యవస్థల్లో ముడుపుల మంత్రం కారణంగా ఈ ఘటనపై చర్యలు ఉండకపోవచ్చునన్న అనుమానాలు బలపడుతున్నాయి. ఈ సంఘటనను కోర్టు సుమోటోగా స్వీకరించి విచారణ జరపాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# ప్రతిపక్ష పార్టీలకు దిమ్మ తిరిగే సమాధానం ఇవ్వాలి

- కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే పిలుపు
- లోకల్ బాడీ ఎన్నికల్లో ప్రతీ కార్యకర్త సైనికుల్లా పని చేయాలి
- అసత్య ప్రచారాలు నమ్మకండి అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపెడతా
- పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటాం
- పాలకుర్తి నియోజకవర్గం శాసన సభ్యురాలు మామిడాల యశస్విని ఝాన్సీ రెడ్డి




**తొర్రూర్ నవంబర్ 12(వార్తా ప్రభ)** తొర్రూర్ డివిజన్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాలకుర్తి నియోజకవర్గం శాసన సభ్యురాలు మామిడాల యశస్విని ఝాన్సీ రెడ్డి పాల్గొన్నారు. మంగళవారం ఈ సందర్భంగా ఎమ్మెల్యే కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి పట్టుకొమ్మలు అన్నారు.ప్రతిపక్ష నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక అబద్ధపు ప్రచారాలు చేస్తూ పార్టీపై మరియు ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రతిపక్ష పార్టీలకు దిమ్మతిరిగే సమాధానం ఇవ్వాలి అని అన్నారు.ఇక్కడికి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మీ గ్రామంలో ఉన్న సోషల్ మీడియాను వేదికగా చేసుకొని గ్రామ కోఆర్డినెటర్లను నియమించి ఇతర పార్టీల వాళ్లు కాంగ్రెస్ పార్టీపై చేస్తున్న విష ప్రచారాలను ప్రజలకు అర్థమయ్యేలా తెలియజేయాలని అన్నారు. ప్రతి ఒక్క కార్యకర్త కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని అన్నారు.గత ఎన్నికల్లో మహిళల పాత్ర చాలా కీలకంగా ఉంది అన్నారు.ఈ సారి లోకల్ బాడీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు గెలుపొందాలంటే మహిళలు ముఖ్య పాత్రను పోషించాలని అన్నారు. అందుకు గ్రామస్థాయిలో ఉన్న మహిళా నాయకులను ప్రోత్సహించడమే కాకుండా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని అన్నారు. పాలకుర్తి నియోజకవర్గం లో యూత్ కు మంచి ప్రాధాన్యత ఉందని, పక్క నియోజకవర్గాలో ఉన్న నాయకులు చెప్తున్నారు.ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని పార్టీ బలోపేతానికి మరింతగా కృషి చేసి రాబోయే లోకల్ బాడీ ఎన్నికల్లో మన పార్టీ అభ్యర్థుల గెలుపులో మీ పాత్ర చాలా కీలకంగా మారాలనీ తెలియజేశారు.అదేవిధంగాకాంగ్రెస్ పార్టీ కోసం మీరు చేస్తున్న త్యాగాలు చూపిస్తున్న ఆదరణ ఇలాగే కొనసాగించాలని అన్నారు. పాలకుర్తి నియోజకవర్గం లో గత అసెంబ్లీ,పార్లమెంట్ ఎన్నికల్లో చూపిన విధంగా విజయడాంక మోగించి, తొర్రురూ మండలంలో ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి గెలుపుకై ప్రతి కార్యకర్తకొత్త పాత తేడా లేకుండా అందరూ కలిసికట్టుగా పార్టీ గెలుపే ఏకైక లక్ష్యంగా పనిచేయాలి అన్నారు. అదేవిధంగా చారిత్రాత్మకంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి సర్వే కుల గణన ఎట్టకేలకు రాష్ట్రంలో ప్రారంభమైంది కులగనణ అనేది బడుగు బలహీన వర్గాల ప్రజలకు అత్యంత ప్రాధాన్యత తో కూడిన అంశం అని అన్నారు.ఏఐసీసీ అగ్రనేత శ్రీ రాహుల్ గాంధీ ఎన్నికల సమయంలో కుల గణనపై ఖచ్చితమైన హామీ ఇచ్చారు. కుల గణన చేపట్టి ఆయా కులాల జనాభాను బట్టి రిజర్వేషన్లు కూడా పెట్టి సామాజిక న్యాయాన్ని సంపూర్ణంగా అమలు చేస్తామని కచ్చితంగా హామీ ఆమె ఇవ్వడం జరిగిందని. కుల గణన విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కేబినెట్ నిర్ణయం తీసుకొని పెద్ద ఎత్తున కార్యక్రమాన్ని చేపట్టింది 85 వేల మంది ఉద్యోగస్తులతో 06 తేదీ నుంచి కుల గణన కార్యక్రమాన్ని చేపడం జరిగిందన్నారు. ఈ, కుల గణన దేశానికి ఆదర్శంగా రోల్ మోడల్ గా తెలంగాణ కులగనణన ఉండాలని అన్ని రకాల చర్యలు చేపట్టామని అన్నారు. కుల గణన విషయంలో ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న విష ప్రచారాన్నికాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఎప్పటికప్పుడు తిప్పి కొట్టాలని అన్నారు. అలాగే గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు అన్ని స్థాయిలలో నాయకులు కులగనణ సర్వేలకు పూర్తిగా సహకారం అందించాలి, అటు ప్రజలలో చైతన్యం చేయడంతో పాటు రాజకీయ కుట్రలను తిప్పికొడుతూ కులగరణ ప్రాధాన్యతను ప్రజలకు వివరించాలి అని అన్నారు.నవంబర్ 5వ తేదీన హైదరాబాద్ గాంధీయన్ నాలెడ్జ్ సెంటర్లో జరిగిన కార్యక్రమంలో రాహుల్ గాంధీ చెప్పిన అంశాలను ప్రజల్లోకి లోతుగా తీసుకెళ్లాలని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క క్యాబినెట్ మంత్రుల ఆమోదంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రతి గ్రామంలో ప్రతి ఇంటింటికి ప్రభుత్వ ఎన్యుమలేటర్స్ తో మీరు కూడా వెళ్లి ప్రజలకు అవగాహన అందిస్తూ, ఎటువంటి సందేహాలు సమస్యలు ఉన్న నివృత్తి చేసి ప్రభుత్వానికి కాంగ్రెస్ పార్టీకి మంచి పేరు ప్రతిష్టలు తీసుకొచ్చేలా పని చేయాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బ్లాక్, మండల అధ్యక్షులు మండల అధ్యక్షులు ముఖ్య నాయకులు,వివిధ గ్రామపార్టీ అధ్యక్షులు,పార్టీ సీనియర్ నాయకులు, మహిళా నాయకులు,యూత్ నాయకులు,సోషల్ మీడియా నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను ప్రారంభించిన మేయర్ శాంతి కోటేష్ గౌడ్, డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్,



**జవహర్ నగర్, నవంబర్, 12:(వార్తా ప్రభ)**జవహర్ నగర్ మున్సిపల్ పరిధిలోని 21వ డివిజన్ గాంధీ నగర్ కాలనీ లో రూ. 10 లక్షల మున్సిపల్ నిధులతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేసినమేయర్ శాంతి కోటేష్ గౌడ్, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, స్థానిక కార్పొరేటర్ ప్రేమల శ్రీనివాస్,ఈ కార్యక్రమంలో జవహర్ అధ్యక్షులు శ్రీకాంత్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కల్లేపల్లి సదానంద్, డివిజన్ నాయకులు గుండ్ల నాగేష్,, సాంబయ్య, నాయకం భాస్కర్, కాలనీ అధ్యక్షుడు సింగన్న బాలరాజు, యూసుఫ్ డాక్టర్, బస్తీ నాయకులు, మహిళలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, నాయకులకు, శాలువాలతో సన్మానం చేసి ప్రత్యేక ధన్యవాదములు తెలియచేసిన శ్రీనివాస్ ,

# అక్రమ పిడిఎస్ బియ్యం లారీ పట్టివేత



**వలిగొండ:నవంబర్ 12 (వార్తాప్రభ ప్రతినిధి)**అక్రమంగా నిల్వ ఉంచిన పిడిఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు స్థానిక ఎస్సై వి. యుగేందర్ గౌడ్ మంగళవారం విలేకరులకు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని రెడ్ల రేపాక గ్రామంలో గల శ్రీ ఆంజనేయ బిన్నీ రైస్ మిల్ లో అశోక లేలాండ్ లారీ నెంబర్ Ap-22w-9699 లో పిడిఎస్ బియ్యాన్ని లోడ్ చేస్తుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. తెల్ల రంగు ప్లాస్టిక్ సంచుల్లో నింపిన 24 టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు, ఇట్టి బియ్యాన్ని రైస్ మిల్లు యజమాని పంతంగి రాజు తక్కువ ధరకు బియ్యాన్ని కొనుగోలు చేసి అక్రమంగా తన మిల్లులో నిల్వ ఉంచుకున్నట్లు ఆయన అంగీకరించారని కావున ఇట్టి విషయంపై పంచనామ చేసి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వి యుగంధర్ గౌడ్ తెలిపారు

# బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి,టీటీడీ బోర్డు మెంబెర్ భాను ప్రకాష్ రెడ్డి కి ఘన సత్కారం





**విజయవాడ పశ్చిమ నవంబర్ 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)**తిరుమల తిరుపతి పాలకమండలి సభ్యుడు భాను ప్రకాష్ రెడ్డి ని ఎన్టీఆర్ జిల్లా బిజెపి నేతలఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని రాష్ట్ర బీజేపీ కార్యాలయం లో ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమానికి ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీ రాం అధ్యక్షత వహించారు.బిజెపి రాష్ట్ర మీడియా ఇంఛార్జి పాతూరి నాగభూషణం, మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బాజీ, ముప్పల వెంకట సుబ్బయ్య, శ్రీధర్,మాదల రమేష్, పట్నాయక్ లు హాజరయ్యారు.తిరుమల తిరుపతి కొండ మీద రాజకీయ ఉపన్యాసాలు కు చెల్లుచీటిదర్శనీయ క్షేత్రం ప్రాశస్త్యం పాలకమండలి కాపాడుతుందిఅతి పెద్ద ధార్మిక క్షేత్రం కలియుగ ప్రత్యేక్ష దైవం వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో టీటీడీ బోర్డు మెంబెర్ గా తనకు అవకాశం కలిపించినందుకు కూటమి ప్రభుత్వానికి భాను ప్రకాష్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.గతంలో టీటీడీ లో సేవ చేసేందుకు కూటమి ప్రభుత్వం అవకాశం కలిపించింది .ఆంధ్రప్రదేశ్ లో ఆలయాలకి మంచి రోజులు వచ్చాయని గత ప్రభుత్వ పాలనలో దేవాలయాలపై దాడులు, విగ్రహాలు మాయం చేసి విధ్వంస ఘటనలు సృష్టించారు.ఆలయంపవిత్రత కాపాడుకునేందుకు గతంలో నేను హై కోర్ట్ ని ఆశ్రయించటం జరిగిందని భాను ప్రకాష్ రెడ్డి గుర్తు చేశారు.గతంలో టీటీడీ లో తీసుకున్న నిర్ణయాలను వెబ్సైటు లో పొందపరిచలేదని ధార్మిక క్షేత్రాన్ని దనార్జన క్షేత్రంగా మార్చారన్నారు.గత జగన్ పాలనలో హై కోర్ట్ సైతం శ్రీవారి పక్షాన నిలబడి న్యాయం చేసిందన్నారు.గత ప్రభుత్వంలో దేవాలయాల నుంచి దోచుకున్న డబ్బుని మొత్తం కక్కిస్తాము అధర్మ కార్యక్రమాలు చేసిన వ్యక్తులని వదిలే ప్రసక్తే లేదన్నారు.హిందూ వ్యతిరేక పాలన అనేది గత ఐదు సంవత్సరాలు జరిగిందని అన్యమతస్తులు ఎవరు టీటీడీ లో పనిచేయటానికి వీలు లేదని టీటీడీ చైర్మన్ స్పష్టంగా తెలియచేసారని మరోసారి గుర్తు చేశారు.అలాంటి వారు ఎవరైనా ఉంటే మాత్రం తప్పనిసరిగా వి ఆర్ తీసుకుంటారో, ట్రాన్స్ఫర్ చేసుకుంటారో చూసుకోవాలని సలహా ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హిందూ ధర్మ పరిరక్షణకై పని చేస్తామని హామీ ఇచ్చారు.ఒక ఆంబోతు టీటీడీ కి వచ్చింది ఒక మంత్రిగా పని చేసిన ఈ వ్యక్తి జగన్ మోహన్ రెడ్డి ఫోటో తో ఉన్న ఒక చిహ్నం వేసుకుని దర్శనానికి వచ్చారు. ఇలాంటి వ్యక్తులపై టీటీడీ కఠిన చర్యలు తీసుకుంటుంది కొండ పైకి వచ్చిన ఏ రాజకీయ నాయకుడైన సరే టీటీడీ నియమ నిబంధనలు పాటించాల్సిందేననిజగన్ కళ్ళల్లో ఆనందం చూడటానికి కొందరు శ్రీవారు కొండపైకి వచ్చి రాజకీయాలు గురించి మాట్లాడుతున్నారు. అన్యమతస్తులు ఎవరైతే వస్తారో వారు తప్పనిసరిగా టీటీడీ నిబంధనలు ప్రకారం డిక్లరేషన్ మీద సంతకం చేసి తీరాలని భాను ప్రకాష్ రెడ్డి స్పష్టం చేశారు.శ్రీవారి కొండపై రాజకీయ ప్రసంగాలు చేసిన, ఇతర ఎలాంటి దుష్ప్రచారం చేసిన వారిపై కఠిన చర్యలు ఉంటాయనిమనం అందరం భక్తుల కోసం పనిచేయాలి భక్తుల సౌకర్యర్థం పూర్తి ద్రుష్టి పెట్టడం జరుగుతుందనిఅందరికి మంచిగా దర్శనం అవ్వాలి టీటీడీ లో కొత్త ఒరవడిని తీసుకొచ్చే విధంగా పాలక మండలి నిర్ణయాలు ఉంటాయన్నారు.జగన్ కి ప్రతిపక్ష హోదా ఇచ్చేది ప్రజలు అధికారం ఇచ్చినప్పుడు ప్యాలస్ లో తిరిగావు, ప్రజల్లో ఎక్కడ తిరిగావు జగన్ కేవలం శాసన సభ్యులు మాత్రమే శాసన సభకి వచ్చి సమస్యలు తెలియచేయకపోతే రాబోయే రోజుల్లో ఎమ్మెల్యే హోదా ఉండదని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్వామి వారి ప్రసాదం నాణ్యత పెరిగిందన్నారు.



అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర ఎన్నికల అధికారి తట్టి అర్జునరావు కార్యాలయంలో ఎన్టీఆర్ జిల్లా మైలవరం లో నవంబర్ 17 న జరగనున్న నియోజకవర్గ కార్తీక వన సమారాధన ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ చేస్తున్న చిత్రం,పాల్గొన్న యాదవ నాయకులుపెద్దీ బోయిన శ్రీనివాస్,చెన్నుబోయిన చిట్టిబాబు,పటాపంచలు నరసింహారావు, నగుళ్ళ నాంచారయ్య, తట్టి ధర్మేంద్ర **–వార్తా ప్రభ, విజయవాడ**

## 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవ ప్రారంభోత్సవ కార్యక్రమాలకు సర్వం సిద్ధం



**విస్సన్నపేట,నవంబర్ 12 (వార్తాప్రభ) :** స్థానిక మండలం కేంద్రంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల కార్యక్రమాలు 14వ తేదీ నుంచి జరగనున్నట్లు లైబ్రరియన్ పి భాను మీడియా సమావేశంలో తెలిపారు. 14వ తేదీ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని బాలల దినోత్సవంతో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమవుతాయని ఆమె చెప్పారు. 15వ తేదీ పుస్తక పఠన ప్రాముఖ్యత మరియు పుస్తక ప్రదర్శన, 16వ తేదీ వ్యాసరచన మరియు పాటల పోటీలు, 17వ తేదీ డిబేటు, క్విజ్, 18వ తేదీ డ్రాయింగ్, 19వ తేదీ తెలుగింటి ఆడపడుచులకు ముగ్గుల పోటీలు, 20వ తేదీ ఎలన్ రీడింగ్ మరియు ఘనంగా బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమం లో జరగనున్నట్లు ఆమె తెలియజేశారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు బస్సులు నడపాలి

● ప్రతిభా రత్న అవార్డు గ్రహీత నల్లపాటి కృష్ణార్జునరావు



**విస్సన్నపేట,నవంబర్ 12 (వార్తాప్రభ) :** స్థానిక కేఎంఆర్ అండ్ ఎం ఎస్ ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు విజయవాడ డిపో బస్సు లను ఉదయం సాయంత్రం వేళలలో నడపవలసిందిగా కళాశాల కరస్పాండెంట్ స్టేట్ ప్రతిభ రత్న అవార్డు గ్రహీత నల్లపాటి కృష్ణారావు విజ్ఞప్తి చేశారు. ప్రైవేటు విద్యాసంస్థలందు విద్యను అభ్యసించలేక ప్రభుత్వ విద్యాసంస్థల బాట పట్టిన పేద విద్యార్థులకు ప్రభుత్వ పరంగా ఏపీఎస్ఆర్టీసీ అండగా ఉదయం సాయంత్రం వేళలలో విజయవాడ డిపో బస్సులను విద్యార్థినీ విద్యార్థుల సౌకర్యార్థం నడపవలసిందిగా ఆయన కోరారు. శాతవాహన రీజియన్ విజయవాడ ఆర్ఎం కు ఆయన వినతి పత్రం పంపినట్లు చెప్పారు

## సరిలేరు నీకెవ్వరు

● సిపిఎం మండల కార్యదర్శి ఎన్నిక ఏకగ్రీవం




**విస్సన్నపేట,నవంబర్ 12 (వార్తాప్రభ) :** స్థానిక మండల సిపిఎం కార్యదర్శిగా నిరంతర పోరాటయోధుడు సమస్యల పరిష్కారానికి కేరాఫ్ అడ్రస్ సరిలేరు నీకు ఎవరు అన్నట్లు విస్సంపల్లి నాగరాజును ఎన్నుకోవడం జరిగింది. స్థానిక సుందరయ్య భవనంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి డివికృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల నాగేంద్రప్రసాద్ తదితరులు హాజరైన ఈ సమావేశంలో 11 మంది సభ్యుల తో ఏర్పడిన కమిటీ పరిధిలో 14 అంశాలు తీర్మానం చేయడం జరిగింది. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడతామని వారు చెప్పారు. మండల కమిటీ సభ్యులుగా మేకల జ్ఞాన రత్నం కె ధనలక్ష్మి జి రామకృష్ణ వీరంగారాణి ఎం రామారావు పి ఏడుకొండలు ఎస్ కె బాజీ, జి రాము కె రమేష్ ఏ కిషోర్ ఎన్నికైనట్లు నాగరాజు మీడియా సమావేశంలో చెప్పారు

## నేడు ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజా వేదిక

**జి.కొండూరు,నవంబర్ 12 (వార్తాప్రభ) :** స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో ఈ నెల 13వ తేదీ బుధవారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించనున్నట్లు ఎంపిడివొ రామకృష్ణ నాయక్ మంగళవారం ప్రకటనలో తెలిపారు.ఉపాధి హామీ పథకములో భాగంగా జి.కొండూరు మండలములో 22 గ్రామపంచాయతీల లో 01.04.2023 నుంచి 31.03.2024 వరకు జరిగిన పనులపై గ్రామ పంచాయి తీల వారీగా 22-08-2024 నుంచి 05-09-2024 వరకు 17వ విడత సామాజిక తనిఖీ (ఆడిట్ )జరిగిందని, ఈ సామాజిక తనిఖీలో గుర్తించిన అంశములపై ప్రజాప్రతినిధులతో 13వ తేదీ బుధవారం ఉదయం 10గంటలకు మండల ప్రజా పరిషత్, జి.కొండూరు కార్యాలయం ఆవరణలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, సెర్ప్, హౌసింగ్, వెటర్నరీ, యస్.యస్.ఎ. పంచాయితీ రాజ్ పథకములపై సామాజిక తనిఖీ కార్యక్రమం పై ప్రజా వేదిక ఏర్పాటు చేయడం జరిగిందన్నా రు.

## ఆగిరిపల్లి గ్రామంలో విద్యార్థినీ విద్యార్థులు మరియు పోలీసు అధికారులు మహిళా పోలీస్ అధికారులు ర్యాలీ




**ఏలూరు జిల్లా/నూజివీడు,నవంబర్ 12 (వార్తాప్రభ) :** ఏలూరు జిల్లా ఎస్పీ కె ప్రతాప్ శివ కిషోర్ ఐపీఎస్ వారు నూజివీడు డిఎస్పీ కె వి.వి.ఎన్.వి ప్రసాద్ యొక్క ఆదేశాలపై ఏలూరు జిల్లాలో నూతనంగా ప్రవేశపెట్టిన అభయ మహిళా రక్షక ప్రోగ్రామ్ గురించి ఈరోజు అనగా 12.11.2024 వ తేది నాడు నూజివీడు రూరల్ ఇన్స్పెక్టర్ కె రామ కృష్ణ గారు ఆగిరిపల్లి పోలీస్ స్టేషన్ ఎస్ఐ శుభ శేఖర్ ఆగిరిపల్లి గ్రామములో ఉన్న జిల్లా పరిషత్ హై స్కూల్ నందు విద్యార్థిని విద్యార్థులకు అభయ మహిళ భద్రత అనే అంశాలపై విద్యార్థిని విద్యార్థులకు అవగాహనను కల్పించినారు. ఈ కార్యక్రమంలో నూజివీడు రూరల్ ఇన్స్పెక్టర్ గారు విద్యార్థిని విద్యార్థులతో మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలపై జరుగు నేరాలను, నేరగాళ్లను అదుపులోనికి తీసుకురావాలని ముఖ్య ఉద్దేశంతో ఈ అభయ మహిళా భద్రత ను జిల్లా ఎస్పీ ప్రవేశపెట్టినట్లు, మహిళా పోలీస్ సిబ్బందితో అభయ బీట్లను జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసినారు ఎవరైనా ఆపద సమయంలో వెను వెంటనే పోలీసు వారి యొక్క సహాయము కొరకు డయల్ 112 కు ఫోను ద్వారా సమాచారం అందించిన పది నిమిషాలలో పోలీసులు మీకు భద్రతను ఏర్పాటు చేస్తారు అని, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, బాల్య వివాహాలకు ఎవరైనా పూనుకుంటే వెను వెంటనే 1098 కు సమాచారం అందించాలని సమాచారం అందించిన వారి యొక్క వివరాలను గోప్యంగా ఉంచుతారని, ఆధునిక సమాజంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించే డిజిటల్ ట్రాన్సాక్షన్ కు ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తున్నట్లు ఇటువంటి విషయాలపై అవగాహన లేని ప్రజలను సైబర్ నేరగాళ్లు చాలా తెలివిగా మోసం చేస్తున్న విషయాలపై ఇప్పటికే పలుమార్లు అవగాహనను కల్పించిన కొంతమంది ప్రజలు వారి యొక్క అవగాహన లోపం వలన సైబర్ నేరగాళ్ల వలలో పడి వారి యొక్క విలువైన డబ్బులను పోగొట్టుకుంటున్నారని ఎవరైనా సైబర్ నేరాలకు గురైన వెంటనే 1930 కి సమాచారం అందించిన వెంటనే సహాయ సహకారాలు అందిస్తారని విద్యార్థిని విద్యార్థులకు పలు అంశాలలో అవగాహనను కల్పించిన నూజివీడు రూరల్ ఇన్స్పెక్టర్ అనంతరం మహిళా చట్టాలు మహిళలకు సహాయాన్ని అందించుట కొరకు ప్రభుత్వం వారి ద్వారా ఏర్పాటు చేయబడిన టోల్ ఫ్రీ నెంబర్లను ప్రదర్శన చేస్తూ ఆగిరిపల్లి గ్రామంలో విద్యార్థినీ విద్యార్థులు మరియు పోలీసు అధికారులు మహిళా పోలీస్ అధికారులు ర్యాలీని నిర్వహించినారు

## రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ శ్రేయస్సుకు నిస్వార్థంగా పనిచేస్తా - చంద్రమౌళి



**కృత్తివెన్ను,నవంబర్ 12 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ కు పెడన నియోజకవర్గం కృత్తివెన్ను మండలం గరిశపూడి గ్రామానికి చెందిన జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి అయిన తిరుమల శెట్టి చంద్రమౌళి అగ్నికుల క్షత్రియ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ గా ఎన్నికైనందుకు కృత్తివెన్ను మండల కూటమి ప్రభుత్వం తరపున కృత్తివెన్ను మండల జనసేన పార్టీ అధ్యక్షుడు పాశం నాగమల్లేశ్వరరావు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ గా ఎంపికైన తిరుమల శెట్టి చంద్రమౌళి మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతను నిస్వార్థంగా నిజాయితీగా నిర్వహించి పార్టీలకతీతంగా పనిచేస్తానని ఒక ప్రకటనలో తెలియజేశారు. పార్టీ పెద్దలు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనని ఇంతకు మునుపు పార్టీ శ్రేయస్సు కోసం ఏ రీతిగా నైతే సేవలు అందించానో రాబోవు కాలంలో కూడా అలానే సేవ చేస్తానని ఆయన తెలియజేసి తనకు ఈ పదవిని కట్టబెట్టిన అధ్యక్షులకు కృతజ్ఞతలు తెలిపారు.

## కూటమి ప్రభుత్వంపై వైసీపీ నేత కన్నబాబు ఆరోపణలు సిగ్గు చేటు : మాల్లాడి రాజేంద్రప్రసాద్



**కాకినాడ,నవంబర్ 12 (వార్తాప్రభ) :** వైసీపీ జిల్లా అధ్యక్షుడు,మాజీ మంత్రి కన్నబాబు తన ఉనికిని కాపాడుకునేందుకు కూటమి ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం సరికాదని జనసేన సీనియర్ నాయకుడు,మాల్లాడి రామారావు చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ మల్లాడి రాజేంద్ర ప్రసాద్ అన్నారు.సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ పార్టీ ఘోర పరాజయం అనంతరం జిల్లా అధ్యక్షుడిగా కన్నబాబు బాధ్యతలు చేపట్టారని అనంతరం పలు మాధ్యమాల్లో ఆయన పార్టీ మారుతున్నట్లు ప్రచారం సాగిందనీ ఈ నేపథ్యంలో స్థానిక డి కన్వెన్షన్ హాల్లో వైసీపి నాయకులు, కార్యకర్తలతో తొలిసారిగా సమావేశం నిర్వహించి కూఖ ప్రభుత్వంపై పలు వ్యాఖ్యలు చేశారన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి,మాజీ ఎంపీ వంగా గీత తదితరులు హాజరుకాగా సభను ఉద్దేశించి ఎమ్మెల్యే కొండబాబుపై ఆరోపణ చేయడం ద్వారంపూడికి పొరపాటుగా మారిందన్నారు. కిళ్ళీ కొట్టునుండి లిక్కర్ దుకాణం వరకు కూటమి నాయకులు దందా చేస్తున్నారనీ ఆయన ఆరోపించడం సరికాదని అన్నారు.మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి ఎమ్మెల్సీగా పద్మశ్రీ అవకాశం ఇచ్చారని,కానీ ఆమె రాజీనామా చేసినప్పుడు ఇది తగదని ఎందుకు ఖండించలేదని మల్లాడి ప్రశ్నించారు.ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్ పాటు మత్స్యకార జాతిని దుర్భాషలాడటం వల్ల ద్వారంపూడికి ప్రజలు బుద్ధి చెప్పారనే విషయాన్ని మర్చిపోవడం దురదృష్టకరమని మల్లాడి అన్నారు. బలమైన సామాజిక వర్గాలను విమర్శించిన ద్వారంపూడి కి కాకినాడ సిటీలో రాజకీయ భవిష్యత్తు లేదన్న విషయం గ్రహిస్తే మంచిదని మల్లాడి సూచించారు. ఎన్నికల సమయంలో మత్స్యకారులు, మా మద్దతు దారులని వారికి అనేక ప్రయోజనాలు కల్పించామని వారే మా పార్టీకి వెన్నుదన్నని చెప్పిన ద్వారంపూడి నేడు ఆ వర్గానికి చెందిన ఎమ్మెల్సీ వెన్నుపోటుదారులుగా డబ్బులుకి అమ్ముడుపోయిందని ఆరోపణ చేయడం దేనికి సంకేతం అన్నారు. ద్వారంపూడి చుట్టూ ఉన్న మాజీ కార్పొరేటర్లు పక్క పార్టీ వైపు చూస్తున్నారని అందుకే వారు దారి మల్ల కుండా చేసేందుకు ఇతరులకు ఫోన్లు తీయవద్దని సభాముఖంగా ఆంక్ష విధించారన్నారు. వ్యక్తిగత స్వేచ్ఛను హరించే పార్టీ వైసీపీకి దక్కిందని మల్లాడి ఎద్దేవా చేశారు. పేరుకి ఇద్దరు మత్యకారులను పక్కన పెట్టుకొని మిగతా మత్స్యకారులను ద్వేషించడం ఎంతవరకు సబబు ఆలోచించుకోవాలన్నారు. త్వరలో తనపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారనే భావనతో ద్వారంపూడి మతి భ్రమించి మాట్లాడుతున్నారు అన్నారు. కాకినాడ రూరల్ పరిధిలో ఇసుక సినీ పక్కిన మాయమైంది అంటూ కన్నబాబు వ్యాఖ్యలపై మల్లాడి స్పందిస్తూ తాను మాజీ మంత్రి మాజీ ఎమ్మెల్యే కూడా ఇసుక దోపిడీ జరుగుతుంటే పై అధికారులకు ఎందుకు ఫిర్యాదు చేయలేదు అన్నారు. ఏదైనా గుడి నిర్మాణాలకు ఇసుక అవసరమైతేవ తాను,మాజీ ఎంపీ గీత, ద్వారంపూడి డబ్బులు ఇచ్చి కొనుగోలు చేస్తామని తెలియజేశారని, అయితే కన్నబాబు డబ్బులు ఇచ్చి కొనుగోలు చేసిన ఇసుక కు సంబంధించి ఒక్క రశీదైనా చూపించగలరని మల్లాడి ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఏవిధమైన హామీలు ప్రజలకు నెరవేర్చలేదని కల్లబొల్లి కబుర్లు చెబుతున్న కన్నబాబుకు రాష్ట్రంలో పెంచిన పెన్షన్ కనబడలేదా అని ప్రశ్నించారు. సూపర్ సిక్స్ పథకాల్లో ఒకటైన ఉచిత సిలిండర్ దీపావళి నుంచి అమలయ్యాయని కన్న బాబుకు కనపడకపోవడం శోచనీయమన్నారు. జన్మభూమి కమిటీ సభ్యులను వాలంటీర్లతో పోల్చడం సరికాదని,గత ఐదేళ్లలో వాలంటీర్లు చేసిన ఘనకార్యాలు కన్నబాబు గుర్తు చేసుకోవాలన్నారు. పార్టీ సభలకు బలవంతంగా జనాల తరలింపు, సచివాలయంలో ప్రేమ వ్యవహారాలు, పెన్షన్ స్వాహా వంటి అకృత్యాలు వైసిపి ప్రభుత్వం ఘనతే అన్నారు. ఇటువంటివి కూటమి ప్రభుత్వంలో లేకపోవడంతో వైసిపి నాయకులకు కళ్ళు కుడుతున్నాయని ఇకనైనా చౌకబారు విమర్శలు మానుకోవాలని మల్లాడి రాజేంద్రప్రసాద్ సూచించారు.

## స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ 2024 ఫైనల్స్ కోసం ఆర్జీయూకేటీ నూజివీడు నుండి రెండు బృందాలు ఎంపిక



**నూజివీడు,నవంబర్ 12 (వార్తాప్రభ) :** స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ (SIH) 2024 గ్రాండ్ ఫినాలేలో పోటీ పడేందుకు ఆర్జీయూకేటీ నూజివీడు క్యాంపస్ నుండి రెండు విద్యార్థి బృందాలు ఎంపిక కాబడ్డాయి. AICTE సహకారంతో విద్యా మంత్రిత్వ శాఖ "ఇన్నోవేషన్ సెల్"ను నిర్వహించింది. ఈ ప్రతిష్టాత్మక ఈవెంట్ కొరకు భారతదేశం అంతటా విద్యార్థుల నుండి 500 కంటే ఎక్కువ సబ్మిషన్లను ఆకర్షించింది. SIH విద్యార్థులకు వారి సాంకేతిక మరియు సృజనాత్మక నైపుణ్యాలను ప్రదర్శించడం ద్వారా వినూత్న పరిష్కారాల ద్వారా వాస్తవ-ప్రపంచ సవాళ్లను పరిష్కరించడానికి ఒక వేదికను అందిస్తుంది. 1. మెషిన్ లెర్నింగ్ని ఉపయోగించి "స్మార్ట్ ఆటోమేషన్ ఆఫ్ డైనమిక్ రూట్ రేషనలైజేషన్"పై దృష్టి సారించి, సమస్య ప్రకటన SIH-1617 కోసం సాఫ్ట్వేర్ ట్రాక్ కింద పి. వెంకటేష్ నేతృత్వంలోని "ఛేజింగ్ హారిజన్స్" బృందం పోటీపడుతుంది. అధునాతన ఆటోమేషన్ టెక్నిక్ల ద్వారా రూట్ ఆప్టిమైజేషన్ను విప్లవాత్మకంగా మార్చడం వారి ప్రాజెక్ట్ లక్ష్యం. సభ్యులు మనోజ్ కుమార్, వినుత స్నేహ, విశ్వ దత్తా, నౌషిన్ ఫర్హానా మరియు సిద్ధార్థతో కూడిన బృందం డిసెంబర్ 11-12, 2024న ఛత్తీస్గఢ్లోని భిలాయ్లోని రుంగ్తా కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో తమ పరిష్కారాన్ని ప్రదర్శించనున్నారు. 2. అదేవిధంగా, టీమ్ "ఇన్నోవేటింగ్ఎక్స్ ," ప్రవంతి నేతృత్వంలో, ఎలక్ట్రికల్ మరియు ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ కేటగిరీలో SIH-1600 సమస్య ప్రకటన క్రింద వారి ప్రాజెక్టను ప్రదర్శిస్తుంది. చంద్ర సిద్ధార్థ, మనోజ్ కుమార్, లోకేష్, యసస్విని మరియు దివ్యలతో కూడిన ఈ బృందం డిసెంబర్ 11-12, 2024న కర్ణాటకలోని మైసూరులోని విద్యావర్ధక కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్లో పోటీపడుతుంది. ఆర్జీయూకేటీ నూజివీడు నిర్దేశకులు ఆచార్య ఎస్. అమరేంద్ర కుమార్, పరిపాలన అధికారి డాక్టర్. బి. లక్ష్మణ్, ఫైనాన్స్ ఆఫీసర్ డాక్టర్. నాగార్జున దేవి మరియు ప్లేస్మెంట్స్ ఇంచార్జ్ పి. శ్యామ్ ప్రతిభావంతులైన విద్యార్థులను అభినందించి జాతీయస్థాయిలో వీరు గొప్ప విజయాన్ని సాధించాలని కోరారు

## మోడీజీ సంకల్పం గొప్పది.. ఆచరణలో విఫలం

● బిజెపి సీనియర్ నాయకులు ఎన్ సూరిబాబు




**విస్సన్నపేట,నవంబర్ 12 (వార్తాప్రభ) :** స్వచ్ఛభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి గ్రామ పంచాయతీకి గత సంవత్సరం కొన్ని ప్రాంతాలలో రిక్షాలను మరికొన్ని ప్రాంతాలలో టాక్టర్లను డస్ట్ పిన్నులను కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో అందించడం జరిగిందని ఎన్టీఆర్ జిల్లా బిజెపి సీనియర్ నాయకులు నిగామాను సూరిబాబు మీడియా సమావేశంలో తెలియజేశారు. వీటితోపాటు సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ కర్మాగారాలను ఏర్పాటు చేసేందుకు ప్రతి మండలంలోనూ గ్రామ గ్రామాన సంపద సృష్టించే లక్ష్యంగా తడి చెత్త, పొడి చెత్త లను విడివిడిగా సేకరించే లక్ష్యసాధనలో భాగంగా లక్షలాది రూపాయలతో మిషనరీ దిగుమతి చేసుకొని అందించడం జరిగింది. కొన్ని ప్రాంతాలలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయని వీటికి సంబంధించి సరియైన పర్యవేక్షణ లేకపోవడం ప్రభుత్వ ధనం దుర్వినియోగం అవటమేనని గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం రావడానికి అందరికీ ఆరోగ్యం ఒక కారణం అని తాను నమ్ముతున్నానని పరిసరాలు పరిశుభ్రంగా ఉండేందుకు కేంద్రం నుంచి నిధులు విడుదలైన సద్వినియోగపర్చుకోపోతే లక్ష్యం దెబ్బతింటుందని తద్వారా పరిసరాలు శుభ్రంగా ఉండేందుకు ప్రతి ఒక్కరం సంకల్పం చేసుకోవాలని తొలి అడుగు మన ఇంటి నుండే వేయాలని ఇంటి నుండి అడుగు బయట పెట్టగానే వార్డు సెగ్మెంట్ గ్రామం మండలం జిల్లా తద్వారా రాష్ట్రం సమిష్టిగా సంకల్పిస్తే మోడీజీ కన్న కలలు నెరవేర్చిన వారం అవుతామని ఆయన చెప్పారు. ఆయన అడుగులో అడుగు వేద్దామని సూరిబాబు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ పరంగా గత ప్రభుత్వంలో ఇచ్చిన ఉపకరణాలను వినియోగంలో ఉంచాలన్నారు.

## పులిసిన బెల్లపు ఊట ధ్వంసం






**తిరువూరు,నవంబర్ 12 (వార్తాప్రభ) :** ఎ.కొండూరు మండలం చీమలపాడు గ్రామంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ టాస్క్ ఫోర్స్ (ESTF), విజయవాడ భూక్యా రాంబాబు అను వ్యక్తిని 7 సుంకం చెల్లించిన మద్యం సీసాలతో అదుపులోకి తీసుకొని, కేసు వ్రాసి తిరువూరు ఎక్సైజ్ స్టేషన్ లో అప్పగించారు. తదుపరి ఈ. యస్.టి.యు వారు విస్సన్నపేట మండలం వేమిరెడ్డిపల్లి తండాలో దాడులు నిర్వహించి నాటుసారా కాయడానికి సిద్ధంగా ఉంచిన 950 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను కనుగొని నేరస్థలంలో ధ్వంసం చేయడం జరిగింది. ఈదాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ శేఖర్ బాబు, హెడ్ కానిస్టేబుల్ నాగరాజుబీ కానిస్టేబుల్స్ శివదుర్గ, గోపీకృష్ణ, శివరామకృష్ణ పాల్గొన్నారు. తిరువూరు ఎక్సైజ్ స్టేషన్ లో దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తిరువూరు ఎక్సైజ్ స్టేషన్ అధికారులు, సిబ్బంది విస్సన్నపేట మండలం తాటకుంట్ల గ్రామంలో జరిపిన దాడుల్లో కలసాని నాగరాజు అను వ్యక్తిని 8 సుంకం చెల్లించిన మద్యం సీసాలతో పట్టుకుని అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ దాడుల్లో ఎస్ఐలు కృష్ణవేణి, వెంకట కుమార్, హెడ్ కానిస్టేబుల్స్ రామకృష్ణ, నాగమల్లేశ్వర రావు, కానిస్టేబుల్స్ సత్యనారాయణ, లలిత, వెంకటేష్ నాయక్ పాల్గొన్నారు. నలుగురు పాత ముద్దాయిలను గంపలగూడెం తహశీల్దార్ ముందు సత్ప్రవర్తన నిమిత్తం బైండోవర్ చేయడం జరిగింది.వి.వి.వి.ఎస్.ఎన్.వర్మ, ఎక్సైజ్ ఇన్స్పెక్టర్, తిరువూరు.

## కార్యాలయంలో కానరాని సిబ్బంది.. కాళీ కుర్చీలు, కుక్కలు దర్శనం..!





**కంకిపాడు,నవంబర్ 12 (వార్తాప్రభ) :** రైతులు, ప్రజలు తమ సమస్య చెప్పుకొని అర్జీలు ఇద్దామని వెళితే సిబ్బంది కాన రాకపోగా ఖాళీ కుర్చీలు, గ్రామ సింహాలు దర్శనమిస్తున్నాయి........ఇది ఎక్కడ అనుకుంటున్నారా...? కంకిపాడు తాహసిల్దార్ కార్యాలయంలో.. అది కూడా ఏ ఉదయము లేదా సాయంత్రం అనుకునేరు... ఇది మధ్యాహ్నం సమయములో సంఘటన. రైతులు, స్థానిక ప్రజలు అర్జీలు తీసుకొని వారి సమస్యను వీఆర్వోలకు చెప్పుకుందామని తాహసిల్దార్ కార్యాలయానికి వెళితే క్రింద ఉన్న సిబ్బంది పై అంతస్తులో వీఆర్వో కార్యాలయం ఉంది. వెళ్లి కలవండని చెబితే అక్కడకు వెళ్లిన వారికి ఖాళీ కుర్చీలు, కుక్కలు దర్శనం ఇవ్వడంతో అవాక్కయ్యారు.......అయ్యా... వీఆర్వో సార్లు...! ఎక్కడ మీ దర్శన భాగ్యం..!! సచివాలయాల్లో కనిపించరు.. మండల కార్యాలయంలో వుండరు. మా సమస్యలు తీరే మార్గమేది అంటూ మండలంలోని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే కంకిపాడు మండల పరిధిలో దాదాపు 20 గ్రామాలు ఉన్నాయి.. ఆయా గ్రామాల్లో నివసించే గ్రామస్తులు నిత్యం ఏదో ఒక పనిమీద పంచాయతీ కార్యాలయానికి లేదా సచివాలయానికి వెళ్లి ఆ సంబంధిత అధికారులను కలిసి అర్జీ ఇస్తారు. కానీ ఇక్కడ వీఆర్వో అందుబాటులో లేకపోవడంతో మండల కార్యాలయానికి వెళితే ఖాళీ కుర్చీలు కనిపించాయి. గత కొద్ది రోజుల క్రితం ప్రభుత్వం బదిలీల ప్రక్రియలో భాగంగా మండలంలో పలు గ్రామాల్లో విధులు నిర్వర్తిస్తున్న వీఆర్వోలకు స్థానచలనం చేశారు. ఇది బాగానే ఉన్నా, బదిలీల ప్రక్రియ ముగిసి రెండు నెలలు దాటింది. అయినా ఇప్పటి వరకు మండలంలోని ఏ గ్రామంలో చూసినా సంబంధిత విఆర్వోలు అందుబాటులో ఉండడం లేదని పలు గ్రామాల ప్రజలు అరోపణలు చేస్తున్నారు. సచివాలయాల్లో వీఆర్వోలు లేకపోతే సంబంధిత మండల తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లినా కూడా అక్కడ కూడా వీఆర్వోల దర్శన భాగ్యం కలగడం లేదు. ఆఫీస్ సిబ్బంది కనిపిస్తున్నారే తప్పా... సంబంధిత గ్రామాల వీఆర్వోలు కనిపించకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన పథకాలకు అర్హత సర్టిఫికెట్స్ , పాస్ బుక్, అడంగల్, ఎఫ్ఎంబి నమోదుకు ఆయా గ్రామాల ప్రజలకు తలకుమించిన భారంలా ఉంది. వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని సమాచారం తహసిల్దార్ దృష్టికి వెళ్లిందా ?????... వెళితే తాహసిల్దార్ వారు వెంటనే దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో స్థానిక ఎమ్మెల్యే, ఉన్నత అధికారుల దృష్టికి తీసుకు వెళ్తామని ఆయా గ్రామ ప్రజలు పేర్కొంటున్నారు.

## ఈనెల 14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

**పెడన,నవంబర్ 12 (వార్తాప్రభ) :** ఈనెల 14వ తేదీ నుంచి గ్రంథాలయ వారోత్సవాలు జరగనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పెడన శాఖా గ్రంథాలయంలో కూడా వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈనెల 20వ తేదీ వరకు ప్రతిరోజు వివిధ కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు శాఖా గ్రంథాలయం అధికారి బసవేశ్వర రావు తెలిపారు. స్థానిక ప్రజలు ఈ వారోత్సవాలలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## నారా లోకేష్ ను మర్యాద పూర్వకముగా కలిసిన పేరాబత్తుల రాజశేఖరం



**అమరావతి,నవంబర్ 12 (వార్తాప్రభ) :** మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ ని సచివాలయంలో కూటమి బలపరిచిన తూర్పు - పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం మర్యాద పూర్వకముగా కలసి ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు వివరాలు వివరించారు.ఉభయ గోదావరి జిల్లాల కూటమి ఇంచార్జి మంత్రులు,ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా అధ్యక్షులు,ఇంచార్జిలు నాయకులందరి సహాయముతో ఓటరు నమోదుకు సహాయ కేంద్రాలు ఏర్పాటు చేసి గ్రాడ్యుయేట్స్ అందరికి అవగాహన కల్పించి నమోదు ప్రక్రియ జరుగుతున్నట్లు రాజశేఖరం తెలియజేసారు.

## బీటెక్ విద్యార్థి ఫీజు నిమిత్తం 7,500 రూపాయలు అందించిన మానవత




**హనుమాన్ జంక్షన్,నవంబర్ 12 (వార్తాప్రభ) :** మానవతా హనుమాన్ జంక్షన్ శాఖ వారిచే అప్పనవీడు గ్రామానికి చెందిన కోటే సతీష్ కుమారుడు యశ్వంత్ ఏలూరు రామచంద్ర ఇంజనీరింగ్ కాలేజీలో రెండవ సంవత్సరం బీటెక్ చదువుతున్న విద్యార్థికి రెండవ టరం ఫీజు నిమిత్తం 7, 500 రూపాయలు అందించారు. ఈ కార్యక్రమంలో మానవత అధ్యక్షులు జి. జయరామచంద్ర రావు, రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు , కార్యదర్శి పాబోలు గణేష్ , ట్రెజరర్ ఘంటా ఇందిర , పి వి చలం, జె వి వి సత్యన్నారాయణ , రిటైర్డ్ లెక్చరర్ సుబ్బారావు, కొట్నాని రామచంద్రరావు , వడ్డి రాజేశ్వరరావు, మానవతా సభ్యులు పాల్గొన్నారు. యశ్వంత్ చక్కగా చదువుకుని భావి భారత పౌరుడిగా తయారవ్వాలని దీవించారు.

# విధేయత, నమ్మకం కలిగిన నాయకుడు బూరగడ్డ శ్రీకాంత్..





**గుడివాడ,నవంబర్ 12 (వార్తాప్రభ) :** జనసేన పార్టీకి విధేయత, పవన్ కళ్యాణ్ నాయకత్వం మీద నమ్మకం కలిగిన నాయకుడు బూరగడ్డ శ్రీకాంత్.. అలాగే 2009లో ప్రజారాజ్యం లో నుండి తరువాత 2014 నుండి జనసేన పార్టీ ఆవిర్భావం నుండి నేటి వరకు రాష్ట్రంలో ఒకే పార్టీలో అరదుగా ఉన్న నాయుకులు మన బూరగడ్డ శ్రీకాంత్.. గుడివాడ నియోజకవర్గంలో 2009 ప్రజారాజ్యం పార్టీలో యువ రాజ్యం విభాగం నాయకుడిగా ఉండి బూరగడ్డ ఎన్నో కార్యక్రమాలు చేసి అందరకు ఆదర్శంగా నిలిచారు. ఆ తరువాత 2014లో జనసేన పార్టీ ఆవిర్భావ రోజు నుండి కృష్ణాజిల్లా లో, గుడివాడ నియోజకవర్గంలో జనసేన పార్టీ అభివృద్ధికి బూరగడ్డ శ్రీకాంత్ ఎంతో కృషి చేసారు. 2014 నుంచి 2019 వరకు పార్టీ అభివృద్ధి కి ఎన్నో కార్యక్రమాలు చేస్తూ నాయకుడిగా ఎదిగి 2019 గుడివాడ టికెట్ విషయంలో అన్యాయం జరిగిన.. జనసేన పార్టీ కోసం నిలబడి, కష్టపడిన ప్రజానాయకుడు బూరగడ్డ శ్రీకాంత్ అని కార్యకర్తలు స్పష్టం చేస్తున్నారు.. అలాగే 2024 వరకూ కూడా అనేక కార్యక్రమాలు చేసుకుంటూ వైసీపీ ప్రభుత్వం మీద అనేక పోరాటాలు చేస్తూ, వారు దాడులు చేసిన కేసులు పెట్టిన ధైర్యంతో పోరాడి 2024 లో కూటమి ఏర్పడిన తర్వాత తన భవిష్యత్తును కూడా ఆలోచించకుండా పవన్ కళ్యాణ్ నిర్ణయంతో పాటు ప్రయాణించి.. గుడివాడ నియోజకవర్గంలో వెనిగండ్ల రాము గెలుపుకు కృషిచేసి.. రాము విజయం లో బూరగడ్డ శ్రీకాంత్ ముఖ్య భూమిక పోషించారు. ఈ నేపథ్యంలో పవన్ కళ్యాణ్.. జనసేన పార్టీ తగు న్యాయం చేస్తుందని జనసైనికులు.. అభిమానులు మరియు శ్రేయభిలాషులు ఆశిస్తూ.. చేయాలనీ కోరుకుంటున్నారు.

# పారిశుద్ధ్య పనులను పరిశీలించిన కమీషనర్ శ్రీనివాసరావు..



**గుడివాడ,నవంబర్ 12 (వార్తాప్రభ) :** పురపాలక సంఘ ప్రజారోగ్యశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను మున్సిపల్ కమీషనర్ బి. శ్రీనివాసరావు, అసిస్టెంట్ కమీషనర్ పి.శ్రీనివాసరావు లు పరిశీలించారు. నెహ్రూ చౌక్ సెంటర్, రాజేంద్రనగర్, ఏలూరు రోడ్డు, కోతిబొమ్మ సెంటర్, బంటుమిల్లి రోడ్, విజయవాడ రోడ్, బైపాస్ రోడ్, ఆర్.టి.సి బస్టాండ్ రోడ్, రైల్వే స్టేషన్ రోడ్డు, శ్రీనివాస సెంటర్ మరియు కార్మిక నగర్ మొదలగు ఏరియాలలో శానిటేషన్ వెహికల్స్ తో చెత్త చెదారమును తొలగించి పాటు సున్నము మరియు బ్లీచింగ్ పౌడర్ చల్లారు. ఈ క్రమంలో వెహికల్స్ షెడ్డు ను తనిఖీ చేయడం జరిగినది. 1 నుండి 10 వార్డుల శానిటరీ ఇన్స్పెక్టర్లు, సెక్రటరీలు, శానిటరీ మేస్త్రిలు, శానిటరీ సూపర్వైజర్లు మరియు పిహెచ్ వర్కర్లతో 3వ వార్డులోని పార్క్ నందు సమీక్ష సమావేశాన్ని నిర్వహించి సిబ్బందికి తగు సూచనలు జారీ చేయడం జరిగినది. మధ్యాహ్నం 10,12,26,30,32,33 మరియు 35వ వార్డుల నందు మరియు ఏపీ టిడ్కో నందు గ్యాంగ్ వర్క్ ను ఏర్పాటుచేసి స్వీపింగ్, బ్రషింగ్, డ్రైన్స్ క్లీనింగ్, పిచ్చిమొక్కలు, కాలువ పోగులను తొలగించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్లు, వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ సెక్రటరీ శానిటరీ మేస్త్రీలు మరియు శానిటరీ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

# సత్తుపల్లి నూతన జి.ఎం కార్యాలయ నిర్మాణాన్ని పరిశీలించిన ఐ.ఎన్.టి.యు.సి నాయకులు



**సత్తుపల్లి,నవంబర్ 12 (వార్తాప్రభ) :** సింగరేణి సత్తుపల్లి ఐ.ఎన్.టి.యు.సి యూనియన్ ఆధ్వర్యంలో కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ రజాక్ ఆదేశాల మేరకు సింగరేణి సంస్థ జనరల్ మేనేజర్ కార్యాలయం సుమారు మూడు సంవత్సరాల క్రితం భూమి పూజ చేసి శంకుస్థాపన చేయడం జరిగింది. అయినప్పటికీ ఇప్పటివరకు కూడా పూర్తి కావడం లేదని యూనియన్ ప్రతినిధులు సత్తుపల్లి జనరల్ మేనేజర్ కార్యాలయం నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం వారు మాట్లాడుతూ సంవత్సరాలు గడుస్తున్న ఇప్పటివరకు జనరల్ మేనేజర్ కార్యాలయం పూర్తి కాకపోవడంపై కార్మిక వర్గం అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని , ఇంకా పూర్తికాక పోవడంపై ఆంతర్యం ఏంటని యూనియన్ నాయకులు యాజమాన్యాన్ని ప్రశ్నించారు. సత్తుపల్లిలో జి.ఎం కార్యాలయం ప్రారంభించడం వల్ల ఉద్యోగుల అనేక సమస్యలు పరిష్కారం అవుతాయని తెలియజేశారు. ఉద్యోగులు ప్రతి చిన్న సమస్యకు సుమారు 80 కిలోమీటర్లు కొత్తగూడెం వెళ్ళవలసి వస్తుందని తెలియజేశారు. సత్తుపల్లి నుండి సింగరేణి సంస్థ నిర్దేశించినటువంటి బొగ్గు ఉత్పత్తి లక్ష్యంలో సుమారు 14 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి మరియు రవాణా జరుగుతుందని తెలియజేశారు.



అయినప్పటికీ ఉద్యోగుల సంక్షేమం , మౌలిక సదుపాయాల లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలియజేశారు. సుమారు మూడు సంవత్సరాల క్రితం సత్తుపల్లిలో పి.వి.ఎన్ కాలనీ ఉద్యోగులు నివసించుటకు యాజమాన్యం నిర్మించడం జరిగింది. ఇప్పటివరకు కూడా మౌలిక సదుపాయాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలియజేశారు. కాలనీలో కమ్యూనిటీ హాల్ , పార్క్ , ఓపెన్ జిమ్ , సెంట్రల్ లైటింగ్ , సెక్యూరిటీ చెక్ పోస్ట్ , స్విమ్మింగ్ పూల్ , సీ.ఆర్.క్లబ్ , వాకింగ్ ట్రాక్ లాంటి ఎలాంటి సదుపాయాలు కూడా లేక ఉద్యోగుల అనేక ఇబ్బందులు పడుతున్నారని అని తెలియజేశారు. సత్తుపల్లిని ఏరియాగా గుర్తించి జిఎం కార్యాలయం ప్రారంభించడం వల్ల ఇలాంటి ఎన్నో సమస్యలు సాధ్యమైనంత తొందరగా పరిష్కరించబడతాయని కార్మిక వర్గం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిఎం కార్యాలయం ప్రారంభించడం వల్ల సత్తుపల్లిలో సుమారు 3000 మంది ఉద్యోగులకు అనేక సమ–స్యలు పరిష్కారం జరుగుతాయని , కాలనీ మౌలిక సదుపాయాలు సమకూర్తాయని తెలియజేశారు.సింగరేణి సంస్థ మరియు అనుబంధంగా ఉండే ఓబీ రిమూవల్ కంపెనీలో పని చేసే ఉద్యోగులు , భూ నిర్వాసితుల ఆరోగ్య సమస్యల పరిష్కారానికి అన్ని వసతులతో కూడిన ఏరియా హాస్పిటల్ నిర్మించబడుతున్నారు. అదేవిధంగా జి.ఎం కార్యాలయం ఏర్పడడం వల్ల సింగరేణి ప్రభావిత భూనిర్వాసిత నిరుద్యోగ య–ువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కలుగుతాయని తెలియజేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సింగరేణి సంస్థకు ఉత్పత్తి మరియు రవాణాలో తలమానికంగా ఉన్నటువంటి సత్తుపల్లిని ఏరియాగా గుర్తించి జి.ఎం కార్యాలయం ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ నాయకులు బట్టి విక్రమార్క , తీగల క్రాంతికుమార్ , సీనియర్ నాయకులు చెన్నకేశవరావు , ఫిట్ సెక్రటరీలు రామారావు , బాలాజీ , నాగేశ్వరరావు , నాయకులు రఘువీర్ , సందీప్ , రఫీ దావూద్ , రమేష్ , నజీర్ , శ్రీనాథ్ , అఫ్రోజ్ , ఉపేందర్ , సతీష్ రెడ్డి , గుడిపల్లి శ్రీకాంత్ , మహేష్ ఇతర ముఖ్యనాయకులు , ఉద్యోగులు పాల్గొన్నారు.

# స్కేటింగ్ రోలర్ హాకీలో పతకాలు సాధించిన డా॥ కె.కె.ఆర్ గౌతమ్ స్కూల్ విద్యార్థులు..



**గుడివాడ,నవంబర్ 12 (వార్తాప్రభ) :** ఈ నెల 6 నుండి 8వ తేదీ వరకు మంగళగిరిలో ఎంటిఎంసి స్కేటింగ్ రింక్ వద్ద నిర్వహించిన 36వ ఏపీ స్టేట్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఛాంపియన్ షిప్ 2024 రోలర్ అండ్ ఇన్లైన్ హాకీ ఛాంపియన్షిప్ డా॥ కె.కె.ఆర్ గౌతమ్ స్కూల్ విద్యార్థులు ఘనమైన ప్రతిభ కనబరిచి పలు పతకాలు సాధించారని స్కూల్ ప్రిన్సిపల్ పి.లక్ష్మి ప్రసాద్ తెలిపారు. బాలుర విభాగంలో.. కేడెట్ గ్రూప్లో విభాగంలో 3వ తరగతి జి. అశ్రీత్ బ్రాంజ్ మెడల్ 3వ స్థానం, 4వ తరగతి జె. సమిత్ బ్రాంజ్ మెడల్ 3వ స్థానం మిక్స్డ్ టీం విభాగంలో 4వ తరగతి జె.సమిత్ సిల్వర్ పతకం 2వ స్థానం బాలికల విభాగంలో.. కేడెట్ గ్రూప్లో విభాగంలో 3వ తరగతి దివిష గోల్డ్ మెడల్ 1వ స్థానం, 5వ తరగతి కారుణ్య గోల్డ్ విభాగంలో 1వ స్థానం, 5వ తరగతి వన్షిక గోల్డ్ మెడల్ 1వ స్థానం మిక్స్డ్ టీం విభాగంలో 3వ తరగతి దివిష సిల్వర్ మెడల్ 2వ స్థానం, 5వ తరగతి కారుణ్య సిల్వర్ మెడల్ 2వ స్థానం సబ్ జూనియర్ బాలకల విభాగంలో 4వ తరగతి జె. జాహ్నవి బ్రాంజ్ మెడల్ 3వ స్థానం, జూనియర్ బాలికల విభాగంలో 10వ తరగతి ఇ.నిఖిల సిల్వర్ మెడల్ 2వ స్థానం, మిక్స్డ్ టీం విభాగంలో సిల్వర్ మెడల్ 2వ స్థానం, జూనియర్ బాలుర విభాగంలో 10వ తరగతి కె.భాను ప్రణవ్ బ్రాంజ్ మెడల్ 3వ స్థానం మిక్స్డ్ విభాగంలో సిల్వర్ మెడల్ 2వ స్థానంలు సాధించారు. ఈ విద్యార్థిని విద్యార్థులను మరియు కోచ్ పి.ఎన్.వి.ఎస్. అయ్యప్పలను పాఠశాల ఆవరణలో జరిగిన అభినందన సభలో పాఠశాల ప్రిన్సిపల్స్ ఎం. సత్యారామ్, పి.లక్ష్మి ప్రసాద్, కె.జ్యోతి, ప్రశాంతిలు అభినందించారు.

# మానవతా గుడివాడ వారి అధ్వర్యంలో అన్నదానం..



**గుడివాడ,నవంబర్ 12 (వార్తాప్రభ) :** మంగళవారం మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ గుడివాడ వారీ ఆధ్వర్యంలో కోన రామారావు గారి తల్లి గారైన కోన అప్పాయమ్మ గారి 18వ వర్ధంతి సందర్భంగా గుడివాడలోని అన్నా క్యాంటీన్ నందు అన్నదాన కార్యక్రమం (సుమారు 450 మందికి) నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షురాలు దండమూడి జయలక్ష్మి, ఉమ్మడి కృష్ణాజిల్లా నియంత్రణ కమిటీ చైర్మన్ పొట్లూరి వీరశేషగిరిరావు, గుడివాడ మానవతా సంస్థ చైర్మన్ పిన్నమనేని వేణుగోపాలరావు, గుడివాడ శాఖ అధ్యక్షులు అన్నపరెడ్డి గోపి రెడ్డి, కార్యదర్శి నందమూరి పద్మజ, ఉపాధ్యక్షులు దండమూడి సీతారామ స్వామి, డైరెక్టర్ కోన రామారావు దంపతులు మరియు గుత్తా శైలజ సభ్యులు పోతార్లంక వీర లక్ష్మయ్య, గుడివాడ సంస్థ కోశాధికారి ఘంటా చంద్రశేఖర రావు లు పాల్గొన్నారు.

# కార్తీక వన సమారాధనలో భక్తులు



**కృత్తివెన్ను,నవంబర్ 12 (వార్తాప్రభ) :** పవిత్ర కార్తీక మాసంలో భక్తులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేస్తూ సమారాధనలో నిత్యము పాల్గొని దేవుని ఆశీస్సులు అందుకుని తమ భక్తిని చాటుకుంటూ ఉంటారు. కృత్తివెన్ను మండలం గాంధీనగరం శ్రీ అభయ ఆంజనేయ స్వామి వారి దేవస్థానం వద్ద కార్తీక వన సమారాధనలో భక్తులు పాల్గొని వన సమారాధనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు

# అక్రమంగా ఇసుక నిల్వ చేస్తే కఠిన శిక్షలు తప్పవు - ఆర్.డి.ఓ మాధురి.

**తిరువూరు, నవంబర్ 12 (వార్తాప్రభ) :** తిరువూరు మండలం లోని తిరువూరు మునిసిపల్ పరిధిలో ఇసుక అక్రమ నిల్వల పై వచ్చిన ఫిర్యాదుల మేరకు రెవిన్యూ డివిజనల్ అధికారి కె. మాధురి పలు చోట్ల ఇసుక నిల్వలను గుర్తించియున్నారు, ఎవరైనా నిజమైన లబ్దిదారులు కాకుండా అక్రమముగా నిల్వలను ఉంచితే అలా నిల్వ చేసిన వారిపై క్రిమినల్ కేసులు/ చట్టపరమైన చర్యలు తీసుకోబడునని హెచ్చరించియున్నారు. వచ్చిన ఫిర్యాదులపై రాత్రి అయినా కూడా సదరు ప్రదేశమునకు వెళ్లి తనిఖీ చేసియు న్నారు. ఈ విషయమై ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**● వెల్వడంలో గుంతల రోడ్డు పై పడిన వ్యక్తిని లారీ (టిప్పర్)ఢీ కొన్న వైనం**



**మైలవరం,నవంబర్ 12 (వార్తాప్రభ) :** రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన ఎన్టీఆర్ జిల్లా, మైలవరం మండలం వెల్వడంలో గ్రామం గణపవరం అడ్డ రోడ్డు వద్ద మైలవరం నూజివీడు ఆర్ అండ్ బి రహదారిపై మంగళవారం చోటు చేసు కుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వెల్లడం గ్రామానికి చెందిన ప్రత్తి పాటి నాగరాజు (58) తన భార్యను టివిఎస్ ఎక్స్ ఎల్ మోపెడ్ పై గ్రామ శివారు లోని పత్తిచేలో దించి వస్తుండగా రహదారిపై ఉన్న పెద్ద పెద్ద గుంతలు తప్పించబోయి అదుపుతప్పి కిందపడ్డా డు.అదే సమయంలో నూజివీడు నుంచి మైలవరం వైపు వస్తున్న లారీ (టిప్పర్) రోడ్డుపై పడిన నాగరాజు పైనుంచి వెళ్ళింది.దీంతో నాగరాజు తీవ్ర గాయాల తో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు కిరణ్ ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసి దర్యా ప్తు చేస్తున్నారు.నాగరాజు మృతదేహాన్ని పీఎం నిమిత్తం పోలీసులు మైలవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.





సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నవంబర్ 8 నుండి 13 వరకు ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాపోరు పేరుతో ప్రతి ఇంటింటా ప్రజాయాత్ర నిర్వహించనున్నారు. అందులో భాగంగా మంగళవారం గుడివాడ పట్టణంలోని స్థానిక సుందరయ్య భవనం లో గుడివాడ పట్టణ కార్యదర్శి ఆర్ సి పి రెడ్డి వాల్ పోస్టర్ ను ఆవిష్కరిస్తున్న దృశ్యం.. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రేపాని కొండ, రజిని, ఎల్ సురేంద్ర, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

–గుడివాడ,నవంబర్ 12 (వార్తాప్రభ) :

జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి పురస్కరించుకుని సోమవారం 11వ వార్డు నందు బేసిక్ స్కూల్ అధినేత బేసిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వ్యాసరచన పోటీలో పాల్గొని విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేస్తున్న దృశ్యం.. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆర్సిపి రెడ్డి, టీడీపీ నాయకులు సయ్యద్ జబీన్, భాష, మాచర్ల రామకృష్ణ (ఆర్.కె), నలంద హై స్కూల్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

–గుడివాడ,నవంబర్ 12 (వార్తాప్రభ) :





మంగళవారం భారతీయ జనతా పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు వలపర్ల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యదర్శి మట్ట ప్రసాద్ కి మచిలీపట్నం అర్బన్ డెవలప్మెంట్ ముడా చైర్మన్ గా నియమితులైన సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానిస్తున్న దృశ్యం.. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యాదవ సంఘం అధ్యక్షులు పుట్టి హరికుమార్ యాదవ్, నవభారత్ ఖాదీ స్టోర్స్ అధినేత సయ్యద్ గఫార్, బిజెపి నాయకులు మాకాని జనార్దన్ రావు, పి వీరభద్ర రావు, పి సాయి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

–గుడివాడ,నవంబర్ 12 (వార్తాప్రభ) :

**మహారాజశ్రీ విజయవాడ 2వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో**
**I.P. No. 22/2024**

బిట్వీన్ :
తాళ్ళూరి విజయ కుమార్ ... పిటీషనర్

వర్సెస్

1. తాళ్ళూరి త్రినాథ్
2. పొంగురి పిచ్చయ్య
3. K. లక్ష్మీనారాయణ
4. K.Y.S. శర్మ
5. T. వసంత రెడ్డి
6. ఓలేటి ఆశిష్
7. పి. నారాయణ
8. MD. ఆసిఫ్
9. కె. అప్పయ్య చౌదరి

... రెస్పాండెంట్స్

**టు (రెస్పాండెంట్ నెం. 2 to 4, 6 to 9)**

2. పొంగురి పిచ్చయ్య, తండ్రి : సుబ్బయ్య, హిందూ, వయస్సు : 62 సం.లు, నివాసం : హిల్ అప్ ఏరియా, నియర్ రామాలయం, 4 పిల్లర్ సెంటర్, విద్యాధరపురం, విజయవాడ - 520 012
3. K. లక్ష్మీ నారాయణ, తండ్రి : అవధాని, హిందూ, వయస్సు : 52 సం.లు, నివాసం : బిసైడ్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, విద్యాధరపురం, విజయవాడ - 520 012
4. K.Y.S. శర్మ, తండ్రి : సూర్యనారాయణ (Late), హిందూ, వయస్సు : 56 సం.లు, నివాసము : ఉండవల్లి సెంటర్నియర్ అయ్యప్ప టెంపుల్, ఉండవల్లి, గుంటూరు జిల్లా.
6. ఓలేటి ఆశిష్, తండ్రి : కృష్ణ రావు, హిందూ, వయస్సు : 38 సం.లు, పూర్ణచంద్ర అపార్ట్మెంట్, నియర్ శివాలయం, మొఘల్ రాజ్ పురం, విజయవాడ - 520 010.
7. పాతూరు నారాయణ రావు, తండ్రి : సుబ్బారావు, హిందూ, వయస్సు : 70 సం.లు, నివాసము : వేంకటేశ్వర స్వామి టెంపుల్ వీధి,. విద్యాధరపురం, విజయవాడ-520 012.
8. MD. ఆసిఫ్, తండ్రి : రసూల్, వయస్సు : 39 సం.లు, నివాసము : యనమలకుదురు కాలువకట్ట రోడ్, విజయవాడ రూరల్, విజయవాడ.
9. కె. అయ్యప్ప చౌదరి, తండ్రి : ధర్మయ్య, హిందూ, వయస్సు : 35 సం.లు, నివాసము : గాంధీ బొమ్మ సెంటర్, గొల్లపూడి, విజయవాడ.

పై నెంబరు I.P. లో తాళ్ళూరి విజయ కుమార్ పిటిషనర్ అయి ఉన్నారు. సదరు I.P. నందు మీరు రెస్పాండెంట్స్ నెం. 2 to 4 మరియు 6 to 9 గా యుండి యున్నారు. పిటిషనర్ అయిన తాళ్ళూరి విజయ కుమార్, మీపై మరియు ఇంకా కొందరిపై విజయవాడ 2వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్ట్ నందు Insolvency Petition దాఖలు చేసి యున్నారు. శ్రీ కోర్ట్ వారు రెస్పాండెంట్స్ నెం. 2 to 4 మరియు 6 to 9 వారలకు నోటీసులు జారీ చేసి యున్నను, సదరు నోటీసులను ఉద్దేశ పూర్వకముగా తీసుకొనకుండా వుండుటచేత పిటిషనర్, శ్రీ కోర్ట్ వారికి పేపర్ ప్రకటన ద్వారా తెలియజేయుటకు పిటిషన్ దాఖలు చేసుకోగా శ్రీ కోర్ట్ వారు దానికి అంగీకరించి నందున రెస్పాండెంట్స్ నెం. 2 to 4 మరియు 6 to 9 అయిన మీకు శ్రీ కోర్ట్ వారి ఉత్తర్వుల మేరకు ఈ ప్రకటన ద్వారా నోటీసు జారీ చేయడం అయినది. కావున మీకు ఏమైనా అక్షేపణలు ఉన్న యెడల తేదీ : 25-11-2024న ఉదయం గం. 10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, ప్లీడర్ గారి ద్వారా గాని హాజరై తెలుపుకోవలెను. లేని యెడల మీకు పరోక్షమున తీర్మానం చేయబడునని తెలియ జేయడమైనది.

వాయిదా తేది : 25-11-2024

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
ఇట్లు
Bh. శివ శంకర్, న్యాయవాది, విజయవాడ, సెల్ నెం. 9440174417

9-11-2024

**NOTICE**
**IN THE COURT OF VII ADDL. CIVIL JUDGE (SENIOR DIVISION) : VIJAYAWADA**
**I.A. No. 545 OF 2022 IN A.S. No. 187/2016**

BETWEEN :-
Pilla Kamala @ Kamala Kumari, Wife of Venkateswara Rao, Vijayawada. ... Petitioner
And
Pothina Adinarayana (Died) And Others ... Respondents
To
**R-4** : Pothina Tirnadha Rao, Son of Late Adinarayana, 9-68-2, Cotton Factory Street, Kothapet, Vijayawada - 1
**R-5** : Pilla Bhavani, Wife of Kanaka Rao, D.No. 9-68-4, Cotton Factory Street, Kothapet, Vijayawada - 1
**R-6** : Pilla Aruna, Wife of Uma Maheswara Rao, D.No. 9-68-6, Cotton Factory Street, Kothapet, Vijayawada - 1
**R-7** : Jagupilla Karuna Kumari, Wife of Srinivasa Rao, R/o. Anusha Cable, Frizerpet, Vijayawada.
**R-8** : Thothadi Nagamani, Wife of Satyanarayana @ Raju, R/o. Manikantha Real Estates, Near Car Shed, Madhurawada, Visakhapatnam.
... Respondents 4 to 8

Respondents 4 to 8 take notice in the above Petition filed against You by the Petitioner to Add You as Legal Heirs of the Deceased First Respondent i.e., Pothina Adinarayana and the said I.A. 545/2022 stands posted to 18-11-2024 for Your appearance, at 10-30 A.M., before this Hon'ble Court on that Day. Else next step follows.

(By Order)
**T.V.N. VASUDEVA RAO**
Advocate for Petitioner
Gudivadavari Street, Vijayawada-1.
12-11-2024

**మహారాజశ్రీ క్రిష్ణాజిల్లా మచిలీపట్నం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**
**E.P. No. 53/2024 in R.C.C. No. 8/2015**

Between :-
బ్రహ్మసమాజం, బందరు, రిప్రెజెంటెడ్ బై సెక్రటరీ : ఉడత్తు శ్రీనివాసరావు, S/o. (లేటు) సుబ్రహ్మణ్యం, నివాసం : డోర్ నెం. 4/530, రాజుపేట, మచిలీపట్నం, బందరు మండలం, క్రిష్ణా జిల్లా ... D.Hr
మరియు
మోటేపల్లి ఫణి కుమారి, D/o. (లేటు) గోపాల క్రిష్ణమూర్తి, అద్దెదారు : డోర్ నెం. 11/690, జగన్నాధపురం, మచిలీపట్నం, బందరు మండలం, క్రిష్ణా జిల్లా. ... J.Dr

పై నెంబరు E.P. లో J.Drకు నోటీసు అమలు నిమిత్తం ది. 28-11-2024నకు వాయిదా అయి వున్నది. కావున సదరు వాయిదా రోజున ఉదయం గం. 10-30 ని.లకు పై కోర్టు వారి యెదుట సదరు J.Dr స్వయంగా గానీ లేదా న్యాయవాది గారి ద్వారా గానీ హాజరై అక్షేవణలు తెలుపుకొనగలరు. లేని యెడల మీ పరోక్షమున తదుపరి గ్రంథములు జరిపించబడునని యిందు మూలంగా తెలియజేయటమైనది.

**వాయిదా తేది : 28-11-2024**
(శ్రీ కోర్టు వారి వుత్తర్వుల ప్రకారం)
**Y.U.S.V.V. సుబ్బారావు**
D.Hr తరఫున అడ్వకేట్
మచిలీపట్నం
మచిలీపట్నం.
ది. 12-11-2024

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada .krishna Dist. AP. and Published from # 34-2-74, Bellapu Shobhanadri Street, Kasthuribaipeta, Vijayawada. Krishna Dt. AP Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188